

డేంజరస్
డయాబాలిక్
MVS
PUBLICATIONS
మధుబాబు

# డేంజరస్ డయబాలిక్

"రాత్రిపూట ప్రయాణం వద్దంటే విన్నావు గాదు....." విసుక్కున్నాడు రాజారావు. మౌనంగా విండో గ్లాస్‌లో నుంచి బయటికి చూస్తూ కూర్చుంది అతని భార్య. వెనుక సీట్లో నిద్రపోతున్నారు ఇద్దరు కొడుకులు.

సొంత కారులో తిరుపతి పోదామని ఆమె కోరిక. కారు కొన్న తరువాత సంవత్సరం పాటు పని తొందరలని చెప్పి వాయిదాలు పెట్టాడు. ఇప్పుడు తప్పలేదు. నెల్లూరు దాటిన దగ్గర నుంచి జోరున కురుస్తోంది వర్షం. ఇకో పది మైళ్ళు పోతే గాని షెల్టర్ లేదు.

డాష్ బోర్డులో నుంచి డస్టర్ తీసి ముందు అద్దానికి పట్టిన చెమ్మను తుడిచాడు. ముందు పది అడుగుల దూరం కన్నా ఎక్కువ కనిపించటం లేదు. అసలే ఆ ట్రంకురోడ్డు మీద యాక్సిడెంట్లు ఎక్కువ. ఇంత వర్షంలో పొరపాటున ఏమైనా జరిగితే.....

వైల్డ్‌గా వస్తున్న ఆలోచనలకు కళ్ళాన్ని బిగించి దృష్టినంతా డ్రైవింగ్ మీదే కేంద్రీకరించాడు. స్పీడో మీటర్‌లో ముల్లు ఇరవై అయిదు మీద కొట్టుకుంటోంది.

* * *

కాలు యాక్సిలేటర్ మీద నుంచి తియ్యకుండా రోడ్డుకు చివరగా పోనిచ్చి, సడన్‌గా స్టీరింగ్ వీల్‌ను కుడివైపుకు తిప్పింది లూసీ. రెండు చక్రాలు గాలిలోకి లేచాయి. కుడి వైపు టైర్లు బాధగా మూలిగాయి. పెద్ద శబ్దంతో కారు కుడివైపుకు తిరిగింది. లోపలున్న వారందరూ ఒకళ్ళ మీద ఒకళ్ళు పడ్డారు.

"శభాష్ లూసీ డ్రైవింగ్ అంటే అది" మెచ్చుకున్నాడు ఒక యువకుడు. నోట్లో సిగరెట్ వెలుగుతున్నది. లూసీకి దగ్గరిగా జరిగి భుజాల మీద చెయ్యి వేశాడు. ఆ పొగడ్తకు వుబ్బిపోయిందామె. స్పీడో మీటర్ నీడిల్ తొంభై దాటింది. ఆ సెడాన్ స్పోర్ట్స్ కార్ హైపవర్ హెడ్ లైట్లు వర్షాన్ని చీల్చుకొని దారిని చూపిస్తున్నాయి. "గివ్ మీ దట్ స్మోక్ మాన్ " అడిగింది. తన నోట్లో సిగరెట్టును తీసి ఆమె పెదవుల మధ్య పెట్టాడు విజిల్ వేస్తూ.

"కమాన్ హర్రీఅప్. పోనీయ్ లూసీ! ఏమిటిది జట్కా బండిలా నడుపుతున్నావ్?" వెనుక సీటులోని స్నేహితులు మరింత హుషారు వేశారు. సిగరెట్టు పొగ లోపలికి పోగానే లూసీలో వింత మార్పు వచ్చింది. పిచ్చిగా నవ్వుతూ యాక్సిలేటర్‌ను పూర్తిగా కిందికి నొక్కింది. బర్ర్ మంటూ ముందుకు దూసుకుపోయింది సెడాన్!

కారు రోడ్డు పక్కకు తీసి సిగరెట్టు వెలిగించుకున్నాడు రాజారావు. పొగ వదులుతూ చుట్టూ చూశాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. ఆ సమయానికి హెవీ ట్రాఫిక్ వుండవలసిన రోడ్డు. ఆ రోజు ఒక్క కారు గూడా ఎదురురావటం లేదు...... వర్షం దంచేస్తుంది. తగ్గే సూచనలెక్కడా కనుపించటం లేదు. ఉరుములు మెరుపులతో ఆకాశం భీకరంగా వుంది.

అంతవరకూ అతనితో పాటు మేలుకొని వున్న భార్య కూడా కునికిపాట్లు పడనారంభించింది. పిచ్చిది అనుకుంటూ ప్రేమగా ఆమె వంకోసారి చూసి గేరు మార్చి అంబాసిడర్‌ను ముందుకు పోనిచ్చాడు.

ముందు ఎడమ వైపుకు మలుపు తిరిగింది రోడ్డు. డ్రైవింగ్ రూల్సు ప్రకారం లైట్లు డిమ్ చేసి సిగ్నలిచ్చి పోయాడు. ఎక్కడో దూరంగా చెట్ల మధ్యలో రెండు హెడ్ లైట్లు కనపడి మాయమయ్యాయి. తనలాగా వేళ కాని వేళలో ఈ భయంకర వాతావరణంలో ప్రయాణించే వారున్నందుకు నవ్వుకున్నాడు.

నిద్రలో అతని భార్య ఏదో కలవరిస్తోంది.

కనపడి మాయమయిన కారులైట్లను గమనించింది లూసీ. వెనుక సీటులో నుండి పాప్ మ్యూజిక్ టేప్ రికార్డరులో నుంచి ఎక్సైట్‌గా వినపడుతున్నది. తిరిగి ఆ కారు లైట్లు కనపడేసరికి దానికి వంద గజాల దూరంలో వుండాలి. అనుకుంది. అదే స్పీడులో రయ్ మని పోనిస్తుంది.

లైట్లు ఆఫ్ చేసి సిగ్నలిచ్చాడు రాజారావు. అంత స్పీడులో తోలకపోతే ఏం? అనుకొని చిరాకుపడ్డాడు. అప్రయత్నంగా అతని కాలు బ్రేక్ మీదికి వచ్చింది. స్పీడో మీటరు నీడిల్ పదిహేను మీదికి దిగింది.

అందరిలాగా తను ఎడమ వైపునే ఎందుకు పోనీయ్యాలి? సరదాగా రోడ్డు కుడివైపున ఎందుకు పోకూడదు? అంబాసిడర్ లైట్లు డిమ్ అవటం చూసి వెకిలిగా నవ్వింది. పిరికివాళ్ళు, కారు నడపటానికి చేతకాని వాళ్ళు, కార్లలో ఎందుకు ప్రయాణించటం?

మలుపు తిరిగేసరికి ఎదురుగా వచ్చిన కారును చూసి కంగారుపడ్డాడు రాజారావు. ఇదేమిటి? ఎడమ వైపున వస్తోందేమిటి? అతనితో సంబంధం లేకుండానే అతని చేతులు అలవాటు పడిన పనిచేశాయి. బ్రేకులు నొక్కి, పూర్తిగా ఎడమకు కోశాడు. పక్కన వున్న రాళ్ళను కొట్టుకొని పది అడుగుల లోతున్న

గుంటలోకి దొర్లిపోయింది అంబాసిడర్. చక్కగా పల్టీకొట్టి అంబాసిడర్ మీద తల్లకిందులుగా పడింది సెడాన్.

* * *

"సార్! మీరు వెంటనే ఏదో ఒకటి చెయ్యకపోతే మా విద్యార్థులను ఆపటం కష్టం" ప్రిన్స్‌పాల్‌తో అన్నాడు స్టూడెంట్ యూనియన్ లీడర్.

ఆఫీసు బాల్కానీలో నిలబడి కిందికి చూశాడు. ప్రిన్స్‌పాల్ సుమారు రెండువందల మంది విద్యార్థులు కింద గుమికూడి వున్నారు. స్లోగన్స్‌తో దిక్కులన్నీ ప్రతిధ్వనిస్తున్నాయి. అందరి చేతుల్లోను ప్రొటెస్టు బానర్స్ వున్నాయి.

కాలేజి లోకి రావటానికి రూల్సు ఒప్పుకోనందున కాంపౌండ్ బయట నిలబడి వున్నారు కొందరు పోలీస్ కానిస్టేబుల్స్. యాజిటేషన్ పీస్‌ఫుల్‌గా జరిగిపోతోంది. అందరి సానుభూతి స్టూడెంట్సు మీద ప్రసరిస్తున్నది. అవసరం లేకపోయినా, నామకహా వచ్చి నిలబడ్డారు పోలీసులు.

ప్రిన్స్‌పాల్‌ను బాల్కానీలో చూసి – స్లోగన్స్ స్థాయి పెంచారు విద్యార్థులు. కాలేజి బిల్డింగులు దద్దర్లిలి పోతున్నాయి. ప్రొటెస్టు బానర్లు గాలిలో వూగుతున్నాయి జెండాలలాగా.

చేతులెత్తి వారిని ఆగమని సైగ చేశాడు ప్రిన్సిపాల్. తను వారి లీడర్‌తో మాట్లాడి అన్ని విషయాలు చక్కబరుస్తానని వాగ్దానం చేస్తున్నాడు.

ప్రిన్స్‌పాల్ స్టూడెంట్సుతో ముఖాముఖీని మాట్లాడటం చూసి పోలీసులు హాయిగా నిట్టూర్చారు. ఇక తమకు నిలువుకాళ్ళ భత్యం తప్పిందనుకుని సంతోషించారు. ఇంకా ఎంతోసేపు వుండదీ డిమాన్‌స్ట్రేషను.

ఎక్కడి నుంచో రయ్ మంటూ దూసుకువచ్చి ఒక కానిస్టేబుల్ తలకు తగిలిందో రాయి. వులిక్కిపడ్డారు పోలీసులు.

విద్యార్థులలో కలకలం బయలు దేరింది. రోడ్డుమీద పోలీసులు స్టూడెంట్లను కొడుతున్నారట.

"చూస్తారేం!" ఆవేశంతో అరిచాడొక వ్యక్తి. "బయలు దేరండి! పోలీసుల జులుం నశించాలి." విరగ దొక్కుకుంటూ కాంపౌండ్ బయటకు పరుగెత్తారు స్టూడెంట్లు.

"సార్! స్టూడెంట్లు రాళ్లు విసురుతున్నారు. మనం తక్కువ మంది వున్నాం. ఆపటం కష్టమేమో!" సర్కిల్ ఇనస్పెక్టర్‌తో అన్నాడు సబ్ ఇనస్పెక్టరు. జీపులో వైర్ లెస్ సెట్ పనిచేయటం ప్రారంభించింది.

గట్టుతెగిన వరదలా వచ్చి పడ్డారు స్టూడెంట్లు. తాము ప్రశాంతంగా కాలేజీ కాంపౌండ్‌లో తమ యాజిటేషన్ కంటిన్యూ చేసుకుంటుంటే, ఈ పోలీసులు కండకావరంతో విద్యార్థుల్ని హింసిస్తారా? ఈ రోజుతో అటో ఇటో తేలిపోవాలి! పోలీసుల మీదికి ఒంటి కాలి మీద లేస్తారేం? ఈ స్టూడెంట్లు. ఎక్కడో దూరంగా కనపడిన ఎర్రటోపీమీద రాళ్ళు వేస్తే గాని వూరుకోవా వారి చేతులు? తమ డ్యూటీని తాము చేసుకుపోతుంటే వచ్చి రెచ్చగొట్టి వైలెన్సుకు దిగిన స్టూడెంట్ల మీద విరుచుకుపడుతూ అనుకున్నాయి పోలీసులు లాటీ కర్రలు.

నిముషాలలో ఆ రోడ్డు మీద వున్న షాపులన్నీ మూయబడ్డాయి. మూయటంలో ఆలస్యం జరిగిన షాపుల అద్దాలు నిలువలేదు. లోపల సామాన్లు ఆగలేదు. విరగదొక్కుంటూ విజృంభించారు విద్యార్థులు.

సైరన్లు మోగించుకుంటూ క్షణాల మీద వచ్చి పడింది పోలీసుల బలగం. స్టీలు హెల్మెట్లు ఇనుప లాటీలు, టియర్ గాస్ షెల్సు, ఒక పెద్ద కురుక్షేత్రంగా తయారైపోయింది ఆ ప్రదేశం.

* * *

"కమాన్ విజయ్! కమాన్. ఇంకో సిక్సర్. డబుల్ సెంచరీ కొట్టాలి." హుషారుగా క్రికెట్ మీది తమకంతో అరుస్తున్నారు విద్యార్థులు. వారి అభ్యర్థనలను కాదనలేనట్లు, వారు తన మీద వుంచుకున్న అభిమానాన్ని వమ్ము చేయకూడదన్న నిశ్చయంతో పట్టుదలగా ఆడుతున్నాడు విజయ్.

విజయ్‌ని పడగొట్టాలనే వుద్దేశ్యంతో బౌలింగ్ టాక్టిస్‌ను ఛేంజి చేశాడు రైవల్ స్కిప్పర్. ఫాస్టు బౌలర్‌ను ఆపి స్పిన్నర్‌ను వదిలాడు ఫీల్డులోకి. నాలుగడుగులు నడిచి చెయ్యి ఎత్తి సున్నితంగా బాల్‌ను వదిలాడతను.

ఆ చేతినే గమనిస్తున్నాడు విజయ్. డబుల్ సెంచరీకి ఇంకో రెండు రన్నులు మాత్రమే బాకి. ఈ బాల్‌ను జాగ్రత్తగా ప్లేస్ చేయగలిగితే.....

నేల మీద పడి సర్రున పక్కకు తిరిగింది బాలు. డిఫెన్సు ఆడదామని బాటు ఎత్తబోయి మనసు మార్చుకున్నాడు విజయ్. బాలు వచ్చి రైట్ లెగ్‌కు తగిలింది. ఎంపైర్ ఎల్.బి.డబ్లూ ఎనౌన్స్ చేశాడు. స్పిన్నర్ చౌకచక్యానికి అభినందిస్తూ పెవిలియన్ వైపు అడుగులు వేశాడు విజయ్. నైస్ బౌలింగ్ ఫైన్ ప్లే.

"అన్యాయం, మోసం. ఎంపైర్ పక్షపాతం చూపించాడు. చూస్తారేం లేవండి!" ఆవేశంగా అరిచిందొక కంఠం. తటపటాయిస్తూ వెనుకకు చూశారు

కొందరు. అరిచిన మనిషి ఎక్కడా కనపడలేదు. స్టేడియంలో ఇంకో చోట కలకలం బయలు దేరింది.

"మన స్పిన్నర్ దెబ్బకు తట్టుకోలేక ఎంపైర్‌ని నిందిస్తున్నార్ట వాళ్ళు. మనమేనా గాజులు తొడుక్కుని కూర్చుంది? లేవండి ?" రెచ్చగొట్టాడొకడు.

మాటలు పెరిగాయి చేతులు కలిశాయి. ఎందుకో ఎవరికో ఏమో అన్న యుక్తాయుక్త విచక్షణ మరిచి స్టేడియంలో వీరవిహారం చేశారందరూ. పోలీసులు కల్పించుకున్నారు. లాటీలు లేచాయి. రాళ్ళు గాలిలోకి ఎగిరాయి. బల్లలు విరిగాయి. స్టేడియమంతా మూలుగులు పెడబొబ్బలతో – పగిలిన తలలతో రణరంగంలా తయారైపోయింది.

* * *

ట్రాఫిక్ సిగ్నల్ రెడ్ లైట్‌ని చూసేసరికి తన ఓల్టు స్టాండర్డు కారు బ్రేకును బలంగా నొక్కి ఆపాడు ప్రొఫెసర్ రమేష్. అప్పటికీ కీచుమంటూ ప్రొటెస్టు చేస్తూ రెండడుగులు ముందుకు పోయి ఆగింది కారు.

ఇక ఈ కారును మార్చక తప్పదనుకున్నాడు. ఎప్పటికప్పుడు ఏవేవో అవాంతరవల్ల అమ్మటానికి వీలు చిక్కంది కాదు. రెండు వారాల క్రితం అమ్మదామని నిశ్చయం చేసుకొన్నాడు. అనుకోకుండా వచ్చిపడింది స్టూడెంట్స్ యాజిటేషన్. యనివర్సిటీ లోని కాలేజిల్లో ఏదో ఒక గొడవ జరగని రోజు లేదు.

ప్రొఫెసర్ రమేష్ వారం క్రితం వరకూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్. అతనంటే ప్రాణం పెడతారు స్టూడెంట్లు. జీవితాన్ని విద్యాదానం చెయ్యటానికి అంకితం చేసిన వ్యక్తి. చిన్నప్పటి నుంచీ కష్టాల్లో పెరిగినవాడు. చదువుకోవటం

ఎంత కష్టమైనదో అతనికి తెలుసు. స్వయంకృషితో పైకి వచ్చి యూనివర్సిటీ ప్రొఫెసరయ్యాడు. అతన్ని సలహా, సహాయం కోరి రిక్తహస్తాలతో తిరిగిపోయిన స్టూడెంట్లు లేరు ఆ యూనివర్శిటీలో.

అటువంటి ప్రొఫెసర్ రమేశ్‌ను నిందించింది యూనివర్శిటీ అధికార వర్గం. స్టూడెంట్లతో చనువుగా వుండటం తప్పా, వారి కష్టసుఖాలలో పాలు పంచుకొని, వారిలో ఒకరుగా కలిసిపోనినాడు విద్యార్థి – విద్యాబోధకుల మధ్య సత్సంబంధాలు నిలచేదెలా?

వెంటనే వైస్ ఛాన్సలర్ పదవికి తన రాజీనామాను సమర్పించాడు. దానిని అంగీకరించకుండా బోర్డు మీటింగు పెట్టి జరిగిన గొడవలను సమీక్షించి, ఒక నిర్ణయాన్ని తీసుకోవాలని నిర్ణయించబడింది.

మీటింగు ఆరుగంటలకు. అందుకే పయనమయ్యాడు ప్రొఫెసర్. తన స్టూడెంట్లనందరినీ కలుసుకున్నాడు. లీడర్లతో మంతనాలు జరిపాడు. జరిగిన ఘొరాలకు కారణాలు తెలుసుకోగోరాడు.

ఘొరాలు కాక మరేమిటి? అందంగా, ఆనందంగా జరుగుతున్న కాలేజి వార్షికోత్సవాలలో కోలాహలమా? అన్నా చెల్లెళ్ళల్లాగా మెలగుతున్న విద్యార్థీ – విద్యార్థినుల మధ్య సంక్షోభమా? ఆ రోజు జరిగిన మానభంగాలకు రాష్ట్ర మంతా దద్దరిల్లిపోయింది. ఎందుకు చేశమో తెలియక అవమానంతో, సిగ్గుతో ఆత్మహత్యలకు ఒడిగట్టారు కొందరు విద్యార్థులు.

గ్రీన్ సిగ్నల్ వెలగగానే ముందుకు పోనిచ్చాడు. మరో పది నిముషాలలో యూనివర్శిటీ మీటింగ్ హాల్ పక్కన వున్న షెడ్డులో ఆగింది స్టాండర్డ్. కోటు

మడతలు సవరించుకొని, బ్రీఫ్ కేసు పుచ్చుకొని క్రిందికి దిగాడు. వారం రోజులు శలవులు ప్రకటించటం వల్ల యూనివర్శిటీ అంతా నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుంది. వాచ్‌మాన్లు కూడా కనుచూపుమేరలో కనుపించటం లేదు. బోర్డు డైరెక్టర్లందరూ వచ్చి వుంటారీపాటికి. అనుకొంటూ బిల్డింగు వైపు అడుగులు వేశాడు.

సర్రున దూసుకువచ్చి, అతని పక్క నుంచి పోయింది ఒక నీలపు రంగు ఆస్టిన్. ఎవరిదో ఆ కారు అనుకుంటూ దాని గురించి పట్టించుకోలేదు ప్రొఫెసర్. "టప్ టప్" మంటూ సైలెన్సర్ తగిలించిన రివాల్వర్ నిప్పులు కక్కింది. మెట్ల మీద బోర్లా పడిపోయాడు. రెండు గుళ్ళు వీపులో నుంచి దూసుకుపోయాయి! ఒకటి మెడలో నుంచి ప్రవేశించి మెదడును చిన్నాభిన్నం చేసింది.

తన జీవితం విద్యార్థుల కోసం అంకితమిచ్చిన ప్రొఫెసర్ రమేష్ రివాల్వరు బుల్లెట్స్‌తో ప్రాణాలు విడిచాడు.

* * *

" అబ్బ! ఏమిటి రాజూ! ఆత్రపడితే ఎలా!" గోముగా విసుక్కుంది బిందు. కప్పుకోబోతున్న దుప్పటిని లాగటానికి ప్రయత్నిస్తున్నాడు షాడో. బిందు వప్పుకోవటం లేదు అయినా తన ప్రయత్నం ఆపలేదు షాడో. బిగుతుగా వంటి చుట్టూ చుట్టుకుంది. వంపు సొంపులన్నీ అంత అందమయిన దుప్పటిలో నుంచి కూడా వివరంగా పైకి కనిపిస్తున్నాయి.

మీద పడి బాహువులతో బంధించాడు. మెదలటానికి వీలు లేకుండా చుట్టి వేశాడు. "ప్లీజ్ రాజూ!" మరీ ఇంత రౌడీయిజం పనికి రాదు. గుండ్రంగా

సున్నాలాగా తెరుచుకున్న నోటి మీద ముద్దులు కురిపించాడు. ఎర్రటి ద్రాక్ష పళ్ళలాగా వున్న పెదవుల్లోని మధువులను స్వాధించాడు తమకంతో.

వూపిరి సలపక వుక్కిరి బిక్కిరయ్యింది బిందు. ఆమెలో కోరిక పడగవిప్పిన కోడెనాగులా బుసలు కొట్టింది. వంటి మీది దుప్పటిని వదిలి షాడో భుజాల చుట్టూ బాహువులను పెనవేసింది. సన్నగా పొడుగ్గా వున్న వేళ్ళు అతని కండల్ని నొక్కి పట్టాయి. పెదవులు ఆత్రంగా జోడీకోసం వెతకసాగాయి. కనులు అరమూసుకుపోయాయి. నిట్టూర్పుల వేగం హెచ్చింది. గదిలో కాలం స్తంభించింది.

తృప్తిగా నిట్టూర్చి లేచి కూర్చున్నాడు అమితానందంతో. పెదవుల మీది చిరునవ్వుతో మాగన్నుగా పడుకుంది బిందు. మంచం కిందపడిన టవల్ చుట్టుకుంటూ మంచం దిగాడు షాడో. చటుక్కున చెయ్యి విసిరి అత్ని మంచం మీదికి లాగింది. తిరిగి లేచే లోపుగానే పూర్తిగా ఆక్రమించుకుంది. "ప్లీజ్ బిందూ ! ఇంత రౌడీయిజం పనికి రాదు."

వెచ్చగా కౌగలించుకుని మత్తుగా అతని గుండెల మీద తలపెట్టుకొని పడుకుంది. తుమ్మెదరెక్కలాంటి వినీల కుంజలాలను సవరిస్తూ వూర్ధ్వ లోకాల్లో విహరించసాగాడు.

"బజ్‌జ్" మంటూ తిరిగి భూలోకానికి తీసుకువచ్చింది అవతలి గదిలోని స్పెషల్ వైర్‌లెస్ సెట్టు. అక్కడికి పోదలచుకోలేదు షాడో. రాను రాను దారుణంగా తయారౌతున్నది సి.ఐ.బి. మూడు వారాలు శలవు గ్రాంటు చేశారు. ఇంకా ఒక

రోజు కూడా పూర్తి కాలేదు. ఎటువంటి పరిస్థితిలోనూ తనను డిస్టర్బ్ చెయ్యనని ప్రామిస్ చేసి ఇరవై గంటలు కూడా కాలేదు. అప్పుడే మొదలా ?

అయినా అప్రయత్నంగా బిందును పక్క మీదికి తోసి పక్కగదిలోకి పోయాడు. న్యూసు పేపర్లు, మాగజైనులు, బట్టలు, హేంగర్లు రకరకాల చెత్తతో గదంతా చిందర వందరగా వున్నది. ఇంకా ఆ గదిని బిందు చూడలేదు. చూస్తే తన పని గోవింద......

"హల్లో !"

"మిస్టర్ షాడో. టాప్ ప్రియారిటీ స్టార్ట్ ఎట్ వన్స్." అంతే! మరొక ముక్క కూడా లేదు. లైన్ కట్ అయింది. ఆలోచిస్తూ బెడ్‌రూమ్ లోకి వచ్చాడు. చీరెకట్టుకుని కుచ్చిళ్ళు సవరించుకుంటోంది బిందు. సీరియస్‌గా వుంది. నవ్వుతూ మంచం మీద కూర్చున్నాడు. ఫలితం లేదు. "బిందూ!" పలకరించాడు పలకలేదు. చెయ్యిజాచి కుచ్చిళ్ళు పట్టుకున్నాడు. ఎడమ చేతితో ఫెడీమని కొట్టింది. తను నేర్పిన విద్యే. తిమ్మిరెక్కింది

"వున్నాడుగా మీ ముసలాడు. ఆయనతో మాట్లాడుతూంటే నీకు ఎవరూ అవసరం లేదు. అక్కడే పో!"

" అది కాదు బిందూ!......"

"షటప్. యూ డర్టీ లయర్. మూడు వారాలు శలవు అని మురిపించావ్. రెండు గంటలు కూడా కాలేదు. అప్పుడే సేవకు బయలు దేరావ్!"

షాడో చూస్తూ వుండగానే విసురుగా వెళ్ళిపోయింది. మరుక్షణం జాగ్వార్ స్టార్టయిన చప్పుడు, బొంయ్‌మని దాని హై పవర్ హారన్ మోత ఒకేసారి వినబడ్డాయి.

* * *

"కమాన్ రాజూ! నీ కోసమే ఎదురుచూస్తున్నాను." చిరునవ్వుతో ఆహ్వానించారు కులకర్ణిగారు. కుషన్ ఛైరులో కూర్చుని పనామా వెలిగించాడు షాడో.

"చాలా ముఖ్యమైన పని వుంది రాజూ. వెరీ ఇంపార్టెంటు. "

"నాకు తగిలించేవి అన్నీ అవేగా? ఇంపార్టెంటు కానివేవి?" ప్రశ్నించాడు షాడో.

సిగార్ నోట్లో పెట్టుకొని జుట్టు సవరించుకున్నారు కులకర్ణి గారు.

"ఏమిటి కథ? బిందు అలిగిందా?" షాడో చిరాకుకు కారణం పసిగట్టి అడిగారు.

తల వూపాడు షాడో. "దీనికి మీరే బాధ్యులు!" అంటూ.

"లెటజ్ కమ్ టు ది పాయింట్ రాజూ. నువ్వు ఈ రూమ్ వదిలి బయటికి పోయేసరికి నీ పేరు "జాన్సన్ .హెర్రిక్"గా మారుతుంది. ఆక్స్‌ఫర్డు యూనివర్శిటీలో ఫిలాసఫీ పి.హెచ్.డి. తీసుకున్నావు."

"అదెప్పుడు?" కళ్ళు తిప్పుతూ అడిగాడు షాడో.

"ఈ రోజే వేళాకోళాలు కట్టి పెట్టి సీరియస్‌గా విను. పేపరు చదువుతున్నావా?" టేబిల్ మీద వున్న ఒక బ్రౌన్ కలర్ పోల్డర్ మీద చెయ్యి వేసి అడిగారు.

నోరు మూసుకున్నాడు షాడో. మళ్ళీ మొదటికి వచ్చింది వ్యవహారం. తనకూ న్యూస్ పేపర్లకూ చాలా దూరం. చదివానంటే ఒక చిక్కు. చదవలేదంటే మరొకటి.

"సరేలే. సమాధానాలు వెతుక్కోకు. నాకు తెలుసుగా నీ సంగతి." అంటూ ఆ ఫోల్టర్‌ను షాడో వైపు తోశారు.

మరొక పనామా వెలిగించి ఫైలు ఓపెన్ చేశాడు షాడో. తేదీల వారీగా పేపర్ కటింగ్‌లు క్లిప్ చెయ్యబడి వున్నాయి. ఐదు నిముషాలలో రెండు వారాల నుంచి మద్రాసు యూనివర్శిటీ కాలేజీలలో జరుగుతున్న గొడవలన్నీ తెలిసిపోయాయి.

"సో? వాట్ యామై టు డు?" ప్రశ్నించాడు.

"రాజూ!" గొంతు సవరించుకున్నాడు. "స్టూడెంట్స్ యాజిటేషన్ అనేది అతి సామాన్యమయిన విషయం మన దేశంలో. ఏదో ఒక రాష్ట్రంలో ఎప్పుడూ ఏదో గొడవ జరుగుతూనే వుంటుంది. వీటిని అదునుగా తీసుకొని మన మోరాలటీని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారు మన శత్రువులు. ఎప్పటికప్పుడు వారి ప్రయత్నాలకు మనం కాళ్ళు అడ్డం పెట్టటం జరుగుతూనే వుంది."

"క్రిందటి సారి నువ్వు మద్రాసులో వారి డ్రగ్ రాకెట్‌ను ధ్వంసం చేసినప్పుడు హెడ్‌లందరూ పట్టుబడ్డారు. కాని దురదృష్టవశాత్తూ చిన్న చిన్న గాంగ్ ముఠాలు తప్పించుకున్నాయి. "

"నెల్లూరు దగ్గిర జరిగిన యాక్సిడెంటులో ఆరుగురు పెద్దవాళ్ళు, ఇద్దరు పిల్లలు మరణించారు. సెడాన్ కారులో మద్రాసు యూనివర్శిటీ విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. వారి దగ్గిర హెరాయిన్‌తో నింపబడిన సిగరెట్లు కనిపించాయి. వాటి మత్తులో పడి రాంగ్ సైడ్‌లో కారు నడిపి యాక్సిడెంటుకు కారకురాలైంది లూసి."

"సేలం కాలేజీ విద్యార్థులకు పోలీసులకు మధ్య జరిగిన సంఘర్షణ – కోయంబత్తూర్ స్టేడియంలో క్రికెట్ ఆట మీద లేచిన గొడవలు – వీటిలో పాల్గొన్న కొందరు విద్యార్థులు హెరాయిన్ వుపయోగిస్తున్నట్లు పరిశీలన వలన తేలింది."

"వీటిని పూర్తిగా అర్థం చేసుకొని తగిన చర్యలు తీసుకుందామనే న్యూసు పేపర్లలో ఈ డ్రగ్స్ విషయం ప్రస్తావించలేదు. "

"హెరాయిన్ వాడేంత ధనవంతులైన విద్యార్థులు మన దేశంలో చాలా తక్కువ. కాని వారికెలా లభ్యమౌతోంది. ఎవరు అందజేస్తున్నారు ?"

పనామా పొగ రింగులు రింగులుగా వదులుతూ వాటిలో నుంచి ఆయన ముఖం చూస్తూ వినోదిస్తున్నాడు షాడో.

"ఈ ఎంక్వైరీలు నా వల్ల కాదు. ఇంకెవరినైనా పంపించండి."

"షటప్ అండ్ లిజన్ రాజూ!" విసుగుతో కోపగించుకున్నారు. "నువ్వు అవసరం కాకపోతే ఎందుకు పిలిపిస్తాను? నీ మొద్దు ముఖం చూడటం నాకు సరదా అనుకున్నావా?"

"మొన్నటి వరకూ వైస్ ఛాన్సలర్‌గా వుండి రిజైన్ చేసిన ప్రొఫెసర్ రమేష్ బోర్డు మీటింగుకు అటెండ్ అవుతుండగా యూనివర్శిటీ కాంపస్‌లో హత్య చేయబడ్డాడు. విద్యార్థులతో చాలా చనువుగా వుండేవాడాయన. అంతకు ముందు రోజే కొందరు విద్యార్థులతో మాట్లాడి ఏవో తెలుసుకున్నట్లు వార్తలొచ్చాయి. అది తెలియక ముందే ఆయన నోరు మూయించారు."

"అతని జేబులో నుంచి ఇదిగో..." ఒక విజిటింగ్ కార్డు బయట పెట్టారు కులకర్ణి గారు.

"యూనివర్సల్ ట్రేడ్ ప్రమోటర్స్.

సీనా టౌన్ మద్రాస్. "

"ప్రొఫెసర్ రమేష్ క్లాస్‌కే నువ్వు రేపు మంగళవారం పోతావు. ఆ కంపెనీకి అతనికి వున్న సంబంధం మనకు తెలియదు. ఆ కంపెనీకి గురించి వాకబు చేశాం. ఆ వివరాలన్నీ నీకిచ్చే బ్రీఫ్‌కేసులో ఎరుపు రంగు ఫైలులో వున్నాయి."

"కనుక ఈ రోజే నువ్వు మద్రాసు చేరుకోవాలి. పాట్నా యూనివర్శిటీ నుంచి వారి రిక్వెస్టు మీద జాన్సన్ .హెన్రిక్ మద్రాసు పోవాల్సి వుంది. అతనికీ నీకు ముఖంలో చాలా పోలికలున్నాయి. అందువల్లనే ఈ పనికి నిన్ను నియమించటం జరిగింది. నీ మొదటి క్లాసు మంగళవారం పది గంటలకుంటుంది. మద్రాసు

యూనివర్శిటీ కాంపస్‌కు దగ్గిర లోనే ఒక ఇల్లు అద్దెకు తీసుకోబడింది. నీ పేరు మీద అక్కడే నీ ఐడెంటిఫికేషన్ పేపర్లు టీచింగ్ మెటీరియల్స్, టెక్ట్స్ పుస్తకాలు, టేప్ రికార్డర్ సెట్స్, డ్రెస్సులు అన్నీ సిద్ధంగా వుంచబడ్డాయి. అవి రక్షణకు నీ మామూలు ఆయుధాలు తీసుకుపోతావు. దయ చేసి వాటిని క్లాసురూముల్లో ప్రదర్శించకు".

సిగార్‌ను ఆష్ ట్రేలో పడవేసి, కాలింగ్ బెల్ నొక్కారు. ముఖమంతా చిరునవ్వులు చిందిస్తూ ఆయన సెక్రటరీ సులోచన వచ్చింది. ట్రేలో కాఫీలు పెట్టుకొని బల్లమీద పెట్టి వెళ్ళిపోయింది షాడోకు కనుగీటి.

"ఆల్ రైట్, ఆల్ రైట్ ప్రొఫెసర్ షాడో. ముందు మన పని కానియ్యండి." వెక్కిరించారు కులకర్ణిగారు.

షాడో కాఫీ తాగుతూ తన పరిస్థితిని రివ్యూ చేసుకున్నాడు.

"కత్తులు, తుపాకులతో తిరిగే తనను పాఠాలు చెప్పటానికి పంపటం అన్యాయం. ఫిలాసఫీని గురించి తనకేం తెలుసు? రివాల్వర్‌ని ఎన్ని రకాలుగా పేల్చవచ్చో అడిగితే చెప్పగలవాడు గాని. తన ఆయుధాలు తీసుకుపొమ్మంటే.... ఏదో పెద్ద కథే వుంది ప్రొఫెసర్ షాడో చెప్పటానికి. "

"నీ ఇంటి గారేజిలో ఒక సెకండ్ హేండ్ ఫియట్ వుంటుంది నీదే అది. దాని తాళం చెవులు ఇంట్లో వున్నాయి. ఇన్‌ఫర్‌మేషన్ డిపార్టుమెంట్ హెడ్ ఒకతను అక్కడ నీ కోసం ఎదురుచూస్తూ వుంటాడు. అతనే అన్ని విషయాలు నీ ఫిలాసఫీ సబ్జెక్టును గురించి నీకు తెలియపరుస్తాడు."

"రాజూ! మన యువతరం మీద దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఆట కట్టించాలి."

"ఎనీ క్వశ్చన్స్?" ప్రశ్నించారు ఆఖరున.

"యస్. నాకు పోలీసుల సహాయం కావాలి."

"నో. నో. ఇంపాసిబుల్. అబ్సర్డ్. వాళ్ళు రంగంలోకి వస్తే మన ప్రయత్నాలన్నీ బట్టబయలైపోతాయి. అప్పుడు నువ్వు పోయి ప్రయోజన మేముంది?"

తాను చేయదలుచుకున్న పని వివరించి చెప్పాడు షాడో.

"అదా! అయితే ఫరావాలేదు. ఒక్కరోజు మాత్రం నువ్వు అడిగినట్లు పోలీసు ప్రొటెక్షన్ లభిస్తుంది. అంతే. ఇంక బేరాలు వద్దు."

డ్రాయర్ లోనుంచి ఒక తాళం చెవి తీసి టేబిల్ మీద పెట్టారు. ఇది నీ ఎపార్ట్‌మెంటు తాళం చెవి అంటూ. దాని నందుకొని లేచి నిలబడ్డాడు షాడో.

"వెల్ సర్! ఐ విల్ బి ఆన్ మై వే!"

"గుడ్ రాజూ! ఫిలాసఫీ చదివితే నీ వంటికి మంచిది. మన ఆఫీసులో సెక్రటరీలు బతికిపోతారు. అక్కడ క్లాసులో అమ్మాయిలు చిచ్చుబుడ్లలాంటి వారు. జాగ్రత్త. యాక్సిడెంటులో చనిపోయిన వారంతా నీ క్లాసే. జాగ్రత్తగా మాట్లాడు. లేకపోతే స్పెషల్ ఎఫెక్టు డిపార్ట్‌మెంటు నీకు స్పెషల్‌గా పళ్ళు కట్టించాల్సి వస్తుంది."

"పొండి సార్. అమాయకుణ్ణి చేసి ఎగతాళి చేయటం అలవాటు చేసుకున్నారు" అమాయకంగా ముఖం పెట్టి అంటూ బయటికి వచ్చాడు షాడో.

"విష్ యూ బెస్ట్ ఆఫ్ మై బాయ్! బీ కేర్ ఫూల్ "

తను జాగ్రత్తగా లేనిదెప్పుడు అనుకుంటూ బిల్డింగ్ పైన రెడీగా వున్న హెలికాప్టరులో మద్రాసు బయలుదేరాడు షాడో – ప్రొఫెసర్ షాడో.

* * *

నామకహా పెట్టిన స్ట్రీట్ లాంపులు వెలగటం మాని చాలా రోజులయింది ఆ వీధిలో. ఆకాశంలో నల్లటి మేఘాలు చంద్రుణ్ణి దాచేసి, జగాన్నంతా చీకటిలో వుంచటానికి తయారౌతున్నాయి.

ఓవర్ కోట్లు వేసుకొని, మఫ్లర్ చుట్టుకొని ఇద్దరు నైట్ డ్యూటీ పోలీసు కానిస్టేబుల్స్ ఆ వీధిలో తిరుగుతున్నారు. వారిని ఆ రోజు ప్రత్యేకంగా ఆ వీధిలో కాపలాకు పంపించింది పోలీసు డిపార్టుమెంటు.

గోడలనానుకొని, నీడలలో నడుస్తూ వచ్చిన ఆకారాన్ని చూసి, నాలుక కరుచుకొని, తల పక్కకు తిప్పుకున్నాడు కానిస్టేబుల్. అక్కడే వుంటే చూడక తప్పదనుకొని వీధి చివరకు అడుగులు వేశాడు.

యూనివర్సల్ ట్రేడ్ ప్రమోటర్స్ ఆఫీసుముందు ఆగాడు షాడో. ఆ భవనానికి రెండు ద్వారాలున్నాయి. ఒకటి మెయిన్ గేట్ రెండవది వెనక వున్న గోడౌన్స్‌కు పోయేది. బిల్డింగుకు చాలా కిటికీలున్నాయి. కిటికీ ఎక్కాలంటే నిచ్చెన కావాల్సి వచ్చింది. జాగ్రత్తగా, ఏమైనా వీలుంటుందేమో అని పరిశీలించాడు. డ్రయినేజి పైపు కూడా కనపడటం లేదు.

మెయిన్ డోర్ కింద నుంచి సన్నటి వెలుగు బయటికి ప్రసరిస్తోంది. లోపల వాచ్‌మెన్ వున్నాడేమో! రెండవ ద్వారంలో అటువంటి లైటేమీ లేదు. మొదట ఆ డోరులో నుంచి పోదామని నిశ్చయించుకున్నాడు.

జేబులో నుంచి నల్లటి మాస్కు తీసి తగిలించుకున్నాడు. రెండు సన్నటి స్పెషల్ గ్లావ్స్ తొడుక్కుని, తలుపు హేండిల్ పట్టుకుని తిప్పాడు. లోపలి నుంచి తాళం వేయబడి వుంది. కాలర్ కింద వున్న నీడిల్ తీసి పని ప్రారంభించాడు.

వీధి అంతా నిశ్శబ్దంగా వుంది. దూరంగా నిలుచుని, ఇటు చూడకుండా కబుర్లు చెప్పుకుంటున్న కానిస్టేబుల్స్ తప్ప ఇంకెవరూ లేరు. సీనా టౌన్ నిద్రపోతున్నది.

షాడో గోడౌన్స్ ప్రవేశించేసరికి తెల్లవారుఝాము మూడు గంటలయింది. లోపలికి ప్రవేశించి రెండు నిముషాలు ఆగాడు. ఎక్కడా ఏ విధమైన శబ్దం వినిపించటం లేదు. అతని చేతిలోని పెన్ టార్చి వెలిగి, తన సన్నటి కాంతిని రూములోకి పంపుతోంది. ఆ వెలుగులో, అక్కడున్న టాయిలెట్ సామానులు, విగ్రహాలు, బ్లాంకెట్లు, సీల్డ్ ఫుడ్ డబ్బాలు అన్నీ వెతికాడు. నలభై అయిదు నిముషాలలో వాటిన్నిటినీ గాలించి వదిలాడు. ప్రతిదీ కదిలించి చూశాడు. నాశికారంధ్రాలను ఎలర్ట్‌గా వుంచి వాసనలను చూశాడు. అనుమానించి తగిలిందేమీ కనుపించలేదు.

హెరాయిన్ ఏమైనా దాచి వుంటే వాసన వచ్చి తీరుతుంది. ముందుకు కదిలాడు షాడో. ఒక మూల డోరులో నుంచి ఆఫీసులోకి పోవటానికి దారి వుంది. దాని తాళం తెరిచి ఆఫీసు బిల్డింగులోకి అడుగు పెట్టాడు. డిమ్ లైట్ ఒకటి

మాత్రం వెలుగుతున్నది. అంతా నిశ్శబ్దం. ఎక్కడో ఛైర్ కదిలిన శబ్దం వినవచ్చింది. గోడకానుకొని శిలావిగ్రహంలా బిగుసుకుపోయాడు. అడుగుల చప్పుడేమీ అనుసరించలేదు ఆ శబ్దాన్ని.

రెండు క్షణాల తరువాత గోడౌన్ తలుపు దగ్గిరికు వేసి ఎదురుగా వున్న పాసేజీలో నడిచాడు. పక్కల వున్న గదులను చూస్తూ. అన్నీ ఆఫీసు గదులు. టైపు మిషన్లు, అలమరాలు, బల్లలు, కుర్చీలు ఫైళ్ళు తప్ప ఇంకేలేవు వాటిల్లో. అయినా వాటిని విడవకుండా పరిశోధించాడు. అప్పటికీ ఆ కంపెనీ మీద అనుమానం కల్గించే ఆధారాలేమీ కనుపించలేదు.

"రాజూ! ఆ కంపెనీని పరిశోధించాలంటే వారంటు వుండాలి. అవి పుట్టిస్తే అందరికీ తెలిసిపోతుంది. అందుకని వారిని హెచ్చరించటం మంచిది కాదని, వారి జోలికి పోలేదు పోలీసు డిపార్టుమెంటు" బ్రీఫ్ చేశాడు నెంబర్ 44 స్పెషల్ ఎఫెక్ట్స్ హెడ్.

పాసేజి చివర ఇంకో ద్వారం వుంది. తలుపులు మూయబడి వున్నాయి. లోపల నుంచి బ్రైట్‌గా వెలుగుతోందొక లైటు.

పిల్లిలా అడుగులు వేస్తూ దానిని సమీపించాడు. లోపల అలమారాలు వున్నాయి. వాటినిండా పెన్సిళ్ళు, పేపర్లు పుస్తకాలు వున్నాయి అంతే. అవి పరికిస్తూ వుండగా అతని ముక్కు మరొక వాసనను పసిగట్టింది. ఎవరో మనిషి. దగ్గిరలోనే వున్నాడు చాలా గాఢంగా వుంది ఆ చెమట కంపు. మెల్లిగా ఆ రూము దాటి బయటికి పోయాడు ఇంకో మార్గం నుంచి. ఎదురుగా వీపు షాడో వైపు నుంచి కూర్చున్నాడు నైట్ వాచ్‌మెన్. ఒక ఛైరులో కూర్చుని ఏదో మాగజైను

చూస్తున్నాడు. చూస్తున్నాడు గాని చదవటం లేదు. అతని తల అటూ ఇటూ వూగి ముందుకుపడి, మళ్ళీ ఒక జర్కుతో లేస్తోంది. మళ్ళీ ముందుకు వాలి మళ్ళీ......

చిన్న గురక తీసి ముందుకు వాలాడతను. బలవంతంగా లేచి పెద్దగా ఆవలించాడు. అంత నిద్రవస్తున్న మనిషిని కాపలా పెట్టి బాధిస్తున్న వారి మీద కోపం వచ్చింది షాడోకు. విశ్రాంతి అందరికీ ముఖ్యం. తను చేయగలిగింది చేసి సహాయపడదామని అతన్ని సమీపించాడు.

కుడిచెయ్యి ఆటోమేటిక్‌గా బెల్టు వెనుక నుంచి రివాల్వర్‌ను బైటికి లాగింది. దాని మోతకు బిల్డింగ్ అదిరిపోతుంది. అందుకే అది వుపయోగిస్తున్నాడు. తనని వాళ్ళు గమనించటం మంచిది. అందువల్ల చాలా వుపయోగాలున్నాయి.

ఆఖరిక్షణంలో షాడో బూటు చిన్న చప్పుడు చేసింది. వులిక్కిపడి కుర్చీలో నుంచి సగం పక్కకు తిరిగి చూశాడు. షాడో రివాల్వర్ మడమతో కణత మీద కొట్టటానికి అవకాశం లభించింది. కొట్టాడు, మరుక్షణం ప్రశాంతంగా నిద్రపోయాడతను.

అతని తలను కుర్చీ వెనకు ఆనించి, ఆ తలుపుల్ని తోసి చూశాడు లాక్డ్. వెంటనే నీడిల్ తీసి ప్రయత్నించాడు. మామూలు తాళాల కంటే ఒక అరనిముషం ఎక్కువ తీసుకుంది. ఆ విషయం షాడోకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

తలుపులు దగ్గిరకు వేసి రూమునంతా కలియ చూశాడు. ఒక పెద్ద టేబిల్ రెండు అలమరాలు, ఒక ఐరన్ బీరువా వున్నాయి. మొదటి డ్రాయర్‌ను పరీక్షించాడు. ఏమీ లభించలేదు. ఒక డ్రాయరులో కాష్ బాక్సు వుంది. అందులో

రోజువారీ ఖర్చులకని రెండువేల రూపాయలు పెట్టీ కాష్ వుంది. ఒక్క క్షణం ఆలోచించి ఆ నోట్లను జేబులో వేసుకొన్నాడు. ఈ కంపెనీ మీద అనుమానాలేవీ లేకపోతే తను చేసిన పని జస్టిఫై కాదు. కులకర్ణి గారికి తెలిస్తే ఎగిరి గంతులేస్తాడు.

చాలా సేపు పనిచేశాడు షాడో. అన్ని మూలలూ, అన్ని చోటులు అంగుళం కూడా వదలకుండా ప్రతి వస్తువునూ గాలించి వదిలాడు. అతని చెవులు మాత్రం అడుగుల చప్పుడు కోసం ఎదురుచూస్తూనే వున్నాయి. అంత నిరీక్షణలోనూ, తలుపులు తెరుచుకున్న శబ్దం వినపడేదాకా వచ్చిన ప్రమాదాన్ని గమనించలేకపోయాడు.

* * *

వంద కాండిల్సు బల్బు రూమునంతా వెలుగుతో నింపింది. ఒక్క గంతులో ఐరన్ సేఫ్ పక్కన చేరి నక్కున్నాడు. రివాల్వర్ రెడీగా పట్టుకొని తల ముందుకు వంచి తొంగి చూశాడు ద్వారం వైపు.

తన మాస్కు, మామూలు దుస్తులు, మామూలు మనుషులు ధరించేవి కావు. వాటిల్లో ఒక పెద్ద జీభూతంలా కనిపిస్తూ వుండి వుంటాడు. మరి దడుచుకొని పారిపోక, ఇంకా అక్కడే నిలబడి చూస్తాడేం ఆ వ్యక్తి.

అతను షాడో కన్నా భయంకరంగా వున్న వ్యక్తి. పెద్ద రివాల్వర్ చేతిలో పట్టుకొని తలుపు చాటున నిలబడ్డాడు. దృష్టి షాడో మీద వున్నది.

షాడో తల ముందుకు రాగానే "టప్" మంటూ పేలింది అతని రివాల్వరు అంగుళం దూరంలో షాడో తలను తప్పుకుంది బుల్లెట్. వులిక్కిపడి తల వెనక్కు

లాక్కున్నాడు షాడో. సైలెన్సర్. కంపెనీ యజమానులు రివాల్వర్లు వుపయోగించేదే తక్కువ. మరి సైలెన్సర్లెందుకు?

"మర్యాదగా రివాల్వర్ వదిలి లొంగి పో. లేకపోతే ప్రాణాలు దక్కవ్!" బెదిరించాడా వ్యక్తి. శబ్దాన్నిబట్టి పేల్చాడు షాడో. వెధవ బెదిరిస్తున్నాడనుకుంటూ. రివాల్వర్ మోతతో బిల్డింగ్ ప్రతిధ్వనించింది. "టప్ టప్" మంటూ నిశబ్దంగా వచ్చాయి అతని బుల్లెట్లు.

అతనిని చంపకుండా గాయపరుద్దామని ప్రయత్నించసాగాడు షాడో. తలుపు చాటునుంచి బయటకు రావటం లేదతను. దాగుడు మూతల వల్ల ప్రయోజనమేముంది? మెరుపులా సేఫ్ పక్క నుంచి ఎగిరి డ్రాయర్ వెనక్కు దూకాడు. తల మీద నుంచి వెంట్రుకవాసిలో తప్పుకుపోయింది ఇంకో బుల్లెట్.

మోకాళ్ళ మీద కూర్చుని 'ఢన్ ఢన్' మని బుల్లెట్లను వరుసగా పంపాడు. రెండూ గురి తప్పుకుండా పోయి చేరాయి. పెద్దగా అరుస్తూ మోకాలు పట్టుకొని కిందపడ్డాతను. సడన్‌గా లైటు ఆరిపోయింది అంతా చీకటి.

ఒకేసారి చాలా సంఘటనలు జరిగిపోయాయి.

"ఏమిటి గొడవ? ఏం జరిగింది? Open the door. This is police" తలుపులు బాదుతున్నారు పోలీసులు.

టేబిల్ మధ్య వున్న ఖాళీలో నుంచి, కిందపడిన వ్యక్తి కేసి పారుతున్నాడు షాడో. వెనుక ఏదో సన్నటి శబ్దం వినవచ్చి భుజాల మీద నుంచి వెనక్కి చూశాడు. సన్నటి గాలి తెర వెనక నుంచి గదిలో ప్రవేశించింది. దానితో పాటు ఒక విధమైన చెమట వాసన షాడో నాశికా రంధ్రాలకు సోకింది.

"తలుపు తెరవండి. పోలీసు వచ్చింది." అరుస్తున్నారెవరో బయట. తలుపు దడ దడా పగులగొడుతున్నారు.

బయట హాలులో నుంచి వస్తున్న డిమ్ లైటులో వెనుక ఒక వింతను గమనించాడు షాడో. ఒకటే క్షణం. టేబిల్ వెనక వున్న బీరువా కొంచెం పక్కకు జరిగింది. దాని వెనక ఒక ద్వారం. అందులో నిలబడివున్నాడొక వ్యక్తి. మరుక్షణం బీరువా యధాస్థానానికి చేరింది. ద్వారం మాయమయింది.

మెయిన్ గేటు తెరుచుకున్న శబ్దం. మెట్ల మీద అడుగుల చప్పుడు షాడోని తొందర పెట్టాయి. లేచి బయటకు పరుగెత్తాడు. కిందపడి మూలుగుతున్న వ్యక్తి షాడో కాళ్ళకు అడ్డం పడటానికి ప్రయత్నించాడు. ఎగిరి ముఖంమీద తన్నాడు నిర్ధాక్షిణ్యంగా. వేగంగా తను వచ్చిన పాసేజీ లోకి పరుగెత్తాడు. కను చివర నుండి రెండు ఓవర్ కోట్లు హాలులోకి రావటం గమనించాడు.

ఒకడు కిందపడిన వ్యక్తిని లేవదీస్తున్నాడు. రెండవ వ్యక్తి షాడో వైపు చూస్తున్నాడు. సెల్యూట్ కొట్టి మాయ మయ్యాడు షాడో.

'ఆగు ఆగు' అంటూ అతను తన వెనకే పరుగెత్తటం విన్నాడు షాడో. ఎందుకనో తను పరుగెత్తే వేగంతో తరుముకు రావటం లేదు.

భారీ ఆకారం కాబోలు అరుస్తున్నాడు. అతని అరుపులకే దద్ధరిల్లి పోతోంది బిల్డింగు. "ఖూనీకోరును పట్టుకోండి చంపండి" ఇంకెవరో ఏదో అని పాసేజీలోకి పరుగెత్తుకొచ్చారు.

తలుపు తోసుకొని గోడౌన్ లోనికి వచ్చాడు షాడో. అతని వెనుకే లోపలికి అడుగు పెట్టాడు కానిస్టేబుల్.

"అడుగు ముందుకు వేస్తే కాలుస్తాను" బెదిరించాడు. టార్చ్ లైటు కాంతి షాడో మీద పడింది.

రివాల్వర్‌ను బెల్టు వెనక్కి చేరి చేతులెత్తాడు షాడో. వెను తిరిగి అతన్ని సమీపించాడు.

'బాబోయ్! మరీ బ్రహ్మారాక్షసిలా కనుపిస్తున్నావ్! ఏదీ నీ ఐడెంటిఫికేషన్? తొందరగా మళ్ళీ ఎవరైనా వస్తారు?' తొందర చేశాడు.

కుడిచేతి చొక్కాను పైకి లాగి మోచేతి మీది నల్ల జెండాను చూపించాడు షాడో. ఆ పచ్చబొట్టులాంటి గుర్తును చూసి తల వూపాడతను.

లైటు వేసి దారి చూపించాడు. "అటు నుంచి పారిపో. త్వరగా!"

'థేంక్స్ ఫ్రండ్' అంటూ అటు పరుగెత్తాడు షాడో. పాసేజీ నుంచి అరుపులు దగ్గరకు వస్తున్నాయి. ద్వారం ద్గగిర ఆగాడు ఒక క్షణం.

'యూ ఫూల్ గెటవుట్' కోపంగా పళ్ళు బిగించి చిన్నగా అరిచాడు. బయటకు గెంతి, తలుపు గట్టిగా కొట్టి మూశాడు షాడో. పంజరంలో నుంచి వదిలిన పక్షిలా వేగంగా వీధిని దాటి పక్కసందులోకి పరుగెత్తాడు. పోలీసు కానిస్టేబుల్స్ రూపంలో తిరుగుతున్నారు పెద్ద అధికార్లు. వారి కో-ఆపరేషన్‌కు సంతోషించాడు షాడో. ఇలా నడిచిపోతే ఈ వ్యవహారం త్వరలోనే తేలిపోవచ్చు.

పరుగెత్తుతూనే సందు చివరికి వచ్చేసరికి గ్లోవ్సు, మాస్కు ఒక డస్ట్‌బిన్ లోకి విసిరి వేశాడు. తిరిగి మెయిన్ రోడ్డు ఎక్కేసరికే, నీట్‌గా టక్ చేసుకున్న ఒక యువకుడు విజిల్ వేసుకొంటూ ఆనందంగా పోతున్నాడనుకున్నారు చూసినవాళ్ళు.

"రెండు వేలు రూపాయలున్నాయి జేబులో. ఒక విచిత్రమైన వాసన తెలిపింది మెదడుకు. ఈ మాత్రపు క్లూలు చాలు మొదటి రోజులో.

బూతద్దాల కళ్ళజోడులో నుంచి తన శిష్య పరమాణువులను పరికించాడు షాడో – ప్రొఫెసర్ జాన్సన్ హెర్రిక్.

* * *

అనీజీగా చూస్తున్నారందరూ. కొత్త ప్రొఫెసర్లను అలా చూడటం విద్యార్థులకు మామూలే. వారి నిర్లక్ష్యాన్ని చూసి తన ప్లాన్లు మార్చుకున్నాడు. రాత్రి రెండు గంటల దాకా కూర్చుని, తయారు చేసుకొని బట్టీ పట్టిన పాఠ్యాంశాన్ని వదిలిపెట్టి, లైను మార్చుదామని నిశ్చయించుకున్నాడు.

మొదట తనను పరిచాయం చేసుకున్నాడు. విషాదంగా ఫోజు పెట్టి ప్రొఫెసర్ రమేష్ మరణానికి తాను ఎంతగా చించిస్తున్నాడో వారికి తెలియజేశాడు. రమేష్ తనకు బాగా తెలుసుననీ. తను అభిమానించే వ్యక్తుల్లో ఆయన ఒకరనీ చెప్పాడు. అప్పటికే బోరు కొట్టటం ప్రారంభించింది. ప్రొఫెసర్ల జీవితం అంత నిస్సారంగా వుంటుందని తలంచలేదతను. తను ముందురోజు ఆ బిల్డింగులో చేరి కాస్సేపు తందనాలు తొక్కిరావటం మంచిదయింది. లేకపోతే మరీ డల్‌గా వుండేది బతుకు.

షాడో రూపం పూర్తిగా మారిపోయింది. వైట్ పాంటు, వైట్ షర్ట్ టక్ చేసి గ్రేకలర్ టై కట్టి, అదే కలర్ కోటు వేసుకున్నాడు. మామూలుగా బెల్టు వెనకాల వుండే రివాల్వరు చంకలోకి చేరింది. బూటులోని డ్రాగర్ ఎడమ ముంజేతి మీదకు వచ్చింది.

అతని మొదటి పాఠం. స్టూడెంట్లు అభిమానాన్ని చూరగొనటం, ప్రస్తుతం వారి ముఖాలు చూస్తుంటే అది తప్ప మిగిలిన పనులన్నీ తేలిక అనిపిస్తోంది. గుండెలనిండా రెండు క్షణాలు ఆగి వూపిరి పీల్చుకొని మొదలు పెట్టాడు.

"ఈ శరీరం అశాశ్వితం. పంచభూతాల కలయిక వలన కూడిన శరీరం. తిరిగి వాటిలో కలిసిపోకతప్పదు. ఆత్మ మాత్రమే శాశ్వతమైనది. ప్రపంచంలో మనిషిని పోలిన మనుషుల నేకులు వుంటారు. ఒకరి గుణాలు ఒకరికి వుండటం అరుదు. అయినా వెతికితే అటువంటి లక్షణాలున్న వ్యక్తి దొరకకపోదు. కాని ఒక సంగతి మనం ఎల్లప్పుడూ జ్ఞప్తిలో వుంచుకోవాలి. రెండు ఆత్మలు ఒకే విధంగా సంచరించటం జరగదు. మనిషి మరణంతో అతను పూర్తిగా మనకు దూరమైనట్లే. మనిషి దూరమైనా మన మనస్సుల్లో అతని జ్ఞాపకాలు నిలబడి వుంటాయి."

తను చెప్పేది వారి బుర్రలకెక్కుతున్నదా లేదా అనే సందేహంతో రెండు క్షణాలు తటపటాయించాడు.

ఆరడుగుల పైన కొంచెం ఎత్తు. అందమైన ముఖం. కణతల దగ్గిర తెల్లబడిన జుట్టు, కళ్ళజోడు, చూడగానే మరోసారి చూడాలనిపించేటంత ఠీవిగా నిలబడ్డాయి. తను బోధించే సబ్జక్టు మీద ఎనలేని గౌరవం వున్నవాడిలా అగుపించసాగాడు. కాని తయారు చేసుకున్న పాఠం తప్ప ఫిలాసఫీ అంటే ఏమిటో అతనికి తెలియదని వారికీ తెలియదు.

కాని ఒక సంగతి మాత్రం షాడోకు తెలిసిపోయింది. తను చెప్పే మాటలను శ్రద్ధగా వింటున్నారందరూ.

"మీ ప్రొఫెసరు స్థానంలోకి, అతనికి మీ హృదయాల్లో వున్న చోటును ఆక్రమించుకోవాలని నేను రాలేదు. అతన లాగా ప్రవర్తిద్దామని కూడా రాలేదు. మీరందరూ ఇక్కడ వున్నారు. మీకు విద్యాబోధ చెయ్యాలనే వుద్దేశ్యంతో వచ్చాను. అంతే, ప్రొఫెసరు గారు మీకు చేసిన సహాయంలో వందో వంతైనా చెయ్యగలిగితే నేను ఎంతో సంతోషిస్తాను." ఆయన ఏం సహాయం చేశాడో షాడోకి తెలియదు. అయినా అలాగే కంటిన్యూ చేశాడు.

"మీలో చాలామంది రమేష్ గారికి అప్తమిత్రులు అని విన్నాను. ఆయనను అభిమానిస్తారని, గౌరవిస్తారని, ప్రేమిస్తారనీ గూడా విన్నాను. అది మీ దగ్గిర నుంచి పొందాలనే వుద్దేశ్యం నాకు లేదు. కాని నేను చెప్పేది విని, నా శక్తిని గ్రహించి నా మీద ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకొమ్మని కోరటం తప్ప ప్రస్తుతం నేను చెయ్యగలిగింది ఏమీ లేదు."

ఇంకా నిర్లక్ష్యంగానే చూస్తున్నారు. శ్రద్ధగా వింటున్నారే తప్ప చూపులు మార్చటం లేదు.

"నేను చెప్పాలనుకున్న పాఠ్యాంశాన్ని ఈ రోజు చెప్పదలుచుకోలేదు. మిగిలిన పీరియడంతా మీ యిష్టం వచ్చినట్లు ఎంజాయ్ చేయండి."

ప్రొఫెసర్ రమేష్ మీద అభిమానమున్నవాళ్ళు ఆయన చెప్పిన విషయాలు జ్ఞాపకం చేసుకొండి. ఆయన దేని కోసం జీవించాడో, ఎందుకు మరణించాడో తెలుసుకొని ఆయన ఆత్మ శాంతి చేకూర్చండి." వారి వంక చూసి కళ్ళు టపటపా ఆర్చాడు. "నేను పోయి కాస్త విశ్రాంతి తీసుకొంటాను. నా దగ్గిరకు ఏదైనా సలహా కావలసివస్తే రావటానికి సందేహించకండి. ఎల్లప్పుడూ మీకు సహాయం

చేయటానికి నేను సంసిద్ధుణే. నా హృదయం నా ఇల్లు మీ స్నేహం కోసం ఎల్లప్పుడూ తెరిచే వుంటాయి. "

ఒక్క క్షణం వెనుకకు తిరిగాడు. వెనక బెంచీలలో విద్యార్థులు కదలిన శబ్దం వినవచ్చింది. "వెల్ గుడ్ డే!" అంటూ బ్రీఫ్‌కేస్ తీసి నోట్సు అందులో పెట్టాడు. తను చెప్పవలసింది అయిపోయిందన్నట్లు సైగ చేసి బూట్ల టక టకలాడించుకుంటూ బయటికి వచ్చాడు.

ప్రొఫెసర్ షాడో బైటికి పోయి, స్ప్రింగ్ తలుపులు మూసుకునే దాకా క్లాసులో ఎవరూ కదలలేదు.

* * *

మృదువైన ఆమె చెయ్యి చెవర్లెట్ విండో మీద విశ్రాంతి తీసుకొంటోంది. రెండవ చేతిలో స్టీరింగ్ వీల్ మీద చిన్నగా టాప్ చేస్తోంది. ప్రతి నిముషానికి తల తిప్పి రిస్టు వాచి వంక చూసుకుంటోంది. ఎర్రటి జుట్టు, వెడల్పయిన కళ్ళు, కోల ముఖం, తెల్లటి రంగు చాలా అందంగా వుంది ఆ యువతి. క్రమంగా అందమైన ముఖంలో విసుగు చోటు చేసుకోవటం ప్రారంభించింది.

"ఇవాళ బయటకు వచ్చేటట్లు లేడీ ప్రొఫెసరు. వచ్చిన వారిలో ఆఖరి ఇద్దరు కూడా వెళ్ళిపోయారు. అరగంట క్రితం ఇంకా ఎవరైనా వస్తారని ఎదురుచూస్తున్నాడా?"

నిజానికి కారు దిగిపోయి డైరెక్టుగా ప్రొఫెసర్ని కలుసుకొవచ్చామె. కాని అది ఆమెకు ఇష్టం లేదు. అందరి లాగా నమస్కారాలు పెడుతూ పోయి పరిచయం చేసుకోవటం ఆమెకు నచ్చదు.

సరయైన వాతావరణంలో, తగిన విధంగా కలుసుకోవాలి. తను ప్రయత్నించినట్లు తెలియకూడదు. యాక్సిడెంటల్‌గా జరిగిపోవాలి తమ కలయిక. పొద్దుటినుంచి ఇంట్లో ఆ ప్రొఫెసరు ఏం చేస్తున్నాడో అర్థం కావటం లేదు. ఏమైనా చేస్తూ వుండవచ్చు. నిద్రపోతూ వుండవచ్చు. అద్దంలో అందాన్ని చూసుకొని మురిసిపోతూ వుండవచ్చు.

అతని అందం ఒక విధంగా ఆమెను ఆశ్చర్యపరచింది. సామాన్యంగా ప్రొఫెసర్లు అంత అందంగా వుండరు. ఏజెంట్లు, పోలీసులు, సిఐడీలు కూడా అలా హేండ్‌సమ్‌గా వుండరు. ఈయన ఎవరో ?

జాన్సన్ హెర్రిక్ పాట్నా యూనివర్శిటీలో పనిచేస్తున్నట్లు ఆమెకు తెలిసింది. ఒక ఫోటోను సంపాదించి చూసింది. డామిట్ ఫోటో కంటె అందంగా వున్నాడు కాని అతను ప్రొఫెసరంటే ఆమెకు నమ్మకం కలగటం లేదు.

ఆమె ఎదురుచూస్తున్న వ్యక్తి ఆమె అనుకున్న పనులేమీ చెయ్యటం లేదు.

ప్లాస్కులో వున్న కాఫీని గ్లాసులో పోసుకొని చప్పరిస్తూ తాగుతున్నాడు. రివాల్వరు ఒక పుస్తకం మధ్యలో ప్రత్యేకమైన కంపార్ట్‌మెంట్‌లో దాచాడు. డ్రాగర్ ముంజేతి మీదే వుంది. భయంకరమైన గాస్ పెల్లెట్, గాస్ బాంబు చిన్నగోలీకాయలా పై జేబులో పడి వుంది.

టీపాయ్ మీద టేప్ రికార్డరు గిరగిరా తిరుగుతూ మాట్లాడుతున్నది. వెల్! థాంక్యూ ప్రొఫెసర్. (నవ్వు) కాఫీ నాకు అలవాటు లేదు – (నవ్వు) మరెప్పుడయినా వచ్చి తాగుతా లెండి – (నవ్వు). ముందుకు వంగి ఆ భాగాల్ని వినకుండానే రీలును ముందుకు జరిపాడు.

తనలాగే బూతద్దాలు పెట్టుకొని వచ్చిందొక యువతీ. ఎందుకు వచ్చిందో ఆమెకే తెలియదు. అరగంట సేపు నవ్వులతో ప్రాణం తీసి తరువాత వస్తానని వెళ్ళింది.

రెండో భాగమంతా షాడో మాటలే వచ్చినవి. స్టూడెంటు యూనియన్ లీడరు. క్లాస్‌లో కాస్త రౌడీయిజం చెలాయించే వ్యక్తి. సూటిగా ప్రశ్నలు వేసి షాడోను అన్ బాలెన్స్ చెయ్యాలని ప్రయత్నించాడు.

"నీవు ప్రత్యేకంగా నా వద్ద తెలుసుకోవాల్సిందేమన్నా వుందా?" షాడో వాయిస్ ఖంగుమంటూ వినవచ్చింది. అతనికి ప్రపంచ రాజకీయలంటే పిచ్చి. వాటిలో పడి చదువుకోవటానికే తీరిక లేదంటాడు.

తరువాత ప్రొఫెసర్ రమేష్ అంటే అభిమానించే వాళ్ళు వచ్చారు. తగిన విధంగా మాట్లాడాడు వారితో.

అన్నీ విని ఆఫ్ చేశాడు. తనను ఒక వూపు వూపి చూడాలని వచ్చారందరూ. తల విదిల్చి, సీటులో అటూ ఇటూ కదిలింది ఆమె. ముందుకు వంగి, రేడియో ఆన్ చేయబోయే లోపల ఎపార్ట్‌మెంటులో నుంచి ఒక హేండ్‌సమ్ పర్సనాలిటీ బైటికి వచ్చి, గారేజీలోకి పోయి సెకండ్ హేండ్ ఫియట్‌లో బయటికి వచ్చి, బయలుదేరింది.

ఇక స్టూడెంట్లును కలుసుకొని ప్రయోజనం లేదని అనుకున్నాడు షాడో. తన స్పేర్ టైములో ఆదివారం రాత్రి జరిగిన సంఘటనలను గూర్చి ఆలోచించుకోవటం మంచిది. అక్కడ కాపలా పెట్టిన సిఐబి జూనియర్ గ్రేడ్ ఏజెంటును కలుసుకొని ఏమైనా ప్రోగ్రెస్ వుందేమో తెలుసుకోవాలి. చాలా

ఆకలయింది షాడోకు. సీనా టౌన్‌లో వారి దేశపు భోజనం చేస్తే సరదాగా వుంటుంది.

నోట్లో పెట్టిన పైపు తీద్దామనుకొంటుండగా, వున్నట్లుండి ఫియట్ ముందుకు గెంతింది. ఏం జరిగిందో పోయి చూడనవసరం లేదు. ఎవరో కొత్తగా డ్రైవింగ్ నేర్చుకొంటున్నారు కాబోలు, వచ్చి గుద్ది వుంటారు.

రియర్ వ్యూ మిర్రర్ లో చూసి తన వూహ నిజమేననుకున్నాడు.

* * *

అనేక రకాల ఆలోచనలతో కిందికి దిగాడు షాడో. అందులో ఒకటి ఈ వెధవ డొక్కు సెకండ్ హేండ్ కారును వదలటానికి మంచి సాకు దొరికిందని. రెండవది, ఆ చెవర్లెట్ తన ఎపార్ట్‌మెంటు ముందు చాలా సేపు ఆగి వుండటం చూశాడు. తన వెనకే వచ్చి కావాలని గుద్దుకోవటం ఏదో నాటకానికి నాందీ ప్రస్తావన అని.

ఆమె వంక మింగేసే విధంగా చూసి, తన కారు వెనక భాగాన్ని పరీక్షించాడు. వెనుక భాగం తుక్కు తుక్కు అయిపోయింది. మనసులోననే మెచ్చుకొన్నాడు చెవర్లెట్‌ను.

కాని తను సామాన్యమైన ప్రొఫెసరు. తన దగ్గిర ఎక్కువ డబ్బు వుండకూడదు. కనుక ఇప్పుడు ఏం చెయ్యాలి? లెక్కప్రకారం ఎగిరి గంతులెయ్యాలి కోపంతో. కాని ఆమె ముఖాన్ని చూస్తే, నిజమైన ప్రొఫెసర్లు గూడా నోరు మూసుకుంటారు.

"డ్రైవింగ్ చేతకాకపోతే కారెందుకు టాక్సీలో పోక?" ప్రశ్నించింది కోపంతో.

"ట్రాఫిక్ లైట్లలో ఆకుపచ్చరంగేదో, ఎరుపేదో తెలియకపోతే" విసుగ్గా అన్నాడు కొంచెం కోపం మేళవించి, ఆమె అందాన్ని చూస్తూ "పోయి కళ్ళు పరీక్ష చేయించుకోవటం మంచిది."

ఆమె ముఖంలో సీనాదేశపు లక్షణాలు కనిపించటం గమనించాడు.

"లైటు గ్రీనే?" మొండిగా అంది. నిజమే ఆమె మాట్లాడే సమయంలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. "అసలు నీకు లైసెన్సు వుందా?" బెదిరించింది.

ఆమెను కూడా ఆమె లైసెన్సు చూపించమని బెదిరించాడు షాడో. ఇద్దరూ తమ తమ లైసెన్సులు తీసి పట్టుకున్నారు.

ఆమె పేరు లూసియానా ట్వింగ్. సీనా దేశీయురాలే. షాడో పేరు చూసి అదిరిపోయింది. "డాక్టర్ జాన్సన్?" అంది నోరు తెరిచి! ఈ తడవ ఆమె కళ్ళు స్నేహపూర్వకంగా చూశాయి. షాడో కూడా తెచ్చిపెట్టుకున్న ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. ఇది యాక్సిడెంటు కాదని తేలిపోయింది.

"క్షమించండి. మిమ్మల్ని గుర్తుపట్టలేదు. మీ పేరు విన్నాను. పొద్దున కాస్లుకు రాలేదు. అందుకనే మీరెవరో తెలియదు" అంటూ క్షమాపణలు చెప్పుకొంది.

మత్తయిన చిరునవ్వు ఒకటి షాడో మీద విసిరింది.

"మరేం పరవాలేదు. మీ దయ వలన పాతకారును వదిలించుకో గలుగుతున్నాను." నిజం చెప్పాడు షాడో.

"ఎవరినైనా పిలిచి దాన్ని మెకానికల్ షాపుకు పంపించండి. నేను బాగు చేయిస్తాను. బైదిబై మీరెక్కడికి పోవాలో చెపితే డ్రాప్ చేస్తాను."

"మరేం పరవాలేదు. బ్లూడైమండ్ భోజనం చేయటానికి పోతున్నాను. విల్ యూ గివ్ మీ కంపెనీ?" అని అడిగాడు సూటిగా.

మళ్ళీ చిరునవ్వుతో అతన్ని అదరకొట్టింది.

"అలాగే కాని మీకు ఇన్‌కన్‌వీనియన్స్ కలిగించినందుకు – మీరు నా గెస్ట్ మా ఇంటికి పోదాం రండి. ఎవ్వరూ లేరు ప్రస్తుతం. ఇఫ్ యూ డోన్ట్ మైన్‌డ్" అప్పీలింగ్‌గా చూసింది.

"నో ఐ డోన్ట్ హేవ్ ఎనీ ఆబ్జెక్షన్."

కార్లు వారి చుట్టూ చేరి హారన్‌లు మ్రోగించసాగాయి. షాడో చెవి దగ్గర అరిచిందొక కంఠం.

"అయ్యా మీ కాన్‌వర్‌సేషన్ అయిపోతే మీ రథాన్ని కదిలించండి" అన్నాడు పోలీసు కానిస్టేబుల్.

* * *

సీనా టౌన్‌కు దగ్గిరగా ఎత్తయిన గుట్టమీద వుంది లూసియానా బిల్డింగు. ఆ రెండంతస్తుల భవనాన్ని చూసి వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళని గ్రహించాడు షాడో. కారు పోర్టికోలో ఆగి హేండ్ బాగ్‌లో చెయ్యి పెట్టింది కీ కోసం. ఆ లోపలే ఒక సీనా దేశపు అరవై సంవత్సరాల స్త్రీ తలుపులు తీసి బయటికి వచ్చింది. ఆమెతో సీనా భాషలో ఏదేదో మాట్లాడింది లూసియానా. తనకు అర్థంకానట్లు నటించాడు షాడో.

అతని వంక క్యూరియస్‌గా చూస్తూ వెళ్ళిపోయింది ఆ వృద్ధురాలు.

"మా పనిమనిషి ప్రొఫెసర్. ఇంటిని క్లీన్ చెయ్యటానికి వచ్చింది." లోపలికి తీసుకువెడుతూ అన్నది లూసియానా.

"ఓహో! అలాగా!" అన్నాడు షాడో. ఆ ఇంటి నెంబరు కులకర్ణి గారు తనకు సప్లయి చేసిన ఫైల్సులో వుంది.

"వెల్‌కమ్ డాక్టర్ జాన్సన్. మీ క్లాసులో అందరికన్నా బాక్‌వర్డ్ స్టూడెంటును నేను."

"ఓహో!" అన్నాడు షాడో. ఇంటినంతా కలియ చూస్తున్నాడు.

"కమాన్ డాక్టర్. డ్రాయింగ్ రూంలో కూర్చుందాం. మొదట ఏదైనా డ్రింకు తీసుకుంటారా? ఏం కావాలి?" ప్రశ్నించింది చెయ్యి పట్టుకొని తీసుకుపోతూ.

ఇద్దరూ కూర్చుని వైన్ తాగుతున్నారు. వున్నట్లుండి లేచింది లూసియానా. "జస్ ఎ మినిట్!" అంటూ స్ప్రింగ్ డాల్‌లా ఎగురుకుంటూ లోపలికి పోయింది. ఆ వాతావరణమంతా ఏమిటోగా కనిపించింది షాడోకు. కారు యాక్సిడెంటులో చనిపోయిన లూసీ ఇదే ఇంట్లో వున్నట్లు పోలీసు ఎంక్వైరీలు తెలియచేస్తున్నాయి. మరి అదే రిపోర్టులో ఈమె సంగతి మెన్షన్ చెయ్యలేదెందుకనో! తన తల్లిదండ్రులు వున్నారని చెప్పింది కాని, ఎవ్వరూ వున్నట్లు కనిపించటం లేదు.

లూసీ చావుకు, ఆమె ఉపయోగించిన హెరాయిన్ సిగరెట్లకూ, లూసియానాకు మధ్య సంబంధం మేమైనా వుందా? వుంటే కనిపెట్టవలసిన బాధ్యత తనదే.

సీనా దేశపు గౌను వేసుకొని వీనస్ లాగా గదిలోకి వచ్చింది లూసియానా. బాల్డ్ హెయిర్ అందంగా దువ్వుకొని రెండు రింగులు ముఖం మీదకు లాక్కొంది. ఒక విధమైన మైల్డ్ సెంట్ పరిమళం ఆమెతో పాటు గదిలోకి వచ్చింది.

గ్లాసు ఎత్తిపట్టుకున్నాడు షాడో. "టు మై బ్యూటీఫుల్ స్టూడెంట్" అంటూ "నాతో ఇంత ఫ్రెండ్లీగా మాట్లాడింది నువ్వొక్కదానివే" అని మెచ్చుకున్నాడు.

కడుపులో పేగులు అరుస్తున్నాయి. ఇక్కడ చూస్తే ఈమె పెట్టే భోజనం ఇంకో విధంగా వుంది. తన కాలుకు తగులుతున్న ఆమె తొడలను చూస్తూ అనుకున్నాడు. చూపులు మాటి మాటికి పైకి లేస్తున్నాయి.

షాడో చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుంది లూసియానా. కళ్ళు మత్తుగా మెరుస్తున్నాయి. "మీ చేతులు చాలా అందంగా వున్నాయి ప్రొఫెసర్ " లేచి ఆమె భుజాల చుట్టూ చేరుకోవాలనుకుంటున్న ఎడమ చేతిని బలవంతంగా ఆపాడు షాడో. అందమయిన పెదవుల్ని ముద్దు పెట్టుకోవాలనే కోరిక ప్రబలిపోయింది. సడన్‌గా షాడో చేతిని పంటితో కొరికింది. తను ఎన్నడూ అనుభవించని ఎక్సైమెంట్ ని అనుభవించాడు.

ఒక్క క్షణం తటపటాయించాడు. కాని అతనికి తెలియకుండానే చెయ్యి ఆమె భుజాల మీదికి చేరుకుంది. దగ్గిరకు లాక్కున్నాడు. తనకు ప్రమాదాలనుంచి తప్పించే ఇంద్రియాలను మాత్రం ఎలర్ట్‌గా వుంచాడు.

ఊపిరి సలనంత గాఢంగా పెనవేసుకుంది. పెదవులు కలుసుకున్నాయి. గౌనులో నుంచి గట్టిగా అతని గుండెలకు తగులుతున్నాయి ఆమె వక్షోజాలు. చేతులు ఆమె నడుం చుట్టూ చుట్టి ఇంకా దగ్గిరకు లాక్కున్నాడు. ఆమె వూపిరి

వేడిగా అతని బుగ్గలకు సోకుతోంది. పెదవులు అదురుతున్నాయ్ మనిషి చిన్నగా వణుకుతున్నది.

వున్నట్లుండి అతన్ని విడిపించుకొని లేచి నిలబడింది నవ్వుతూ.

"ప్రొఫెసరు గారు ఫిలాసఫి వదిలి శృంగారంలో పడుతున్నారు!" కుతకులలాడింది.

తనను కంట్రోలు చేసుకోవటానికి ప్రయత్నించాడు షాడో. ఆ స్టేజీ దాటిపోయింది.

"వెల్! నేను ప్రాక్టికల్ ఫిలాసఫీ చెప్పేవాణ్ని. ప్రతిదీ అనుభవించిగాని తెలుసుకోగూడదనే మనస్తత్వం నాది." లేచి నిలబడీ, తను చేసిన పనికి సిగ్గుపడ్డట్లు కనిపించాడు. కావాలనే ఇలా నాటక మాడుతున్నాదని గ్రహించాడు షాడో. అయినా తనలాగే ఎక్సైట్ అయి వున్నది.

ముందుకు వంగి ముద్దుపెట్టుకున్నాడు. మొదట సున్నితంగా...... తరువాత గాఢంగా. ఆమెకు కావలసినా సమాధానమదే. కాని అతని చేతులు మళ్ళీ చుట్టుకొనే లోపల ప్రొటెస్ట్ చేసింది. "ఇక్కడ కాదు నా బెడ్ రూం....." చేతుల్లో ఎత్తుకొని మెట్లు ఎక్కి, ఆమె పడకగదికి దారి తీశాడు షాడో. ఇద్దరూ వేడి మీద వున్నారు. ఎక్కడో ఒక మూల షాడో మెదడులో ఒక ప్రత్యేకమయిన యంత్రం పనిచేస్తూనే వున్నది. జరిగిన సంగతులు యధాతథంగా భద్రపరుస్తున్నది. తన కిచ్చిన వైన్‌లో ఏదో మెడిసిన్ కలిపింది. అది ఆమెకూ తెలుసు. ఎందుకంటే ఆమె కూడా అదే తాగింది. తనని రెచ్చగొట్టి ఏదో బయటికి

లాగాలనుకుంటున్నది. కనుక తను కూడా ఆమె ద్వారా ఏమయినా తెలుసుకోవటానికి ప్రయత్నించాలి.

బెడ్ రూంలోకి అడుగు పెట్టగానే ఆగి ఆమె పెదవుల మీద బలంగా ముద్దు పెట్టుకున్నాడు. ఈ లోపల అతని ఇంద్రియాలు ఆ రూములో వున్న చోట్లనన్నిటినీ పరిశీలించాయి. ప్రమాద చిహ్నాలేమీ లేవు.

పక్కమీద పడవలేసి ఆమెనాక్రమించుకున్నాడు. చేతులతో ఆమె సుకుమార శరీరాన్ని తడిమి మత్తెక్కించాడు. కోరికతో కరిగిపోయిందామె. చేతులు పెనవేసుకొన్నాయి. ఇద్దరూ ఒకరిని మించాలని ఒకరు పోటీలు పడటం ప్రారంభించారు.

మనస్సు ఏదో లోకంలో విహరిస్తున్నప్పుడు, శరీరం ఆమె చేతుల్లో బంధింపబడి వున్నది. అతని చెవులు వార్నింగిచ్చాయి. ఎక్కడో అడుగుల చప్పుడు వినవచ్చింది. చిన్నగా ఆనందంగా కదులుతున్నదామె. ఆ సమయంలో పాములా తల పక్కకు తిప్పి చూశాడు. కను చివరలనుంచి ఒక నీడ ముందుకు రావటం గమనించాడు.

మెరుపులా లేచాడు. ఆశ్చర్యంతో, తీరని కోరికతో అతన్ని పట్టుకోవటానికి చేతులు జాచింది లూసియానా. అప్పటికే మంచం దిగి, మోకాళ్ళ మీద ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి సిద్ధంగా వున్నాడు. ముందుకు వచ్చిన మనిషిని ఎగిరి తన్నాడు. వెంటనే బాలెన్సు నిలదొక్కుకొని పక్కకు తిరిగి అరచేతి చివరలో గొడ్డలి పెట్టి కొట్టినట్లు మెడ మీద కొట్టాడు. అతను కిందపడటం చూశాడు. మరొక ఆకారం తన వెనుక నుండి రావటం గూడా గమనించి వెను

తిరగబోయేటంతలో దెబ్బ పడిపోయింది. తల దిమ్మెక్కి నెమ్మదిగా మంచం మీదకు వాలిపోయాడు.

మైకం మనస్సును ఆవరిస్తూ వుండగా లూసియానా, "వద్దు వద్దు" అని ఎవరినో వారిస్తూ వుండటం తెలిసింది. అంతే. తెలియని చీకటి లోకాలకి లేచిపోయాడు.

* * *

ఏదో వాసన మెదడును దిమ్మెక్కిస్తుంటే మెలకువ వచ్చింది షాడోకు. మనసంతా గజిబిజిగా వుంది. జరిగిన సంఘటనలు తెరలు తెరలుగా గుర్తుకు వస్తున్నాయి. లూసియానా వద్దు వద్దని ఎందుకు అరిచింది ?

కాళ్ళు చేతులు కదలకుండా బంధింపబడి వున్నాయి. కళ్ళకు గంతలు కట్టారు. ఒక ముక్కు మాత్రం ఫ్రీగా వుంది. ప్రస్తుతం దానినే వుపయోగిస్తున్నాడు. వచ్చే వాసన ఎప్పుడో అనుభవించిన గుర్తు. ఎక్కడ? అప్పుడు కన్నా చాలా గాఢంగా వుంది ఇప్పుడు. సడన్‌గా ఏదో గిన్నె మోగిన శబ్దం వచ్చింది. దానితో పాటు ఆపియమ్ వండి, హెరాయిన్ తయారు చేసే సమయంలో వచ్చేవాసన మరింత గాఢంగా వచ్చింది.

సో! అది అసలు సంగతి. అక్కడ తిరిగి ఇక్కడ తిరిగి తను చేరవలసిన చోటుకే చేరుకున్నాడు.

లూసియానా బెడ్ రూంలో అంత త్వరగా ఎలా రాగలిగారు? తను డోర్ వేసి లోపలకు ప్రవేశించాడు. కిటికీలకున్న తెరలు జ్ఞాపకం వచ్చాయి షాడోకు. కిటికీలలాగా కనుపించాయవి. నిజంగా కిటికీలేనా ?

తన అజాగ్రత్తకు నిందించుకుంటూ తనకు కట్టిన తాళ్ళను పరిక్షించసాగాడు. తలుపు తెరుచుకుంది. చాలా మంది లోపలికి వచ్చినట్లు సందడయింది. నోటిలో వున్న గుడ్డను తీసారెవరో, మరొక క్షణంలో కళ్ళకు కట్టిన గంతలు కూడా రిమూవ్ చేయబడ్డాయి. గదిలో వెలుగుతున్న బల్బు కాంతికి షాడో కళ్ళు మూతలు పడ్డాయి. అలవాటు పడేందుకై కనురెప్పవాల్చాడు. బలంగా లేపి కూర్చోపెట్టారు.

నలుగురు వ్యక్తులు, అర్ధచంద్రాకారంలో బారెడు దూరంలో నిలబడి వున్నారు? ఇద్దరు సీనా దేశపు దుస్తులు ఇద్దరు మామూలు పాంటు షర్టులు వేసుకొని వున్నారు.

"ఎవరు నువ్వు?" నల్లగౌను వేసుకొన్న వ్యక్తి షాడోను ప్రశ్నించాడు షాడో వాలెట్ తెరిచి చూస్తూ అడిగాడు.

"నేనెవరో తెలియదా? ఏమిటీ దురాగతం? ఆ అమ్మాయినేం చేశారు?" ఆశ్చర్యం, భయం అన్నీ మేళవించి అరిచాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు. కనీసం చూపుల్లో వున్న ఎక్స్‌ప్రెషన్ గూడా మార్చలేదు.

మళ్ళీ నల్లగౌను ప్రశ్నించాడు. "ఎవరు నువ్వు?"

"నా పేరు జాన్సన్ హెర్రిక్. యూనివర్శిటీ ప్రొఫెసర్. నా అడ్రసు అన్నీ వాలెట్‌లో వున్న విజిటింగ్ కార్డులో వున్నాయి."

వాలెట్‌ని నేలకు జారవిడిచాడతను. "అబద్ధం చెప్పకు. ఎవరు నువ్వు?"

"ఏమిటీ గొడవ?" గద్దించాడు షాడో. "నేనెవరో చెప్పాను. కావాలంటే యూనివర్శిటీకి ఫోన్ చేసి కనుక్కోండి. మర్యాదగా నన్ను వదిలిపెట్టండి. లేదా పోలీసులకు రిపోర్టు చేసి మీ అంతు చూస్తాను. ఇంతకీ మీరెవరు? నన్నెందుకు బంధించారు?"

కుడివైపున నిలబడిన మనిషి కొట్టిన దెబ్బ మెడ మీద తగిలి పక్కకు తూలాడు. కరాటే దెబ్బ కావటం మూలాన బాధ భరించలేనదయింది. అది తట్టుకొనే లోపల ఎడమ వైపునుంచి మరొక గుద్దు ముఖం మీద వాలింది.

తిరిగి షాడోకు మెలకువ వచ్చేదాకా అలాగే విగ్రహంలాగా నిలబడివున్నారందరూ.

"నువ్వు ప్రొఫెసర్‌వి కాదనుకోవటానికి మాకు తగు ఆధారాలున్నాయి మైడియర్ ఫ్రండ్. అందువల్ల మంచిగా నీ నోటితోనే చెప్పుకోవటం శ్రేయస్కరం. మా పద్ధతులు నీకు తెలుసు అని భావిస్తాను. ఇప్పుడు ఒక పద్ధతి రుచి చూశావ్ గదా?"

తల విదిలించాడు షాడో. ప్రొఫెసర్ షాడో నీ కెంత గతి పట్టింది. కులకర్ణిగారి ప్లానుకు పురిట్లోనే సంధి కొట్టింది. తనని బెదిరిస్తున్నారని తేటతెల్లంగా తెలిసిపోతూనే వుంది. తను జాన్సన్ కాదని అనేవాడెవడూ లేడు ఇండియాలో. అసలు వ్యక్తి సి.ఐ.బి. స్పెషల్ ఫోర్సు రక్షణ కింద ఎక్కడో హాయిగా, రహస్యంగా దాచబడి వున్నాడు.

"మీరనేదేమీ నాకు అర్థం కావటం లేదు. అబద్ధం చెప్పావలసిన అవసరం నాకు లేదు."

"మా కళ్ళు కప్పటానికి ప్రయత్నించకు. మిస్టర్. మీ ప్రొఫెసర్లెవరూ నీలాగా క్యూరియాసిటీ వున్న వ్యక్తులు కారు. నీ బలం. అద్లెటిక్ బాడీ, వంటి మీది మచ్చలు నీ వృత్తిని తెలుపుతూనే వున్నాయి. ఎందుకు సమయాన్ని వృధా చేస్తావ్? నిజాన్ని ఒప్పుకొని కష్టాలను తప్పించుకో" సలహా యిచ్చాడు నల్లగౌను.

"ఆరోగ్యవంతమైన శరీరం కలిగి వుండటం తప్పా? ప్రొఫెసర్లకు ఇలాంటి శరీరం వుండకూడదా?" ఆశ్చర్యపడ్డాడు షాడో.

"యస్ మై ఫ్రెండ్. నీ బాడీని చూసే మా అనుమానాలు పెరిగాయి. నిన్న మా అనుచరుడు తిన్న దెబ్బ ఒక సాధారణ టీచర్ కొట్టవలసినది, కొట్టగలిగినది కాదు. మంచిగా మాట్లాడు."

"మీరేం మాట్లాడుతున్నారో నాకర్థం కావటం లేదు. పోలీసులు _"

"పోలీసులు పోలీసులు అని కలవరించినంత మాత్రాన మేము బెదిరిపోతామని భ్రమపడకు! ఇక్కడ నీ గోడు వినే వారెవరూ లేరు. ఇంకో గంటలో, అందమైన నీ శరీరం చాలా అందవికారంగా తయారౌతుంది." అందరిలాగా అరవక మెల్లిగా ఒక్కొక్క మాట వత్తి పలుకుతున్నాడు నల్లగౌను.

"మా పని పూర్తి అయ్యే లోపల మరణమే మంచిదని నువ్వు అనుకొనే క్షణం వస్తుంది."

"అయ్య బాబోయ్! నాకు భయమేస్తోంది" వెక్కిరించాడు షాడో. అప్రయత్నంగా అతనిలో నుంచి ప్రొఫెసర్ జాన్సన్ మాయమయి, తిరిగి షాడో వచ్చి నిలబడ్డాడు. ఆ మార్పు కనిపెట్టలేదెవరూ. "జోకు వేస్తున్నానని అనుకోకు మిస్టర్! సీరియస్ గానే చెపుతున్నాను." అంటూ పక్కనున్న వ్యక్తికి సైగ చేశాడు.

తలుపు తెరుచుకుని బయటకు పోయాడా వ్యక్తి.

"ఎక్విప్‌మెంట్ తీసుకురావటానికి పోయాడతను. ఇప్పటికైనా నిజం చెప్పు. ఆఖరిసారి అడుగుతున్నాను."

పళ్ళు బిగపట్టాడు షాడో. "అలాగే! అయితే నేనూ ఆఖరిసారిగా మాట్లాడుతున్నాను. చెవులు విప్పుకొని జాగ్రత్తగా వినండి. నా పేరు డాక్టర్ జాన్సన్ హెర్రిక్. ఫిలాసఫీ ప్రొఫెసర్. మద్రాస్ యూనివర్శిటీ. ఇకనైనా మీ ఆటలు ఆపి నన్ను వదిలిపెడతారా ?"

గట్టిగా గుండెల నిండా గాలి పీల్చుకొని కళ్ళు మూసుకున్నాడు. తప్పులు అందరూ చేస్తారు. తన వంతు పోయింది. ఇక వారిది మిగిలిపోయి వుంది.

"నో. మీరు ఎక్కడికీ పోరు ప్రొఫెసర్. మాతోనే వుంటారు." బలమైన దెబ్బ మెడ మీద పడింది.

వంతు వారిది కాదు. కులకర్ణి గారిది.

ఆ సాధనాన్ని గుర్తు పట్టాడు షాడో. దాని బొమ్మనొకదాన్ని చూపించి ఎఫెక్టును వివరించి చెప్పారు. స్పెషల్ ఎఫెక్ట్స్ డిపార్టుమెంటు సి.ఐ.బి. ఏజెంటు ఒకరు అది వుపయోగించిన మూడు గంటల్లో ఆత్మహత్య చేసుకున్నాట్ట.

షాడో లాంటి శరీరం, విపరీతమైన మేధస్సు గల వ్యక్తి. అయినా దాని దెబ్బకు తట్టుకోలేక పోయాడు. దాని పేరు ఎవరికీ తెలియదు. అయినా ట్రూత్ టెల్లర్ అంటారందరూ. అరడుగుల ఎత్తున్న ఆ మెషీన్‌ను షాడోకు బిగించటం ప్రారంభించారు.

అటువంటి బాధలను భరించటానికి తగిన ట్రైనింగ్ పొంది వున్నాడు షాడో. కొన్నిగంటలు అవసరమైతే కొన్ని రోజులు అనుభవించగలడు. తర్వాత? మరణం దగ్గిరలో వున్నదని తెలిస్తే ఎన్ని బాధలయినా భరించవచ్చు కాని ఈ యంత్రం మనిషిని చావనీయదు.

మరణించేవాడికి తాను చేసిన పనులు గుర్తుకు వస్తాయంటారు. కాని తను మరణించబోవటం లేదు. ఎందుకూ పనికి రాకుండా పోతున్నాడు. తన ముఖాన్ని చూసి అందరూ దూరంగా తప్పుకుపోతారు. అయినా తన నోటి నుంచి ఒక్క ముక్క గూడా బయటికి రప్పించటం వీరికి కాదు గదా, వీరిని పుట్టించిన వాడికి కూడా చేతకాదు

ఇద్దరు షాడోకు రెండు వైపులా నిలబడ్డారు. చేతులు వెనక్కు విరిచి కట్టబడి వున్నాయి నిస్సహాయంగా. కులకర్ణి గారి మాటలు గుర్తుకు వచ్చాయి షాడోకు.

"షాడో మా ఏజెంట్లలో గట్టివాడు. తనని పట్టుకొని చిత్రహింసలు పెట్టే స్థితికి చేరుకోడెప్పుడూ అవసరమైతే పోరాడుతూనే ప్రాణాలు విడుస్తాడు."

ఇప్పుడు సరిగ్గా దానికి ఆపోజిట్ జరుగుతున్నది.

"ఒక్క నిముషం. నా మనస్సు మార్చుకున్నాను." అన్నాడు ప్లెజెంట్‌గా. అందరూ ఆత్రంగా చూశారు. షాడో తన తలను వుపయోగించాడు. బంధింపబడకుండా వున్ననది ఒక్కటే.

తన కుడికాలి దగ్గర వున్నవాణ్ణి చూశాడు మొదట. అందరికన్నా లావుగా వున్నాడా వ్యక్తి. కరెంటు తీగలు కలిసినప్పుడు వచ్చే మెరుపులా వేగంగా కదిలాడు

షాడో. శరీరంలో వున్న నరాలన్నీ కలిసే చోట తలతో గుద్దాడు. మొదలు నరికిన చెట్టులా నేలకూలాడతను. అదే వూపులో పక్కకు తిరిగి ఎడమ వైపున వున్న మనిషి ముఖం మీద పొడిచాడు తలతో. పెద్దగా మూలుగుతూ షాడో కాలు కింద పడ్డాడు.

అంతా క్షణాల మీద జరిగిపోయింది. నల్లగౌను వేసుకొన్న వ్యక్తి వెనక్కి గెంతి కరాటే ఫోజులో చేయి ముందుకు జాచి సిద్ధమయ్యాడు. తన కాళ్ళని పట్టుకొని వారిద్దరూ పడిపోవటంతో షాడో కాళ్ళు బంధవిముక్తి పొందాయి. ఒక్క ఎగురులో నల్లగౌనును ఎదుర్కొన్నాడు. ఎదురుచూసిన అవకాశం లభించింది. కుడికాలు ఎత్తి ముందుకు విసిరాడు కరాటే స్టైయిలు నుపయోగించి ధడ్ మని పోయి అనుకొన్న చోటులో తగిలింది కాలు. కాని వహించిన ఎపెక్టు రాలేదు. బట్లు వున్నట్లయితే నల్లగౌను నేలను కావలించుకునేవాడు. కనీసం చేతులు ఫ్రీగా వుంటే......! అయినా ఆ దెబ్బ అతన్ని ఆపగలిగింది ఒక్క క్షణం. కాలు నేలవాలగానే పిల్లిలా ఎగిరి పక్కకు దూకాడు షాడో. నల్లగౌను కరాటే దెబ్బ నుంచి తప్పుకోవటానికి.

ఇంకా ఇద్దరు మిగిలి వున్నారు. ఒక్కడు నలుగురితో పోరాటం చాలా కష్టమయిన పని. నాలుగో వ్యక్తి కరాటే దెబ్బతో షాడో మెడ మీద కొట్టాడు. మోకాళ్ళ మీద కూర్చుండి పోయాడు షాడో. రెండవ దెబ్బ అతని మనస్సును తిరిగి చీకటి లోకాలకు పంపింది. షాడో మనసులో మెదిలే ఆలోచన ఒక్కటే. ఎన్ని చిత్రహింసలు పెట్టినా తను మాట్లాడకూడదు; తను తప్పించుకోగలడు! అవకాశం వస్తుంది అనుకుంటూ లేవటానికి ప్రయత్నించాడు. అంతవరక వెపన్‌గా వుపయోగించిన తల ఇప్పుడు టార్గెట్ అయింది.

తళాతళా మెరిసే ఇనుప కడియంతో బలంగా ఆ తల మీద కొట్టాడు నల్లగౌను. షాడో ఆ చెయ్యి వూగటం చూసి తప్పుకోవటానికి విఫల ప్రయత్నం చేశాడు. "నా పేరు డాక్టర్ జాన్సన్. ఫిలాసఫీ ప్రొఫెసర్ని......" గింగిరెత్తించే దెబ్బ పడింది. స్పృహతప్పి బోర్లా పడిపోయాడు షాడో.

చాలా సేపు తను స్పృహ లేకుండా పడి వున్నానని గ్రహించగలిగాడు షాడో. చాలా విషయాలు జరిగాయి ఆ సమయంలో. తను దెబ్బలవల్ల మాత్రమే కాకుండా స్లీపింగ్ డ్రగ్స్ వల్ల తెలివిలేకుండా పడి వున్నాడని గ్రహించాడు. మామూలు మందులు కూడా కాదు చాలా శక్తివంత మయినవి.......

* * *

వెగటు వాసన పోయి మందుల వాసన తగలటంతో కళ్ళు తెరిచాడు షాడో. వాసన చూస్తే ఎక్కడో హాస్పిటల్లో వున్నట్లు అనిపిస్తోంది. కళ్ళను సన్నగా తెరిచి రెప్పల సందులో నుంచి చూసాడు. ఆ కాస్త ప్రయత్నాన్నికి చెమటలు పట్టాయి వళ్ళంతా.

అతను చాప మీద లేడు. చిత్రహింసలు పెట్టే యంత్రం లేదు. యమకింకరుల్లాంటి నలుగురు వ్యక్తులు మాయమయ్యారు. మళ్ళీ కళ్ళు తెరిచారు. ఎలక్ట్రిక్ షాక్ నొప్పి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది? వెంటనే మూసుకున్నాడు. రెండు క్షణాలు ఆగి తిరిగి తెరిచాడు. నొప్పి లెక్కచేయకుండా చుట్టూ చూసి లేచి కూర్చున్నాడు. ఒక పెద్ద టేబిల్ వెనుక ఒక బట్టతల వ్యక్తి కూర్చుని వున్నాడు. ఒక చేతిలో సిగరెట్ పొగలు వదులుతోంది. రెండో చెయ్యి బల్లమీద సాఫ్టుగా దరువు వేస్తున్నది.

తన గేంలో రెండో చాప్టరు మొదలయిందనుకున్నాడు షాడో. ఇతను వారి బాస్ అయి వుంటాడు. ఇక యంత్రం చూపించి, బ్రతిమాలతారు. నచ్చచెపుతారు. అప్పుడు వినకపోతే తిరిగి ఆ యంత్రం తెస్తామంటారు.

తను తన దుస్తుల్లోనే వున్నట్లు గ్రహించాడు షాడో. తన ఎపార్ట్‌మెంటు నుంచి ఏ దుస్తులతో బయలుదేరాడో, లూసియానా బెడ్ రూంలో కుర్చీమీద ఏ దుస్తులు విప్పి పడేశాడో, వాటిలోనే ఇప్పుడూ వున్నాడు. బంధించినప్పుడు వారి గౌను తొడిగి వుంచారు. పోయినవల్లా తన బూతద్దాలు, కొత్తగా సంపాదించింది. తల చుట్టూ వున్న బాండేజి.

సోఫాలో సర్దుకు కూర్చుని ఆ వ్యక్తివైపు చూశాడు. "ఆర్ య ఆల్ రైట్ ప్రొఫెసర్ జాన్సన్?" ప్రశ్నించాడతను. సీనాదేశపు యాస కొట్టవచ్చినట్లు కనపడుతోంది. తల వూపబోయి అప్రయత్నంగా విరమించుకున్నాడు షాడో. ఏ మాత్రం పక్కకు జరిగినా వూడి కిందపడేటట్లు వుంది. తను ఇతనిని ఎనిమీ అని ఎందుకు భావించాడు? సన్నటి పెదిమలు వింతగా నవ్వాయి.

"పెద్ద గాయమేమీ కాదు. కాని కొంతకాలం జాగ్రత్తగా వుండాలి." అన్నాడు.

ఫామిలీ డాక్టరు మాట్లట్లు ఫ్రెండ్లీగా, స్మూత్‌గా మాట్లాడుతున్నాడు. అదేమన్నా సింపతీ ట్రీట్‌మెంటేమోనని అనుమానించాడు షాడో.

"నాకేం అర్థం కావటం లేదు. నేనెక్కడ వున్నాను? మీరెవరు?" ప్రశ్నించాడు. అతని ముఖం మీద నవ్వు మాయమయింది. వాయిస్ మాత్రం జంటిల్‌గా, ఫ్రండ్లీ గానే వుంది.

"అవన్నీ అప్రస్తుతం ప్రొఫెసర్. నేను సీనా టౌన్‌లో ఒక డాక్టర్ని. ఒక యువతి నా సహాయం కోరింది. చేస్తున్నాను అంతే!"

"పోలీసులు....." నోరు తెరిచాడు షాడో.

"నో.నో.. మైడియర్ ప్రొఫెసర్. ఈ విషయాలు వారిదాక పోవటం ఎవరికీ మంచిది కాదు. నాకు చేతనయిన సహాయం చేస్తున్నాను."

"అయితే మీ సహాయానికి నా కృతజ్ఞతలు. థాంక్యూ వెరీమచ్. మీకు చాలా ఋణపడివున్నాను. " కొంచెం కొంచెం క్లియర్ అవుతున్నది షాడో మెదడు.

చెయ్యెత్తి షాడో పొగడ్తలను ఆపాడు ఆ వ్యక్తి.

"ఇటీజ్ ఆల్‌రైట్ ప్రొఫెసర్. ఒక విషయం మాత్రం జ్ఞాపకం వుంచుకోండి. ఈ సీనాటౌన్లో పరులెవరయినా వచ్చి గొడవ చేస్తే ప్రాణాలతో బయటికి పోవటం కష్టం. మీ విషయంలో ఏదో పొరపాటు జరిగింది. "

అలాగేనన్నాడు షాడో. తనకు జరిగిన పరాభావాన్ని మర్చిపోతాడా!

"మీరు రెండు రోజులు పూర్తి విశ్రాంతి తీసుకోవటం మంచిది. మంచం మీది నుంచి కదలవద్దు." లేచి పక్కకనున్న కాలింగ్ బెల్ నొక్కాడు.

రెస్టు తీసుకోవటానికి షాడోకి అభ్యంతరమేమీ లేదు. కాని లూసియానాతో మాత్రం కాదు.

"టాక్సీ పిలవమంటారా?" అడిగాడు.

తనని వదిలిపెడుతున్నందుకు ఆశ్చర్యపోయాడు షాడో. ఇంత తేలికగా వదులుతారని కలలో గూడా వూహించలేదు.

"నో థాంక్స్ కాస్త నడిస్తే మనస్సు తేలిక పడుతుంది. ఆమె ఎలా వుంది?" యాథాలాపంగా లూసియానా గురించి ప్రశ్నించాడు.

"బాగానే వుంది" ముక్తసరిగా సమాధానమిచ్చాడు.

"బీ కేర్‌ఫుల్ ప్రొఫెసర్" రెండు నిముషాల తరువాత అందంగా వున్న సీనాదేశపు యువతి షాడో చెయ్యి పట్టుకొని బిల్డింగ్ బయటికి తీసుకుపోయింది. గేటు ఓరగా తెరిచింది. షాడో బయటికి వచ్చి మెట్లు దిగి రోడ్డు మీద కాలు పెట్టాడు.

"డ్రాగన్ నెస్ట్" ఆ బిల్డింగ్ పేరు. ఇదివరకు ఆ బిల్డింగ్‌ని చూశాడు షాడో. ఆ వీధిలో నడిచాడు. అది సీనా టౌన్ మధ్యలో వుంది. కలత పడిన మనస్సుతో, మెల్లిగా అడుగులు వేయసాగాడు. ఆ వీధికి రెండు వందల గజాల దూరంలో వున్న సందులోనే వుంది యూనివర్సల్ ట్రేడ్ ప్రమోటల్స్ బిల్డింగు.

ఆ రోజు తను టేబిల్ కింద వున్నప్పుడు, బీరువా పక్కకుపోయి ఒక వాసన గదిలో వ్యాపించింది. అదే ఈ మందుల వాసన. అనుమానం లేదు.

దరిదాపు సాయం సమయమయింది. తను ఒక రోజుంతా వారి చేతుల్లో వున్నాడు. తల పగిలిపోతోంది. మాటి మాటికీ. ఆ కరాటే దెబ్బలు, ఇనుప కడియం, ట్రూత్ టెల్లర్ గుర్తుకు వస్తున్నాయి. కాని వాటి వల్ల ఇంత తల నొప్పి వుండదే! స్పృహ లేని సమయంలో మాట్లాడించటానికి ఇంజెక్షనేమైనా ఇచ్చారేమో! తను మాట్లాడాడా? తను వచ్చిన పని చెప్పాడా? నో.నో. అలాంటిది జరిగి వుండదు. తన ఐడెంటిటీ బయటపడితే ఇలా రోడ్ల మీద నడవటం సంభవించదు. సిమెంటు గట్టుకింద గోతిలో వుండేవాడు.

వారికీ ఈ డాక్టరుకూ ఏమిటి సంబంధం? తననెవరు విడుదల చేశారు? ప్రస్తుతం చేయవలసిన పని ఇవన్నీ మరిచి నిద్రపోవటం. మర్చిపోవాలి.....

ఒక బస్సు స్టాపులో సిటీబస్సును కాచ్ చేసి తన ఎపార్ట్‌మెంట్ చేరుకున్నాడు షాడో. ఎవరైనా చూసి వుంటే ప్రొఫెసర్ జాన్సన్ ఎపార్టుమెంటుకు పోయేముందు చల్లగాలి సేవించి పోతున్నాడనతనుకుంటారు.

అదే జరిగింది. షాడోను అనుసరిస్తూ వచ్చిన వ్యక్తులు అతను ఎపార్టుమెంటులోకి పోవటమే కనుపించినది. షాడో లోపలకు పోయి ఒక ప్రత్యేకమయిన తలుపు ద్వారా గారేజీ వెనకాల చిన్న గదిలో ప్రవేశించాడని, అక్కడ ఒక రేడియో, వైర్‌లెస్ సెట్టు వుందనీ తెలిస్తే తప్పకుండా వచ్చి చూసేవాడు.

తను బజార్లలో నడుస్తున్న సమయంలో ఒకచోట జరిగే సంఘటలను తెలుసుకోవాలని కోరుకునేవాడు షాడో. ముందరే తెలిసివున్నట్లయితే.

* * *

"వెధవలు, దున్నపోతులు. ఫూల్స్" నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టాడు.

"చెప్పిన పని చేయటం సరిగా చేతకాదు. చెప్పని కాడికెందుకు పోయారు?"

"సిగ్నల్ వచ్చింది. పొమ్మని ఆమె చెప్పింది....."

"షటప్. ఆమె ఏం చెప్పిందో నాకు తెలుసు. తప్పెవరిదో అంతకన్నా బాగా తెలుసు. మీ తొందరపాటువల్లే ఇంత అనర్థం జరిగింది. యూ స్టుపిడ్ డర్టీ – హెడ్ లెస్ స్కాండ్రల్స్."

" అది కాదు బాస్......"

"ఏది కాదు? ఇంకా ఎదురుపడి మాట్లాడటం కూడా నేర్చారా? అతను మిమ్మల్ని ఇక చూడకూడదు. మీ తప్పు మూలంగా నా కెంత నష్టమొచ్చిందో చూశారా?" మౌనంగా నిలబడిపోయారా నలుగురూ. "యూ కెన్ గో నౌ." అంటూ వారిని పంపాడతను.

కొంచెం సేపయిన తరువాత మరొకరితో మాట్లాడాడు.

"జరిగిన పొరపాటును సరిదిద్దుకోవాలి. ఇదీ ఒకందుకు మంచిదే. జాగ్రత్తగా పరిస్థితులను గమనిస్తూ వుండండి. ఏవీ ఆ ఫోటోలు?"

"వండర్ ఫుల్. చాలా బాగా వచ్చాయి."

షాడో గారేజీలో వున్న చెక్కపెట్టి మీద కూర్చున్నాడు. పైపు వెలుగుతోంది నోటిలో. అలవాటు లేని వ్యవహారం అయినా అలాగే తంటాలుపడుతున్నాడు.

"షాడో?" యియర్ ఫోనులో అడిగింది ఒకరి స్వరం.

"నీ వూహ కరెక్టు. యూనివర్సల్ ట్రేడ్ ప్రమోటర్సు కాంపౌండ్ డ్రాగన్స్ నెస్ట్ వరకూ వుంది. రెంటికీ ఒక పిట్టగోడ అడ్డం. "

"డ్రాగన్స్ నెస్ ఎవరది?"

"ఒక సీనాదేశీయుడిది. చాలా గౌరవనీయమయిన వ్యక్తి."

"ఆల్‌రైట్. తెలుసుకొని చెప్పు. ఆదివారం గొడవ సంగతేమిటి?"

"ఏముంది? దొంగ నీట్‌గా తప్పించుకున్నాడు. కంగ్రాచ్యులేషన్స్. పోలీసులు తను ఇన్వెస్టిగేషన్ పూర్తి చేశారు. అలమరు వెనుక వున్న డోర్‌ని కనిపెట్టటానికి విశ్వ ప్రయత్నం చేసి విఫలులయ్యారు. "వాంగ్ టాంగ్" కంపెనీ ఓనర్ నవ్వుతూ, వారికడ్డం పడి, ముందుకు సాగనివ్వలేదు. "

"అయితే సరే. అన్నట్లు వాంగ్ టాంగ్ ఎలా వుంటాడు.?"

"పొట్టిగా హేండ్సమ్ గా వుంటాడు. బాల్డ్ హెడ్. గోల్డ్ రింగున్న సిగరెట్లు కాలుస్తాడు. సన్నటి పెదాలు కళ్ళజోడు. "

"దుర్మార్గుడు....." సాఫ్ట్‌గా అన్నాడు షాడో.

"వ్వాట్......?"

"నిన్ను కాదులే స్వామీ! సీనా టౌన్ పదవస్ట్రీటు గుట్టమీదున్న ఇంటిని కాపలా......."

"లాభం లేదు. ప్రస్తుతం ఇక్కడెవ్వరూ లేరు. తన గొడవ ఒక్క మద్రాసులోనే కాదు. అన్నిచోట్లా వుంది. అందుకని....."

" యస్. యస్ నాకు తెల్సులే. మన బాబాయిని కల్సుకోవాలి. కనెక్షన్ ఇవ్వు అర్జంటు. నా కోసం ఎవరో వస్తున్నారు."

కులకర్ణిగారితో చకచకా రెండు నిముషాలు మాట్లాడి అన్ని విషయాలు వివరించాడు. రేడియో పెట్టి ఆఫ్ చేసి బాటరీ గొట్టంలో పెట్టి రాక్‌లో పడేశాడు.

తిరిగి మెయిన్ గేటు వద్దకు వచ్చేసరికి తనకన్నా ముందే ఇంట్లోకి ఎవరూ ప్రవేశించారు అని తెలిపోయింది. తలుపుకు ఆనించి పెట్టిన చిన్న కర్రముక్క నేల పడింది. లోపలి నుంచి ఎవరదో మగ కంఠం వినవస్తోంది.

ఎవరిదో కాదు. తనదే.

తలుపు తెరిచేసరికి మోత చేసింది. టేప్ రికార్డురు ఆగి పోయింది. లోపలికి ప్రవేశించి డ్రాయింగ్ రూములోకి తొంగి చూశాడు. లూసియానా కూర్చుని వుంది సోఫాలో.

* * *

"థాంక్ గాడ్!" నిట్టూర్చింది. "ఏదైనా గొడవ జరిగిందేమో అని భయపడుతున్నాను."

"నీ యింటికి వచ్చిన అతిధులందరికీ ఇదే గతి పట్టటం సహజమా?" కొంచెం సీరియస్‌గా అడిగాడు.

సోఫాలో నుంచి లేచి నిలబడింది. ముఖం తెల్లగా పాలిపోయి వుంది.

"దయచేసి అపార్థం చేసుకొవద్దు. నాకేమీ తెలియదు."

ముఖంలోని కాఠిన్యాన్ని సడలించి ఆమెను సోఫాలో కూర్చోబెట్టాడు షాడో.

ఆమెను కూర్చోమని చెప్పి తన రూములన్నిటినీ చెక్ చేశాడు షాడో. తన రహస్యస్థలాలన్నీ జాగ్రత్తగా చూసుకున్నాడు. ఫ్రంట్ డోర్ వేసి, కిచెన్ లోకి పోయాడు. తల నెప్పిని తగ్గించి, మెదడును, క్లియర్‌గా వుంచే టాబిలెట్ ఒక దానిని మింగి కాసిని నీళ్ళు తాగి వచ్చారు.

ఇద్దరూ కాఫీలు తాగుతూ ఎదురెదురుగా కూర్చున్నారు. పది నిముషాల తర్వాత " ఇప్పుడు చెప్పు లూసియానా! ఇదంతా ఏమిటీ?"

గట్టిగా నిట్టూర్చి తల విదిల్చింది. "వారెవరో నాకు తెలియదు ప్రొఫెసర్. మిమ్మల్ని ఎందుకు పట్టుకున్నారో అర్థం కావటం లేదు. మొదట్లో నాకు అంతా అయోమయం అనిపించినా, తరువాత సహాయం సంపాదించ గలిగాను. కాని..... ఈ రోజు మధ్యాహ్నం ఇది నా ఫ్రంటు డోర్ కింద వుంది" రక్తం లేనట్లు పాలిపోయింది ముఖం. వణుకుతున్న చేతులతో పుస్తకంలో నుంచి ఒక బ్రౌన్

కలర్ ఎన్వలప్ తీసింది. ఆ కవరందుకొని తెరిచి చూశాడు షాడో. ఎదురు చూస్తున్నదే అయినా కొంచెం షాక్ తినక తప్పలేదు.

"మైగాడ్ ఆ సమయంలో అందరూ ఇలాగే కనిపిస్తారా?" అనుకున్నాడు.

మొదటి మూడు ఫోటోగ్రాఫులూ తామిద్దరూ ముద్దులు పెట్టుకుంటున్నప్పుడు తీశారు. తర్వాత మూడు నోట్లో నోరు వుండగా తీసినవి. ఆకలితో ఒకరి నొకరు కొరుక్కుంటున్నట్లు కనబడుతున్నా రిద్దరూ.

"నోటు చూడండి" నీరసంగా అంది లూసియానా.

ఎన్వలప్ లోకి గాలి వూది ఒక చిన్న కాగితం బయటికి లాగాడు. షాడో తెల్ల కాగితం మీద బ్లాక్ లెటర్స్ వ్రాయబడి వుంది.

"ఇది నీ ప్రొఫెసరుకు చూపించు. నెగటివ్‌లు మా దగ్గరే వున్నాయి. త్వరలోనే మళ్ళీ మిమ్మల్ని కలుసుకుంటాం."

"ఐసీ" అంటూ వాటిని ఎన్వలప్‌లో పెట్టి ఆమె చేతికిచ్చాడు. "వెరీ ఇన్‌టరెస్టింగ్"

"ఇప్పటికైనా నీకు తెలిసిన విషయాలు పూర్తిగా చెపితే బాగుంటుంది."

భయంతో ఆమె నేత్రాలు వెడల్పు అయ్యాయి. "ఎందుకంత లైట్‌గా తీసుకుంటారు? మనల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు వాళ్ళు. ఇది మీకు అంత అవసరమో....."

"నీకు కూడా డియర్.... నేనొక్కడినే కాదు. ఇందులో నీకు గూడా భాగముంది." అన్నాడు.

"ఇటువంటి కాకి అరుపులకు దడిచేవాణ్ణి కాదు." కాని నిజంగా తన చోటులో అసలు జాన్సన్ వుంటే ఏమయ్యే వాడో వూహించుకున్నాడు షాడో.

"కనుక అన్ని విషయాలు నీకు తెల్సినంత వరకూ చెప్పు. ముఖ్యంగా డాక్టర్‌ని గురించి. "

మౌనంగా కంటి వెంబడి నీరు కార్చసాగింది లూసియానా.

"అది నేను చెప్పలేను. సీనా టౌన్ లో ఏం జరుగుతాయో మనకనవసరం. ముందర ఈ బ్లాక్‌మెయిల్ సంగతి చూడండి."

"కొంచెం తెలివి తెచ్చుకొని మాట్లాడు బేబీ" ఆమె చేతిలోని కవరుని తీసుకుని జేబులో వేసుకున్నాడు. "నాకు బ్లాక్‌మెయిలన్నా బ్లాక్‌మెయిల్ చేసేవారన్నా అసహ్యం. అందులోనూ అది నా మీదే ప్రయోగిస్తే చేతులు ముడుచుకొని కూర్చోవటం నాకు చేత కాదు. నేనే ఎదురు తిరిగి బ్లాక్‌మెయిల్ చెయ్యగలను. సులభంగా అర్థమయ్యేలా చెప్పలంటే– నేనడిగిన ప్రశ్నలకు నువ్వు సమాధానాలు ఇవ్వకపోతే నా పని నేను చేసుకుంటూ పోతాను. ఫోటోలను మార్చి, రూపాయలను ఛేంజి చెయ్యవచ్చని అందరికీ తెలుసు. నా యూనివర్శిటీ అధికారులు నామాట నమ్ముతారు. నమ్మించగలను. అయినా అంత కష్టపడవలసిన పనేముంది. సరాసరి పోలీసుల దగ్గిరకు పోయి అంత చెప్పేస్తాను. నన్ను డిస్‌మిస్ చేస్తే ఏం? హాయిగా ఇంకో రీసెర్చి చేసుకొంటాను. పాపం నాతో పాటు నువ్వూ దెబ్బ తింటావు. నీ ముఖం గూడా చక్కగా కనిపిస్తోందిగా!"

"పోలీసులకు చూపిస్తారా?" అదిరిపోయింది లూసియానా. "నా ఫాదర్‌కు తెలిస్తే ఇంకేమయినా వుందా. మా గౌరవం. మా ప్రతిష్ట....."

"ఏం చెయ్యమంటావ్? అంతకంటే వేరే మార్గం లేదు. ఫిలాసఫీ ప్రొఫెసరంటే పిరికివాడని మీ వుద్దేశ్యం అనుకుంటాను."

"మైగాడ్! వద్దు. పోలీసుల దగ్గిరికి వద్దు."

"వెరీ వెల్" లేచాడు షాడో. "నువ్వు మాట్లాడవ్. నాకు వేరే మార్గం లేదు. ఇప్పుడే పిలిచి అడిగింది చెప్పేస్తాను" సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"నేనేం శేష ప్రశ్నలు వేయటం లేదు. నన్ను ఎవరు విడిపించారు? ఎందుకు విడిపించారు? ఎలా విడిపించారు? అంతే!"

"అది. అది. కాదు మరే.... నో. ఇటీజ్" తడబడింది లూసియానా.

క్రమంగా ఆమె ముఖంలోకి కాంతి వచ్చింది. కళ్ళు మెరవసాగాయి. గట్టిగా నిట్టూర్చి అతని వైపు చూసింది. "ప్లీజ్ హెల్ప్ మీ?"

ఆమె కాఫీలో కలిపిన పౌడర్ వర్క్ చేయటం ప్రారంభించింది.

ఆమె పక్కన కూర్చుని, చేతుల్లోకి తీసుకున్నాడు. "లూసీయానా. నిజం చెప్పు. నేను నీకు సహాయం చేస్తాను" ఆమె కళ్ళని ముద్దు పెట్టుకున్నాడు.... పెదవుల్ని మెడను.... ఇద్దరూ గాఢంగా కౌగలించుకున్నారు.

నిముషం తరువాత వెనక్కి జరిగాడు. "ప్లీజ్" బతిమాలాడు. "లూసియానా నా దగ్గిర దాచాల్సిన అవసరం లేదు. నన్ను నమ్ము."

అతని వంక చూసింది జాలిగా. "నిన్ను విడిపించింది. మా ఫాదర్. డాక్టర్ ట్విన్. ఆయనకు సీనా టౌన్‌లో బాగా పలుకుబడి వుంది.... నేను ఆయనకు జరిగింది చెప్పి అంతా చేశాను."

"నా కోసం ఏమైనా చేస్తారు మా ఫాదర్."

"అయితే ఆ మనుషులెవరో మీ ఫాదర్ ను తెలుసున్నమాట!"

"తెలుసు. కాని ఎవ్వరికీ చెప్పడు."

"కాని ఈ ఫోటోలను గురించి ఆయనకు తెలిస్తే, చూస్తే? ఆయనకు తెలిస్తే నువ్వు భయపడాల్సిన పనే వుండదు కదా!"

"నో! నో" ఏడ్చినంత పని చేసి సోఫాలో కూర్చుంది లూసియానా. కొంచెం దిగి తన ఎప్రోచ్‌ని మార్చాడు షాడో.

"నువ్వు ఎందుకో బాధపడుతున్నావ్ బేబి. నాతో చెప్పకూడదా? నువ్వు ఎంత కాలం నుంచి హెరాయిన్ వాడుతున్నావ్?"

వులిక్కిపడింది. నోరు తెరిచి చేతిని నోటి కడ్డంగా పెట్టుకొని జరిగింది భయంగా. సడన్‌గా లేచి తను వేసుకున్న గౌనును కిందికిలాగాడు. జిప్ ఓపెన్ అయి తెల్లటి భుజాలు అందంగా కనుపించాయి. ఆమె వక్షోజాలు సవాలు చేస్తూ పిలిచాయి. వాటి ఆహ్వానం తిరస్కరించాడు షాడో. చంకలకింద చేతులు వేసి నునుపుగా తడిమాడు. చేతికి కొంచెం ఎత్తుగా తగిలాయి రెండు చిన్న దద్దుర్లు.

"చాలా కాలం నుంచి వాడుతున్నట్లుంది!"ప్రశ్నించాడు

కోపంతో అతని చేతుల్ని విసిరికొట్టింది. వురిమి చూస్తూ గౌనును సరిగ్గా లాక్కుని జిప్ సరి చేసుకుంది. మళ్ళీ అంత లోనే ఆమె మూడ్ మారిపోయింది.

"చాలా కాలం నుంచి వాడుతున్నాను. ఎలా తెల్సుకున్నారు?"

"హెరాయిన్ గురించి నాకు తెలుసు లూసీయానా. నీ లాంటి వారు ఎందరో దీని దెబ్బకు ఆహుతి అయిపోయారు. మీ స్నేహితురాలు లూసీ ఆమె

కూడా ఇదే వుపయోగించి యాక్సిడెంటులో ఇరుక్కుందికదూ. రేపు నీకు గూడా ఇలాంటి ప్రమాదమే జరగాలనివుందా?"

నిరాశనిండిన కళ్ళతో చూసింది షాడో వైపు.

"నాకు అలా చావాలని నే లేదు. కాని.... మా ఫాదర్....."

"ఏమిటి? మీ ఫాదర్.....? ఏం? ఆయనే నీకు మందు సప్లయి చేస్తున్నాడా?"

"లేదు. లేదు. ఆయనకీ సంగతి తెలియదు. తెలియకూడదు. "

"ఆల్‌రైట్. లూసియానా. నా మాటలినే పక్షంలో నీకు సహాయం చేస్తాను."

ఇక్కడి నుంచి ఫ్రీగా మాట్లాడింది లూసియానా. తాము ప్రతి శుక్రువారం బాంజో అనే వ్యక్తి దగ్గిర ఆ హెరాయిన్ డోస్ తీసుకుంటామని. అతను ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదని, అతను ఫోన్ చేసి పిలుస్తాడని చెప్పింది. ఈ సారి పిలిచినప్పుడు షాడోకు చెపుతానని ప్రామిస్ చేసింది. ఇంకా అతనిని గురించిన వివరాలు సేకరించటానికి ప్రయత్నించాడు షాడో. ఫలితం లేకపోయింది. ఎన్నిమెలికలు తిప్పినా తన మీద దాడి చేసిన వ్యక్తులు గురించి తెలుసుకోలేకపోయాడు షాడో. ఆ రాత్రి అతనితో గడపాలని కోరుతుంది గాని షాడో జెంటిల్‌గా రివ్యూ చేశాడు. తనకు ఆలోచించుకోవాల్సిన విషయాలు చాలా వున్నాయి. మళ్ళీ ఆమెతో కలిసి తలలు పగులగొట్టించుకోవటం ఎందుకు?" కేసులో చాలాదార్లు ఏర్పాడ్డాయి. లూసియానా–బాంజో – వారిద్దరూ ఫెయిలయితే డాక్టర్ ట్విన్. తరువాత వాంగ్ టాంగ్.

మొదట లూసియానాతోనే మొదలు పెట్టి చూడాలి అని నిశ్చయించుకున్నాడు.

* * *

దట్టంగా కమ్ముకున్నా సిగరెట్లు పొగలో ఆ హాలులో వున్నవారిని జాగ్రత్తగా పరిశీలించాసాగాడు షాడో. పెరిగిన జుట్లు.... గడ్డాలు, మీసాలు రకరకాల దుస్తులు వేసుకొని వారందరూ. ఆడవాళ్ళు కూడా అదే మాదిరి హిప్పీ డ్రస్సుల్లో వున్నారు. వారందరిలోనూ లూసియానా గుర్తుపట్టటానికి ప్రయత్నిస్తున్నాడు.

అంతకు ముందు రోజు లూసియానో షాడోను కలుసుకుంది క్లాసురూములో. బాంజో ఫోన్ చేశాడని, ఆ కుర్రవాడు రాత్రి ఎనిమిది గంటలకు బీచి రోడ్డులో గ్లోబ్ హోం దగ్గిర కలుస్తాడని చెప్పింది. అక్కడ తను వస్తాదని ప్రామిస్ చేశాడు షాడో. ఆమె బయలు దేరిన తరువాత గంటకు ఇంటి వద్ద కలుస్తాడని మాట ఇచ్చాడు.

ఇప్పుడు అదే విధంగా వచ్చి కూర్చున్నాడు. చెవులను కప్పిన జుట్టు, నీలం రంగు హేండ్ కర్చీఫ్ తలకు కట్టుకున్నాడు. మీసాలు మెలి తిరిగి వున్నాయి. మేకపోతు గడ్డం, కుడిచెవికి సిల్వర్ రింగ్. బ్లాక్ సోలో నెక్ బనియన్. టైట్ బ్లూ కలర్ పాంటు, అచ్చం హిప్పీలాగా వున్నారు.

రివాల్వరు బెల్టు వెనక వుంది. పాంటు జేబులో రకరకాల గాస్ బాంబులున్నాయి. డ్రాగర్ మామూలుస్థానాన్ని చేరింది.

చేత్తో రఫ్‌గా చుట్టిన సిగిరెట్టు కాలుస్తూ... ఒక మూల కూర్చుని వున్న లూసియానాని చూశాడు. ఆమెతో మరి యిద్దరు వున్నారు. పరీక్షగా చూసి, వారు కూడా తన క్లాసు విద్యార్థులేనని గ్రహించాడు.

ఆ రోజు క్లాసులో లెక్చరు దంచేశాడు షాడో. ఇది వరకంతటి నిర్లక్ష్యం కనిపించలేదెవరిలోనూ అందరూ కొంచెం అభిమానంగానే చూశారు అంత వంక.

సన్నగా వున్న వ్యక్తి లూసియానా టేబిల్ దగ్గిరకు పోవటం గమనించి ఎలర్ట్ అయ్యాడు. లూసియానా దిక్కులు చూస్తోంది. ప్రొఫెసర్ జాన్సన్ కోసం. కొంచెం సేపు చూసి చేత్తో ముఖాన్ని రుద్దుకుంది. వెంటనే షాడోకు అర్థమైంది. బాంజో అంటే అతనే నన్నమాట.

బాంజో లూసియానాతో ఏమీటో మాట్లాడాడు. ఆమె చెప్పింది విని ఖంగారుపడినట్లు అనిపించింది. నెమ్మదిగా తల తిప్పి హాలంతా చూశాడు. ఇంకో టేబిల్ దగ్గిర కూర్చున్న ఇద్దరి వంక చూసి సైగ చేశాడు.

కాజువల్‌గా లేచి బయటకు నడిచాడు షాడో. తను వచ్చిన పని అయిపోయింది. ఇక వేట మొదలు పెట్టాలి. హోటలుకు వంద గజాల దూరంలో పార్కు చేసి వుంచాడు. తన రెంటెడ్ అంబాసిడర్‌ను. స్టార్ట్ చేసి సీనాటౌన్ వైపు పోనిచ్చాడు. ఒక మలుపులో ఆగి, వెయిట్ చేశాడు. పది నిముషాలు తరువాత మెల్లిగా లూసియానా చెవర్లెట్ రావటం కనుపించింది. శరవేగంతో లూసియానా ఇంటికి పోయాడు. ఇంటికి దూరంగా కారును పార్కు చేసి నిశ్శబ్దంగా సమీపించాడు బిల్డింగును. ఫ్రంట్ డోర్ క్షణంలో తెరుచుకుంది. లోపలికి ప్రవేశించి లాక్ చేశాడు. మెట్లు ఎక్కి లూసియానా బెడ్ రూంలోకి పోయాడు. పెన్

టార్చి వెలుగులో అతని వేళ్ళు, ఆ గోడలను తడిమాయి. ఒక సిల్కు తెర వెనుక వుంది ఒక తలుపు నిశ్శబ్దంగా తెరిచి చూశాడు. చిన్నగది. ఒక టేబిల్. ఛైర్ వున్నాయందులో. వాటిని పరిశీలిస్తూండగా చెవర్లెట్ వచ్చిన శబ్దం వినవచ్చింది.

వెంటనే వెను తిరిగి తలుపు వేశాడు. బెడ్ రూం దాటి మెట్లు దిగే సమయానికి తలుపులో తాళం చెవి తిరుగుతున్నది. హడావుడిగా మెట్ల కింద చేరి ఒదిగి కూర్చున్నాడు.

తలుపు తెర్చుకుంది. బాంజో, లూసియానాలు లోపలికి వచ్చి తిరిగి తలుపు తాళం వేశారు.

"డోన్ట్ బీ ఎఫ్రైడ్ బాంజో. ఇంకో గంటదాకా ప్రొఫెసర్ రాడులే. వస్తే మనం జాగ్రత్తపడ్డాంగా ?"

"నాకతనిని చూపిస్తే అక్కడే అంతు చూసేవాణ్ణి గదా" నెర్వస్‌గా అన్నాడు బాంజో.

"ఎక్కడ వున్నాడో నాకు మాత్రం తెలుసా! ఏ రూపంలో వచ్చాడో!"

డ్రాయింగ్ రూంలో కూర్చున్నారిద్దరూ. గ్లాసులు మోగుతున్నాయి. "బాంజో అతను రాగానే నువ్వు నా రూంలో దాక్కో. చింగ్, లిన్ రెడీగా వున్నారు. అందరం కలిసి అతని అంతు చూద్దాం. సరేనా?" మత్తుగా, ముద్దగా ప్రశ్నించింది లూసియానా. తరువాత కొంత సేపు నిశ్శబ్దం. నిట్టూర్పుల నిశ్శబ్దం. వారు చేస్తున్న దేమిటో గ్రహించాడు షాడో. పాంటు జేబులో నుంచి చిన్న పెన్సిల్, ఒక నోట్ బుక్, గోలీలాంటి మెటల్ బాల్ తీసి పట్టుకున్నాడు. మసక వెలుగులో నోట్ బుక్

కాగితం చించి ఏదో వ్రాశాడు. మెల్లిగా అడుగులు వేస్తూ డ్రాయంగ్ రూంలోకి తొంగి చూశాడు.

సోఫాలో తాచుపాముల్లా పెనవేసుకొని వున్నారు లూసీయానా, బాంజోలు వారి కోరికలు తమకంతో. బయటి ప్రపంచాన్ని మరిచిపోయారు.

మెటల్ బాలుకున్న చిన్న డయల్‌ని సరిచేసి నిశ్శబ్దంగా గదిలోకి దొర్లించాడు షాడో. ఆ పని చేయటం ఇష్టం లేక పోయినా బయట తన కోసం కంపెనీ సిద్ధంగా వుండి వుంటుంది.

నోటును తలుపు పక్కన జారవిడిచి లేచి నిలబడ్డాడు. మెటల్ బాల్ తన పనిని ప్రారంభించింది. వారిద్దరూ మత్తుగా తలలు వాల్చి నిద్రపోతున్నారు. ఒక అవరోధం తీరింది. ఇక తను నిర్భయంగా తన వెతుకులాట పూర్తి చేసుకోవచ్చు.

కిచెన్ తలుపులు తీసి, తిరిగి బెడ్ రూంలోకి పోయాడు. పెన్ టార్చి వెలుగుతో అలమరా వెనక వున్న తలుపులు తీయటానికి ప్రయత్నస్తుండగా కారు వచ్చిన సడీ అయింది. ఎవరో కారు దిగిఆ బిల్డింగులోకి వస్తున్నారు.

డామిట్! అడుగడుగునా ఆటంకాలేననుకుంటూ కిందికి పరుగెత్తుకువచ్చాడు. డ్రాయింగ్ రూంలో నిద్రపోతున్న బాంజోను లూసీయానా మీద నుంచి లాగి భుజాన వేసుకున్నాడు. డోర్ బెల్ అప్పటికే రెండుసార్లు మోగింది. బాంజో బరువుతో అటూ ఇటూ వూగుతూ కిచెన్‌లో నుంచి వెనక వైపు వున్న గార్డెన్ లోకి పరుగెత్తాడు. తలుపు తీసుకొని ఎవరో లోపలికి ప్రవేశించారు. పిట్టగోడ దగ్గరికి పరుగెత్తుతున్న షాడో సరాసరి ఒక లావుపాటి మనిషికి పోయి గుద్దుకున్నాడు.

ముగ్గురూ కట్టకట్టుకుని కింద పడ్డారు. షాడోమీద బాంజో, లావుపాటి మనిషి వారిద్దరికింద. లేవటానికి ప్రయత్నిస్తూ ఆ మనిషి ముఖాన్ని గుర్తుపట్టాడు షాడో. లూసియానా గదిలో తనని కొట్టింది అతనే.

తేరుకుని పిడికిలి బిగించి ముక్కుమీద గుద్దాడు. ముక్కు చితికింది. అయినా చలించలేదతను. ఒక చెయ్యి షాడో దెబ్బల నడ్డం పెట్టటానికి వుపయోగిస్తూ, కోటు కింద వున్న రివాల్వరు తీయటానికి ప్రయత్నించాడు. బాంజోని కిందికి తోసి లేచాడు షాడో. అప్రయత్నంగా రివాల్వర్‌ని లాగింది కుడిచెయ్యి. ఎత్తి గొంతులో పొడిచాడు మడమతో. అరవటానికి ప్రయత్నించాడతను. మళ్ళీ రివాల్వర్‌తో నోటి మీద కొట్టాడు. ఫట్ మంటూ నాలుగు పళ్ళు విరిగి పోయాయి. ఆ బాధకు తెలివి తప్పి పడిపోయాడు ఆ లావుపాటి వ్యక్తి.

మళ్ళీ బాంజోను భుజం మీద వేసుకొని పిట్టగోడ దాటి రోడ్డు మీదికి వచ్చాడు. ఇక తన ప్రొఫెసర్ వేషంతో పని తీరిపోయింది. తను వదిలిన నోటు అందులో తను వచ్చినట్లు, ఎవరూ కనుపించక తిరిగిపోయినట్లు వాసి వున్నాడు. ఆ లావుపాటి మనిషి తనని గుర్తుపట్టాడు. ప్రొఫెసర్ కాదని తేలిపోయింది.

కారు వెనుక సీటులో బాంజోని పడవేసి సార్టు చేసి వెనక్కి తిప్పాడు. పెద్దగా విజిల్ వేస్తూ బయటికి పరుగెత్తుకు వచ్చారు ఎవరో. యాక్సిలేటరు బలంగా నొక్కి ముందుకు దూకించాడు. మలుపు తిప్పి సందులోకి లాగించాడు. వారు తమ కారులో ఎక్కి వెంబడించ ప్రయత్నించే సరికి షాడో అదృశ్యమయ్యాడు ఆ సందుల్లో నుండి.

* * *

గ్రేకలర్ సిల్క్ సూట్‌లో వున్న పెద్ద మనిషి – నల్ల కళ్ళాద్దాలలో నుంచి తన ఎదురుగా కూర్చున్న ముగ్గురినీ అదోలా చూశాడు. టేబిల్ మీద పేపర్ వెయిట్ తీసి చేతుల్లో తిప్పసాగాడు. కంఠం ఎంతో మృదువుగా, మ్యాజిక్ లాగా వినవచ్చింది.

"ఇలా జరుగుతుందని మనం అనుకోలేదు. విచారించవలసిన విషయం." అందరి ముఖాలు చూసి తిరిగి ప్రారంభించాడు. "ఒక విధంగా ఇటువంటిదేదో సంభవిస్తుందనే ముందు జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. పోలీసుల ఇన్వెస్టిగేషన్‌కు తయారవటం అయిపోయింది." చిన్నగా నవ్వి చెప్పాడు. "అఫ్‌కోర్స్ తప్పు నాదే. శత్రువును తక్కువగా అంచనా వేసుకోవటం వల్ల పొరపాటు జరిగింది."

"మీరు అడిగిన ప్రశ్న మిస్టర్ బాంగ్, బాంజో ఏమయ్యారని కదూ? అతని జాడ ఇంకా తెలియలేదు. పోలీసుల బంధంలో కూడా లేదని నా విశ్వాసం." అతని మాటలు అందరూ ప్రశాంతంగా వింటున్నారు. ఎవరి ముఖాల్లోనూ భావాలు మారటం లేదు. చారలకోటు వేసుకున్న ఒక లావుపాటి వ్యక్తి లేచి నిలబడ్డాడు.

"అయితే బాంజో మాట్లాడి వుంటాడని మనం అనుకోవాలి. ఆ విధంగానే మన ప్రోగ్రాం ఫిక్స్ చేసుకోవాలి. కదూ మిస్టర్?"

"కరెక్టు. బాంజో మాట్లాడకపోతే ప్రొఫెసర్ జాన్సన్. అది అతని అసలు పేరో కాదో మన కింతవరకూ తెలియలేదు. హైద్రాబాద్ ఎందుకు పోతాడు?

"గాలిలో కరిగినట్లు మాయమయ్యాడు. అతనికి మన రహస్యాలు ఎంతవరకూ తెలుసు?" చారల కోటు ప్రశ్నించాడు.

ఒకసారి నిట్టూర్చాడు సిల్క్ సూటు. "తక్కువ ధరలు. విద్యార్థులతో అమ్మకం. హైద్రాబాదు, మిస్టర్ పాల్. అంతే. పాల్ విషయంలో మనం భయపడవలసిన దేమీ లేదు. ఈ పాటికి తగిన జాగ్రత్తలు తీసుకునే వుంటాడు."

అక్కడ చేరిన నలుగురి మనస్సులోనూ ఒకటే ఆలోచన తిరుగుతున్నది. ప్రొఫెసర్ హైద్రాబాద్ చేరుకున్నాడు. అది నికరమైన మాట. ఇక ముందు ఏం చేయబోతున్నాడు?

గొంతు సవరించుకొని లేచి నిలబడ్డాడు సిల్క్ సూటు. గోల్డ్ రింగ్ సిగరెట్టు వెలిగించి మాట్లాడసాగాడు.

"ఫ్రండ్స్ మొదట ఈ ప్రొఫెసర్ గాడిని పట్టుకున్నాం. కాని అప్పుడు చిత్రహింసలు పెట్టినా, ట్రూత్ చెప్పించే మందులు వుపయోగించినా, తను ప్రొఫెసర్నే అన్నాడు. కాని అంతకు మించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆ మాటలు నమ్మి మనం అతన్ని వదిలిపెట్టటం జరిగింది. కాని అతడొక ఎక్స్‌పీరియనస్డ్ ఏజెంట్ అని, బహుముఖ ప్రజ్ఞావంతుడని, అతను తీసుకున్న కవర్‌ని బట్టి తేలిపోయింది.

* * *

షాడో కొంచెం కంగుతిన్నాడు. తను ఎన్ని మారు వేషాలు వేసినా తనతో సన్నిహిత పరిచయం కలవాళ్ళు గుర్తుపట్టి తీరతారు. నీలిమ మాట్లాడితే

ప్రమాదం. అలా అని వెళ్ళిపోవటానికి మనస్కరించలేదు. నీలిమ ఇక్కడ ఎందుకుంది? ఏం చేస్తున్నది?

ఖంగుమంటున్న కంఠంతో నీలిమను పలకరించాడు. "హల్లో డార్లింగ్ లాంగ్ టైమ్. నోసీ. "

నీలిమ కళ్ళు ఆర్పింది. ఆమె ఎదుట కూర్చున్న వ్యక్తి వైపు చూశాడు షాడో. కొంచెం మంచి పర్సనాలిటీకల వ్యక్తి అతను. తమ ఇద్దరివంకా విచిత్రంగా చూస్తున్నాడు.

"మీ ఇద్దరికీ పరిచయం వుందా?" ప్రశ్నంచాడతను ఆశ్చర్యంతో.

"నీకెందుకు బే! తూ కౌన్ హై?" కరకర మంది షాడో కంఠం.

కోపంగా లేచి నిలబడ్డాడతను. "నేను ఎవరినా? నేను ఎవరినా?" గింజుకున్నాడు. కుడిచేతికున్న ఇనుపకడియాన్ని పిటికిటి మధ్యక చేర్చాడు షాడో. కళ్ళు అరమూసి తయారుగా నిలబడ్డాడు.

"అవును బే ఎవరు నువ్వు? మా సంగతి నీ కెందుకు?" నీలిమ లేచి వారిద్దరి మధ్య నిలబడింది. షాడో ఎంతకైనా తెగిస్తాడని ఆమెకు తెలుసుగాని మరీ ఇంత రౌడీలాగా ఎగిరిపడతాడని అనుకోలేదు.

"మిస్టర్... మిస్టర్ " ఏమని పిలవాలో అర్థంకాక తడబడింది. షాడో వృత్తి తెలుసు గనుక, నిజమైన పేరుతో పిలిస్తే అతనికి కోపం రావచ్చు.

"అబే! నీలిమా! పురానా దోస్తుని మరిచిపోయావ్?" నిశ్చేష్టుడైనాడు షాడో. "నీ ప్రీతమ్ డెవిల్‌నే గుర్తుపట్టలేకపోయావ్?" బోడిగుండును సవరించుకుంటూ అడిగాడు.

పెదవి కొరుక్కుంది నీలిమ. "అవును కదూ బోడిగుండువల్ల గుర్తుపట్టలేకపోయాను. పాల్..... అతను" అంటూ ఆ వ్యక్తి వైపు తిరిగింది.

"పాల్, ఇతను నా స్నేహితుడు డెవిల్. బాంబేలో పరిచయం అయింది. అనుకోని చోట్ల వూడి పడుతూ వుంటాడు." పరిచయం చేసింది.

"బాప్ రే! ఈ క్లబ్బు నీదా పాల్ భాయ్?" టోన్ మార్చి సజావుగా అడిగాడు షాడో. "మాఫ్ కర్నా. నేను ఎవరో అనుకున్నాను." చేతులు కలిపాడు. చిరునవ్వుతో షేక్‌హేండ్ ఇచ్చాడు పాల్. తుఫాను వెలిసిననట్లయింది. తను కడియాలతో పోట్లాడలంటే పాల్‌కు తగని భయం.

"నీలిమాస్వాదీ! నువ్వు ఇక్కడేం చేస్తున్నావ్ ?"

"స్టుపిడ్. కనపట్టంలా. నేను డాన్సర్ని."

ఓహో అనుకుంటూ తల వూపాడు షాడో. కిందటి సారి చూసినప్పుడు తన మిత్రుడు జిత్తు నీలిమచుట్టూ తిరుగుతున్నాడు. ఆ రాస్కేల్ ఎక్కడున్నాడో!

"క్యా పాల్ భాయ్, మనం డ్రింకులు తీసుకుందామా?" పాల్ వైపు తిరిగాడు. తల తిప్పాడు పాల్. "థేంక్స్. ఇప్పుడు అవసరం లేదు." నీలిమ బుజం తట్టి చెప్పాడు. "మీరిద్దరూ కలిసి ఎంజాయ్ చెయ్యండి.... నేను తరవాత కలుస్తాను."

షాడో చేతులు పుచ్చుకుని క్లబ్బు వెనక వున్న గార్డెన్ లోకి తీసుకుపోయింది నీలిమ. ఇద్దరూ కలిసి క్రోటన్స్ పక్కగా నడుస్తున్నారు. గార్డెన్ చుట్టూ ఎత్తైన ప్రహరీ వుంది. గేట్లు బలమైన కాపలాతో వుండటం గమనించాడు షాడో.

ఒక మూలకు చేరగానే గుసగుసలాడింది. నీలిమ, "రాజూ! నువ్వు ఎవరి కొంపలార్చటానికి వచ్చావ్? అక్కడ ప్రతి కార్నరు, ప్రతి టేబిల్ లోను హియరింగ్ బగ్స్ వున్నాయి. అందుకని ఇక్కడకు తీసుకువచ్చాను."

"నీలిమా! నువ్వు జైలునుండి ఎప్పుడు విడుదల అయ్యావ్. జిత్తు ఏమయ్యాడు? మళ్ళీ ఈ చెత్త లోకి ఎందుకు వచ్చావ్?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

"అర్జెంటుగా ఒక డాన్సర్ కావాలని నా స్నేహితుడిని కోరాడట ఈ పాల్ గాడు. ఎంత కావాలన్న ఇస్తానన్నాడు. ముఖమాటం కొద్దీ కాదనలేకపోయాను....." నాన్చింది నీలిమ. అర్థం చేసుకున్నట్లు బుజం తట్టాడు షాడో. కొన్ని బ్రతుకులింతే ఒకసారి చెడు దారిలోకి జారితే ఇక బయటపడటమంటూ జరగని పని.

"అది సరే రాజూ డార్లింగ్! ఈ జవాబు ఏమిటీ? ఈ వేషం ఏమిటీ?"

"చిన్నప్పటి నుంచి రౌడీ అవుదామని కలలుకన్నాను. ఆ కోరిక తీరక అప్పుడప్పుడూ ఇలా వేషాలు వేస్తూ వుంటాను. అవునూ! ఈ పాల్ గాడి సంగతేమిటి!" కాజువల్‌గా ప్రశ్నించాడు.

"ఈ క్లబ్బును క్రిందటి సంవత్సరమే కొన్నాడు. రాజూ ఇతన్ని గురించి పూర్తిగా నాకు తెలియదు. నాకు వెయ్యి రూపాయలు ఇస్తాడు. డాన్స్ చేస్తాను. అంతే. పిచ్చి కుక్కలా వెనక పడుతున్నాడు. మళ్ళీ ఏం జరిగింది. నా మీదకొచ్చి పడ్డావెందుకు?" అడిగింది.

"నీలిమా! నా సంగతి నీకు తెలుసుగా!" సీరియస్‌గా అన్నాడు షాడో.

"మన దేశంలో హెరాయిన్ తాకిడి ఎక్కువ జరుగుతున్నది. దాని విషయంలో తిరుగుతున్నాను. ఈ పాల్ మీద అనుమానం వచ్చి ఇలా వచ్చాను."

జేబులో నుంచి పనామా తీసి వెలిగించాడు.

"నీకూ ఈ రాకెట్‌తో సంబంధముంటే చాలా ప్రమాదం. ఇక నిన్ను రక్షించటం ఆ బ్రహ్మదేముడి తరం కూడా కాదు."

నీలిమ ఖంగారుపడింది. షాడో సీరియస్‌గా మాట్లాడటమే అరుదు. ఆ టోన్‌లో మాట్లాడితే ఇక తిరుగుండదు అతను అన్నదానికి.

"రాజూ! రాజూ. నన్ను నమ్ము. నాకు ఈ పాల్‌కి ఏం సంబంధం లేదు. నేను మామూలు డాన్సర్ని మాత్రమే. ఈ వృత్తిని నేను ఎంత అసహ్యించుకుంటానో నీకు తెలియదా?" కళ్ళు తుడిచేసుకుంది.

"ఇక లే! నడుస్తూ మాట్లాడుకుందాం" వెయిటర్లు ఇటువైపే చూడటం గమనించి అన్నాడు షాడో. నీలిమ నిజం చెప్తున్నట్లుగానే వుంది. నమ్మటమా వద్దా! అని ఆలోచిస్తున్నాడు.

"రాజూ! చెప్పు నీకు నా వల్ల జరిగే ఏ సహాయమైనా చెయ్యటానికి సిద్ధంగా వున్నాను."

తిరిగి బిల్డింగులోకి ప్రవేశించేసరికి ఆమెను నమ్మాడు షాడో. తన ప్లానుల్లో కొంత భాగం చెప్పాడు.

"నీలిమా నేను పరమకిరాతకుణ్ణి అనీ, స్మగ్లింగులో మెలిదిరిగిన చెయ్యి అనీ బాంబేలో నా దెబ్బకు తిరుగు లేదనీ పాల్ గాడికి చెప్పు. మిగిలిన విషయాలు నేను చూసుకుంటాను."

"చెప్తాను రాజూ! అభం శుభం ఎరుగని పిల్లల మీదా వీరు తమ పగ చూపించేది? ఎల్లాగైనా వీరినాపాలి. ఈ ప్రయత్నంలో సంతోషంగా నీతో పాటు పంచుకుంటాను."

* * *

బైట జరిగే క్యాబరే డాన్సు మ్యూజిక్ గోడలను చీల్చుకొని ఆఫీసులోకి వస్తోంది. తాగి ఇష్టం వచ్చినట్లు అరుస్తున్నారందరూ.

పాల్ పర్సనల్ ఆఫీసులో కూర్చున్నారు ఇద్దరూ. పనామా వెల్గించి, పొగను రింగులు వదులుతున్నాడు షాడో. అగ్గిపుల్ల నోట్లో పెట్టుకొని నములుతూ షాడో వంక తదేకంగా చూస్తున్నాడు పాల్.

"ఓకే. నీ గురించి నీలిమా అంతా చెప్పింది మిస్టర్ డెవిల్. నిన్న నువ్వు ఆమె మీద చూపించినంత ప్రేమ ఆమెకు నీ మీద లేదు కదూ?"

"సో. ప్లెయిన్ గా చెప్తాను విను. నేను గాంబ్లర్ని. ఎవరినీ నమ్మటం నా కలవాటు లేదు. ఎవరితోనైనా డబ్బుకోసం కాంటాక్టులు ఏర్పరుచుకుంటాను. కాస్తా కూస్తా కాదు. హెవీ పేమంట్స్." వత్తి పలికాడు.

కోరమీసాలు దువ్వాడు షాడో. సిగరెట్టు పెదవుల చివరికి వచ్చి కుడిచేతి కడియాన్ని సరిచేసుకోవటం ప్రారంభించాడు.

"కాస్తా కూస్తా అంటే ఎంత బే? పది లక్షలా?" అడిగాడు నిర్లక్ష్యంగా షాడో.

గుడ్లు వెళ్ళబెట్టాడు పాల్. పెదిమలు తడిచేసుకున్నాడు.

"పది లక్షలు ఎక్కడున్నాయి?"

"అబే ! బాంకులో."

పగలబడి నవ్వాడు పాల్. "మిస్టర్ డెవిల్ జోకులు బాగా వేస్తావు. బాంకులో పది లక్షలేం ఖర్మ. పదికోట్లు కూడా వుంటాయి."

అదే మాదిరి చూస్తూ వాలెట్ తెరిచి ఒక బాంక్ డిపాజిట్ స్లిప్ తీసి టేబిల్ మీద పడవేశాడు షాడో. డెక్కన్ బాంకులో అదే రోజున ఇరవై లక్షల రూపాయలు డెవిల్ పేరు మీద డిపాజిట్ వెయ్యబడి వున్నాయి.

"కావాలంటే రేపు బాంకుకు పోదాం బే. అక్కడే కాష్ పేమెంట్ చేస్తాను. మాల్ ఈ చేతిలో కాష్ ఆ చేతిలో" చేతులు వూపాడు.

పాల్ కళ్ళు ఆ రిసీట్ మీదే వున్నాయి. షాడో వాలెట్ తెరిచి అందులో కుక్కేదాకా దాని వంకే చూస్తున్నాడు.

"ఇంత డబ్బు నీ కెక్కడిది డెవిల్? నీలాంటి వాళ్ళు అందరికీ తెలిసి వుంటారే? నీ పేరు నేనెప్పుడు విననే లేదు. "

"అబే! అటువంటి మాటలు నోటి వెంట వచ్చాయో నాలుక పీకేస్తాను. నా సంగతి నీ కెందుకు బే? నీకు కావాల్సింది డబ్బు తీసుకో– నాకు కావాల్సింది మాల్ – ఇవ్వు. ఖతమ్. హిస్సా ఠీక్, బాకీ మాఫ్. "

"అరరే! అంత తొందరపడితే ఎలా డెవిల్? ఇంత పెద్ద మొత్తంలో వ్యాపారం అన్నీ విషయాలు తెలుసుకోకుండా చెయ్యటం కష్టం కదా?"

"చుప్ బే! కష్టం గిష్టం జాన్తానై. ఆటో ఇటో తేలిపోవాలి. అరగంట సేపు హస్కు కొట్టటం నా కిష్టం లేదు."

బలవంతంగా షాడోను కూర్చోబెట్టాడు పాల్.

"నీకు ఎంత కావాలి? ఏం కావాలి?" ప్రశ్నించాడు తెలివిగా.

"నువ్వు ఇవగలగినంత. నాకు కావల్సింది ఫస్ట్ క్లాస్ "హెచ్" నచ్చితే నిన్నే కొనేస్తాను బే."

రెండు క్షణాలు ఆలోచించి లేచాడు పాల్. "ఓకే ఫ్రండ్. ఒక్క నిముషం కూర్చుంటే ఫోను చేసి వస్తాను."

కాళ్ళు ఎత్తి టేబిల్ మీద పెట్టి కుర్చీ వెనుక తలానించి విలాసంగా సిగరెట్ కాల్చుకోసాగాడు. ఒకసారి చిరాకుగా అతని వంక చూసి గుటకలు మింగాడు పాల్. వీడెక్కడో మరీ ఎముకలు విరుచుకొని తినేంత కసాయివాడులా వున్నాడు అనుకుంటూ పక్కనే వున్న బటన్ నొక్కాడు. గోడకానించి వున్న అలమరా పక్కకు తప్పుకుంది. లోపలికి పోగానే తిరిగి మూసుకుపోయింది.

పాల్ లోపలికి పోగానే రూమునంతా కలియ చూశాడు షాడో. తనను ఎవరో రహస్యంగా గమనిస్తున్నట్లు అతని ఎలర్ట్ సెన్సెస్ వార్నింగిస్తున్నాయి. సిగరెట్టు దూరంగా వుంచి రూములో గాలిని గుండెల నిండా పీల్చుకున్నాడు. సిగార్ వాసన తన పనామా పొగ తప్పించి..... లేదు. బీరువా పక్కకు పోయినప్పుడు ఇంకేదో వాసన వచ్చింది. స్వీట్‌గా, మైల్డ్‌గా, ఇంకొక నీలిమ వుపయోగించిన సెంటు కాదది. ఇంకెవరో లోపల వున్నారు.

చిరునవ్వు నవ్వుకుంటూ కళ్ళు మూసుకొని విశ్రాంతి తీసుకోసాగాడు. ఒక్క నిముషం అంటే ఇరవై నిముషాలు అని అర్థం చెప్పి వచ్చాడు పాల్ చేతులు నలుపుకుంటూ.

"అంతా ఖరారై పోయింది..... నీ డబ్బును అతనికిచ్చే దాకా, నువ్వు శాంపిల్స్ చూపేదాకా నిన్ను కలవటం ఇష్టం లేదు మా ఏజెంటుకు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రికాషన్ తప్పని సరి" పెదిమలు తడుపుకున్నాడు పాల్. కూర్చోవటానికి మొఖమాటపడుతున్నాడు. తను చేతులు పెట్టే చోట షాడో బూట్లూ పెట్టి కూర్చున్నాడు.

"ఇంకో రెండు గంటల్లో నీ హోటల్ దగ్గిరికి ఒక టాక్సీ వస్తుంది. మూడుసార్లు హారన్ మోగిస్తుంది. మారు మాట్లాడకుండా అందులో కూర్చో. అది తీసుకుపోయిన చోటికి పో. మరి డబ్బు......" అడిగాడు నానుస్తూ.

"అబే! డబ్బును ఫికరెందుకు చేస్తావ్? వున్నదంతా బాంకులో దాచి తిరగుతున్నాననుకున్నావా? ఎంత కావాలి?"

"అబ్బే అదేం లేదు. వాళ్ళూ నీ డబ్బుని చూస్తే గాని శాంపిల్స్ చూపించరు. మొత్తమంతా వెంటతీసుకుపోవాలి. పది లక్షలు.... ఏమంటావ్ ?"

" ఓ. యస్. పాల్ భాయ్. పది లక్షలు తీసుకుపోతాను ఠీక్ హైనా?"

షాడో వెళ్ళిపోయే సమయానికి సీబర్డ్ అంతా ప్రశాంతంగా వుంది. గెలిచినవాళ్ళు చిరునవ్వుతో ఇళ్ళకు పోతున్నారు. డబ్బు పోగొట్టుకున్నవారు నిరాశతో క్వార్టర్ దగ్గిర బారులు తీరి నిలబడుతున్నారు.

"వెల్ లూసియానా? ఏమంటావ్?" అడిగాడు పాల్.

అతని ఎదురుగా ఇంతకు ముందు షాడో కూర్చున్న ఛైర్‌లో కూర్చుని వున్నది లూసియానా. స్వీట్‌గా మైల్డ్‌గా గదంతా వ్యాపిస్తున్నది ఆమె రాసుకున్న సెంటు.

"నేనెప్పుడూ చూడలేదతనిని. మనం ఎదురుచూస్తున్న మనిషి కాదతడు. ఎత్తూ లావు ఒకటే అయినా, స్వభావాల్లో చాలా తేడా వుంది. ప్రొఫెసర్ ఇంత గట్టిగా మాట్లాడలేదు." థాట్‌ఫుల్‌గా పెట్టింది పోజు.

"అతను ఏదైనా మారు వేషంలో వచ్చి వుంటాడు. దగ్గరగా చూస్తే గుర్తుపట్టగలను."

పాల్ కోపంతో మండిపోయాడు. ఏదో పెద్ద సహాయం చేస్తుందనుకున్నాడు లూసియానా. ఇలా మాట్లాడుతుందనుకోలేదు.

"నన్నేం చెయ్యమంటావ్? వచ్చిన వాళ్ళందర్నీ బట్టలు వూడతీసి ముఖాలు కడిగి చూడమంటావా? ఆ డెవిల్ గాడ్ని చూశావ్ కదా! కదిలితే కరిచేటట్లు వున్నాడు. అలాంటి వాళ్ళతో ఎలా?" నిస్సహాయంగా బుజాలు ఎగురవేశాడు పాల్.

"ప్రస్తుతం ఇక్కడ నేను చెయ్యగలిగిందేమీ లేదు. మద్రాసు వెళ్ళిపోతాను. ఆ డెవిల్ నిజంగానే డ్రగ్ కస్టమర్ అయితే... అతనికి ఫస్ట్ క్లాస్ హెరాయిన్ మాత్రం ఇవ్వవద్దు. అది మనకు చాలా అవసరం. "

"వ్వాట్..... డెవిల్‌ని మోసగించటమా? ఆ ఇనుప కడియాన్ని చూశావా? అది పెట్టి కొట్టాడంటే తల రెండు చెక్కలవుతుంది. వాడొక్కడే అనుకొంటున్నావ్ కాబోలు. అలాంటి వాళ్ళకి వారి గాంగులు ప్రత్యేకంగా వుంటాయి. మోసం చేసినట్లు గమనించాడో – సీబర్ట్‌ని పునాదులతో సహా లేచి మళ్ళ కట్టించేటట్లు కనిపిస్తున్నాడు " బెదిరిపోయాడు పాల్.

లూసియానా సమాధానం చెప్పలేదు. డెవిల్ తరహా ఆమెను కూడా కలవరపరిచింది.

"కమాన్ డాల్, మనమిప్పుడే అతనితో రాంగ్ పెట్టుకోవద్దు. వీలైతే అతన్ని మనలో కలుపుకుందాం" సజెస్ట్ చేశాడు.

వయ్యారంగా లేచి నిలబడింది లూసియానా. "అతనే నిన్ను తన గాంగ్‌లో కలుపుకుంటాడేమో జాగ్రత్త. ఆ నీలిమ మీద ఒక కన్ను వేసి వుంచు. వారిద్దరి సంబంధం నాకు నచ్చలేదు."

* * *

సో లూసియానా హైద్రాబాద్ వచ్చిందన్నమాట. తన కోసమా? తనని గుర్తుపట్టగలదా? పాత అంబాసిడర్‌లో కూర్చుని ఆలోచిస్తున్నాడు షాడో. గుర్తుపట్టటానికి అవకాశాలు తక్కువ. దగ్గరలో నుంచి చూస్తే గాని ముఖంలో పోలికలు తెలియవు. అదీగాక తన భాష, వేషం మారిపోయింది.

ఎదురుగా వున్న డాష్ బోర్డు తెరిచాడు అది నిజానికి డాష్ బోర్డు కాదు. హెల్ సెంటర్. ప్రత్యేకంగా తయారు చేయబడిన ఐరన్ సేఫ్. అందులో నుంచి నోట్ల కట్టలు తీసి బ్రీఫ్ కేసులో పెట్టుకున్నాడు. తన ఆయుధాలు కూడా సేఫ్‌లో పడేసి క్లోజ్ చేశాడు. కుడిచెయ్యి మోచేతి మీద వున్న సిఐడి ఎంబ్లమ్ నల్లజెండా తప్ప తను ఏజెంటనే గుర్తులన్నీ మాసిపోయాయి.

కారును హోటల్ గారేజీలో పార్కు చేసి రూములో వెయిట్ చెయ్యసాగాడు. ఆలోచనలు నీలిమ మీదికి మరులుతున్నాయి. కాని ఆమెను

గురించి ఆలోచించే వ్యవధి లేదు. ఇక్కడే డెవిల్ అన్నట్లు అటో ఇటో తేలిపోయే సమయ మాసన్నమయింది.

మద్రాసుకు ట్రంకు కాల్ చేసి, తన బాస్‌లతో మాట్లాడి కుర్చీలో చేరగిలపడ్డాడు పాల్. లూసియానా, అతన్ని గుర్తు పట్టినా, పట్టకపోయినా తనకు పోయేదేమీ లేదు. డెవిల్‌తో తన ప్లానుల్ని కొనసాగించటానికే నిశ్చయించుకున్నాడు. అవకాశం దొరికితే డెవిల్‌ని హతమార్చి డబ్బు చేజిక్కించుకోవాలి. లూసియానా అన్నట్లు నీలిమ మీద ఒక కన్ను వేసి వుంచాలి.

* * *

తెల్లవారు ఝామున నాలుగన్నర గంటలకు రెడ్ హిల్స్‌లో వున్న ఒక లోయలో షాడోని వదిలిపోయింది టాక్సీ. చీకటిలో వంటరిగా నిలబడ్డాడు షాడో. చేతులో వున్న బ్రీఫ్‌కేసు తప్ప మరేం ఆయుధాలు లేవు. తన ప్రాణప్రదమయిన డాగర్ కూడా లేకపోవటంతో, బట్టలు కొరుక్కున్నట్లు ఫీలౌతున్నాడు. తప్పదు. తన దగ్గిర ఆయుధాలుంటే వాళ్ళకి అనుమానం రావచ్చు. చేతికి వున్న ఇనుప కడియాన్ని సవరించుకున్నాడు. ఇక మిగిలిన ఆధారం అది ఒక్కటే. ఫైటింగ్ టెక్నిక్ డిపార్టుమెంటు నేర్పిన మెలకువలను మననం చేసుకోసాగాడు.

ఎత్తు ఎక్కటానికి లోడ్ గేర్ వేసిన శబ్దం విని అటు తిరిగాడు. బరువుగా భారంగా వచ్చింది ఒక పాత ఫోర్టు కారు. అతనికి పది అడుగుల దూరంలో ఆగింది. రివాల్వర్లు గురిపెట్టి అందులో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగారు. మారు మాట్లాడకుండా చేతులెత్తాడు షాడో.

జాగ్రత్తగా షాడో దుస్తులను పరిక్షించారిద్దరూ. ఒకడు రివాల్వర్‌ని షాడో వైపే గురిపెట్టి వుంచాడు. మరొకడి చెయ్యి ఇనుప కడియం మీద పడగానే తోక తొక్కిన తాచులా లేచాడు షాడో.

"అబే! నాయాళ్ళారా ఎందుకులే అని ఆలోచిస్తుంటే వేషాలేస్తున్నారే? నరికి పోగులు పెడ్తాను జాగ్రత్త."

ఖంగారుపడి వెనక్కి గెంతాడతను. రివాల్వర్ వూపుతూ రెండవ వాడు కూడా రెండడుగులు వెనక్కి వేశాడు.

"డబ్బు తెచ్చావా?"

"శాంపిల్స్ తెచ్చారా?"

"చెప్పిన విలువకు తేలేదు. అయినా తెచ్చిన డబ్బు ఇచ్చిపో. రేపు శాంపిల్స్ అందచేస్తాం."

" అబే! మజాక్ చేస్తున్నారా? నమిలి తినేస్తాను మీ ఇద్దర్నీ. శాంపిల్స్ లేందే డబ్బు ఇవ్వటం జరగదు బే."

"మర్యాదగా డబ్బు ఇచ్చి పో! లేకపోతే ప్రాణాలు దక్కవ్?" బెదిరించాడు ఒకడు.

అతని మాట పూర్తయ్యేలోపల షాడో బ్రీఫ్‌కేసు పిడుగులా అతని ముఖం మీద పడింది. దానితో పాటే జంప్ చేసి కుడి చేతితో రెండవ వాడి చెంప మీద కొట్టాడు. కడియం దెబ్బకు బుగ్గ గాటు పడి వేళ్ళాడసాగింది. లోపలిపళ్ళు వికృతంగా కనబడుతున్నాయి.

బ్రీఫ్‌కేసు దెబ్బకు తూలి రివాల్వర్ జార విడిచాడు మొదటి వ్యక్తి. కాలితో దాన్ని దూరంగా తన్నాడు షాడో. మోకాలితో అతని పొట్ట కింద పొడిచాడు. "అమ్మా" అంటూ కడుపు పుచ్చుకుని మోకాళ్ళ మీద కూలబడ్డాడు బాధతో. అతనిని లెక్క నుంచి తీసి రెండవ వ్యక్తి వైపు తిరిగి నిలబడ్డాడు.

"అబే బద్మాష్ మందు ఎక్కడరా?"

చేతులతో బుగ్గను నొక్కిపట్టుకొని ఏడుపు ముఖం పెట్టాడతను.

"చల్ బే! నేను మీలాగా చచ్చినా పీనుగల్ని దోచుకునే వాణ్ని కాదు. మాల్ ఇచ్చి పైకం తీసుకుపొండి."

బెదురుచూపులు చూస్తూ కారు వెనుక సీటులో నుంచి ఒక సూట్ కేస్ తీసుకువచ్చి ఇచ్చాడతను.

"విప్పి చూసుకో. చెప్పినదంతా అందులోనే వుంది."

"నాయాళ్ళలారా. నాకే టోపీ చేసి చూద్దామనుకున్నారా!" సూట్ కేస్ తెరిచి చూశాడు. నిండుగా పేర్చబడి వున్నాయి ఆపియమ్ డ్రగ్స్. ఒక చిన్న సిగరెట్ తీసుకొని వాసన చూశాడు. ఫరావా లేదు. ఇది మాత్రం ఫస్ట్ క్లాస్ సరుకే తెచ్చి ఇచ్చారు. సూట్ కేస్ మూసి వారి వైపు చూశాడు.

"ఇంకా నిలబడ్డారేమిటి బే? పొండి." అంటూ బుజం మీద వేసుకొని నడక ప్రారంభించాడు. తను హోటల్ కు చేరేసరికి ఎలా లేదన్నా పది దాటుతుంది. గోల్కొండ పోతే గాని టాక్సీలు దొరకవు. అక్కడిదాకా కాలినడక తప్పదు. పాల్ గాడు హెరాయిన్ స్మగుల్ చేస్తున్నట్లు తెలిసిపోయింది.

ఆధారాలున్నాయి. ఇక వాడితో చేతిని కలిపి అసలు తలలను పట్టుకోవాలి. ఈ లోపల నీలిమను కలుసుకొని మాట్లాడాలి.

బర్రుమంటూ వస్తున్న జీపును చూసి ఆగాడు. "థాంక్ గాడ్. లిఫ్ట దొరికింది." దగ్గిరకు వచ్చి సడన్ బ్రేకుతో ఆగింది జీపు. ఇద్దరు కానిస్టేబుల్స్, ఒక సబ్ ఇనస్పెక్టరు దిగి షాడోను చుట్టుముట్టారు.

"మిస్టర్ నిన్ను అరస్టు చేస్తున్నాం."

"అరస్టా? ఎందుకు బే?"

షాడో చేతులో నుంచి సూట్ కేస్ లాక్కున్నాడు ఒక కానిస్టేబుల్. మిగిలిన ఇద్దరూ పిస్టల్స్ పట్టుకుని వున్నారు. తను డ్రగ్స్ కొంటునట్లు వారికెలా తెల్సిందో, మొదట అర్థం కాలేదు షాడోకు. న్యాయం ప్రకారం ఆ వస్తువులు ఎవరిదగ్గరున్నా అరెస్టు చేయటానికి పూర్తి అధికారులున్నాయి పోలీసులకు. కాని తన దగ్గర వున్నట్లు వీరికెలా తెలుసు?

పాల్ వేసిన ప్లాను షాడో మెదడులో గిరగిరా తిరిగింది.

"అమ్మ నాయాలు దెబ్బకొట్టాడు గదా!" అనుకున్నాడు. డెవిల్ లాగా తన ఐడెంటిటీని చూపించినా, హెల్ సెంటర్‌కు కబురు పంపినా నిముషాల మీద విడుదల కావచ్చు. కాని ఆ ఇనస్పెక్టరు మీద అనుమానం కలిగింది షాడోకు. ఇలా ఎంత మంది ఈ ముఠాలకు సహాయం చేస్తున్నారో.

"వారంటేదిబే! నన్నరస్టు చేయటానికి?" అడిగాడు కోపంగా.

"నిన్నరస్టు చేయటానికి వారంటు అవసరం లేదు. పద" అంటూ పట్టుకొని జీపులో తోశాడు ఇనస్పెక్టర్. బర్ర్ మంటూ జీపు బయలు దేరింది.

ప్రభాత సమయంలో అందాలు సంతరించుకుంటున్న ప్రకృతిని చూస్తూ కూర్చున్నాడు షాడో.

తనకూ పాల్‌కూ, డ్రగ్ రాకెట్టుకూ మధ్య వచ్చిన కొత్త లింకు ఇనస్పెక్టరు, వీడిని కదిలించి చూద్దామనుకున్నాడు.

మెహదీపట్టణంలో ఒక ఇంటి ముందు ఆగింది. "సార్. దిగి సాయం పట్టనా?" అడిగాడు కానిస్టేబుల్.

"ఎందుకు? ఈ వెధవను నేను కంట్రోలు చెయ్యలేనా? " గర్వంగా అని షాడో జెర్కిన్ పుచ్చుకొని లోపలకు లాక్కుపోయాడు.

"అబే! సంకెళ్ళు వూడదీసి లాగరా! చూపిస్తాను" వెక్కిరించాడు షాడో. లోపల ఇంకొక సార్జెంటు కూర్చుని వున్నాడు. గ్రహించాడు షాడో. లేకపోతే ఇలా సివిల్ బిల్డింగ్స్‌లో కాపరాలు పెట్టరు.

అరడుగుల పొడుగు నాలుగడుగుల వెడల్పు వుంది షాడోను బంధించిన గది. ఒక బల్ల, ఒక విరిగిపోయిన కుర్చీ తప్ప మరేం లేదందులో. ఛైరు మీద కాలు పెట్టి షాడో వంక చూశాడు ఇనస్పెక్టరు.

"చాలా కాస్టిలీ డ్రగ్స్ పట్టుకు తిరుగుతున్నావే? ఇంకా డబ్బేమయినా మిగిలి వుందా?" లేదని తలవూపాడు షాడో. లేదా అని కోపంతో కుర్చీని పక్కకు తన్ని షాడో మీదికి ఎత్తాడు కాలును.

తల వంచి ఆ దెబ్బను తప్పించుకున్నాడు కాని ఎడమ తొడకు తగిలి కాలు చచ్చుబడిపోయినంత బాద కలిగింది. లేచి సరిగా కూర్చున్నాడు. పళ్ళు బిగపట్టి

ఇనస్పెక్టరు వంక చూశాడు గాని, నోటి వెంట ఒక చిన్న శబ్దం కూడా రానీయలేదు.

"చెప్పు ఎంత వుంది నీ దగ్గిర. నిన్ను వదిలి పెట్టటానికి ఎంత ఇస్తావ్!"

"అబే! నువ్వు వదిలేదేందిరా? ఇంకొంచెం సేపటిలో మీ నాయనమ్మ వచ్చి విడిపిస్తుంది చూడరా!"

విరిగిపడిన కుర్చీకోడు తీసుకొని షాడో నెత్తిమీద కొట్టాడు. లెక్కప్రకారం ఆ దెబ్బతో బోడిగుండు చిల్లుపడాలి. కాని మాస్క్ కింద వున్న జుట్టు ఆ దెబ్బను కుషన్ చేసి ఆపింది.

"ఎవరు నువ్వు? ఎక్కడి నుంచి వచ్చావ్?" గర్జించాడు ఇనస్పెక్టరు.

"నువ్వు వచ్చిన చోటునుంచే బే!" మళ్ళీ ఆ కోడుతో షాడో బుజం మీద కొట్టాడు.

"నువ్వు ఇలా మాట్లాడతావా? నీ చేత మాట్లాడించటం నా స్నేహితులకు బాగా తెలుసు. ఒక వేళ నీ నోరు పని చేయకపోయినా ఆ పిల్ల పని చేస్తుంది."

"ఎవరా పిల్ల?" అడిగాడు షాడో. కొంపదీసి నీలిమ ఏమైనా చెయ్యలేదు కదా.

"ఎవరో తెలియదా? తెలుస్తుంది మిస్టర్. నా కోపం చల్లారే లోపల అన్నీ తెలుస్తాయి." టపటపా తల మీద కొట్టాడు కుర్చీకోడుతో.

* * *

కిటికీలో నుంచి వుదయిస్తున్న సూర్యుణ్ని చూసింది నీలిమ. ఎన్ని రోజులయిందో అంత పెందలాడే లేచి. బద్దకంగా వళ్ళు విరుచుకుంటూ ప్లాస్కులో పనిమనిషి పెట్టిపోయిన కాఫీ కప్పులో వంచుకుని సిప్ చెయ్యసాగింది.

ఫోను చెయ్యటానికి పోయిన పాల్ ఇంకా రాలేదు. ఇది రెండవ సారి అతను అలా పరుగెత్తుకుపోవటం. ఫోర్డుకారు వచ్చినప్పుడు ఒకసారి లేచి వెళ్ళాడు. అందులో నుంచి ఒక మనిషి దిగి చేతికేదో ఇచ్చాడు. సంతోషంతో దాన్నందుకొని ఐరన్ సేఫ్‌లో దాచుకున్నాడు. ఇప్పుడు ఏదో ఫోన్ కాల్.

రాత్రి ఆఖరిడాన్సు పూర్తయ్యే సరికి నాలుగు దాటింది. తెల్లవారిన తరువాత పోవచ్చునని పాల్ ఆమెను తన ఎపార్టుమెంటుకు తీసుకువచ్చాడు. వచ్చిన దగ్గరనుంచీ ఆమెను అనుభవించాలని ఆత్రత పడసాగాడు. కాని ఆమె బాగ్‌లో వున్న చిన్నఫిస్టలు అతన్ని లేనిపోని చనువు తీసుకోవద్దని హెచ్చరిస్తోంది.

ఈ గొడవంతా రాజును గురించి కాదుకదా! అలా అయితే పాల్ గాణ్ని అక్కడే చంపి సేఫ్‌లో దాచటానికి తయారయింది నీలిమ. ఫోర్డులో వచ్చిన వారి ఆకారాలు – వారి వాలకం ఆమెను అనుమానం కలిగించాయి.

సంతోషంతో చేతులు నలుపుకుంటూ వచ్చాడు పాల్. అతనికి అదృష్టం కలిసివచ్చింది. పది లక్షలు రూపాయల బిజినెస్ చేశాడు. దాని మీద పెద్ద కమీషన్ వచ్చింది. మద్రాసు బాసులు మెచ్చుకున్నారు. డెవిల్ గాడి పీడ వదిలింది. తిరిగి తన హెరాయిన్ తనకు చేరబోతున్నది.

నీలిమ పక్కన కూర్చుని తను కూడా ప్లాస్కులో మంచి కాఫీ వంచుకున్నాడు.

"డియర్ కబుర్లేమయినా చెప్పు వింటాను." నవ్వుతూ అన్నాడు.

"ఏమున్నాయి, ఏమన్నా వుంటే నువ్వు చెప్పు వింటూ కాస్సేపు కునుకు తీస్తాను." ఆవలిస్తూ అన్నది నీలిమ. అదో దాచుకొని మాట్లాడుతున్నాడని గ్రహించింది.

"నీ స్నేహితుడు డెవిల్‌ని గురించి మాట్లాడుదామా? అతనేదో వింత మనిషిలాగా వున్నాడు కదూ!"

నీలిమ హృదయం వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది.

"వింత ఏమున్నది? అతని తీరే అంత."

"అదే. అదే పూర్తిగా చెప్పు డార్లింగ్." చెయ్యి పట్టుకొని మంచం మీది నుంచి లాగాడు.

"డెవిల్ ఎవరు? నీకూ అతనికి ఎలా పరిచయమయింది? చెప్తావా చెప్పవా ?" చెయ్యి మెలిపెట్టి కర్కశంగా అడిగాడు.

* * *

సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంకా నవ్వుతూనే నిలబడ్డాడు. కుర్చీ కోడు ఎత్తి పట్టుకున్నాడు.

"చెప్తావా? లేదా" గద్దించి అడుగుతున్నాడు.

హేండ్ కప్స్ వున్న చేతుల్ని దెబ్బల కడ్డం పెట్టుకుంటున్నాడు షాడో. అలా రెండుసార్లు చేతులెత్తాడు. మూడవసారి ఎత్తి దించే సమయంలో కాలర్ కింద వున్న సూదిలాంటి సన్నటి సాధనం చేతిలోకి వెళ్ళింది. కుర్చీ కోడును ఎత్తి బుజం మీద కొట్టి వెనుకడుగు వేశాడు ఇనస్పెక్టరు.

చురుకుగా సూదిని సంకెళ్ళకున్న లాక్ లోనికి పోనిచ్చాడు షాడో. చూపులు ఇనస్పెక్టరు మీదే వున్నాయి. అతని ముఖంలోకి చూస్తూ పని చేశాడు. క్షణంలో వూడి కిందపడిపోయాయి హేండ్ కప్స్.

కూర్చున్నవాడు కాస్తా ముందుకు దూకి అతని కాళ్ళు పుచ్చుకొని లాగాడు. ఎదురుచూడని ఈ పరిణామానికి నిశ్చేష్టుడై నిలబడిపోయాడతను. ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపలే జారికిందపడ్డాడు. అతని చేతిలో నుంచి కర్ర ముక్కను లాగాడు షాడో. దానితోనే సూటిగా బుజం మీద కొట్టాడు. బుజం విరిగినట్లయింది. బాధతో మెలికలు తిరిగాడు ఇనస్పెక్టరు.

"అబే! బాకీ చెల్లేసుకో ఒకటి."

"అమ్మా." అంటూ చేతులు నెత్తిమీద పెట్టుకున్నాడు. తల పగిలి నెత్తురు కారసాగింది.

"ఇది రుచి చూడు బే! పసందుగా వుంటుంది రెండు."

" అబ్బా" అంటూ మణికట్టును ఎడమ చేతితో నొక్కిపట్టుకున్నాడు.

మూడు.... నాలుగు..... ఐదు...... ఆరు.....

తను తిన్న దెబ్బలన్నీ తిరిగి వరసగా తినిపించాడు షాడో.

"ఇప్పుడు మాట్లాడరా. నీ వంతు వచ్చింది." గుండెల మీద కూర్చుని అడిగాడు.

"నువ్వు చెప్పిన పిల్ల ఎవరు? పాల్ తన హెరాయిన్ స్టాకు ఎక్కడ దాస్తాడు? ఝూట్ మత్ బోల్‌నా! చెప్పకపోతే నాలిక కత్తిరేంచేస్తాను."

అప్పటి ఫోజు నిజంగానే ఆ పని చేసేలా వుంది. వణికిపోయాడు ఇనస్పెక్టరు. కుర్చీ కోడు దెబ్బలు ఇంత బలంగా తగులుతాయని వూహించలేదతను.

"అయితే నువ్వు ఏజెంటువన్నమాట. ముందే ఎందుకు చెప్పలేదు? ఇద్దరం కలిసి......." ఫట్ మంటూ పెదవులను చీల్చింది ఇనుప కడియం.

"ఇద్దరం కలిసే పనిచేస్తున్నాం గద బే.... చెప్పరా! నేనడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు."

పెద్ద తెలుసుకోవాల్సిన విషయాలేం లేవు. పాల్ అడ్రసు అతని దగ్గిర వున్న నీలిమ సంగతీ. అంతే.

మరొక్కసారి ఇనుపకడియంతో ముఖం మీద గుద్దిలేచాడు షాడో. ఇనస్పెక్టరు తలకింద పెద్ద రక్తమడుగు పేరుకుంది. చాపలేసుకొని, అందుకు దగ్గరలో వున్నాడు. పక్కనే వున్న రూంలో ఒక కుండలో నీళ్ళు వున్నాయి. వాటితో వంటిని తుడుచుకొని నలిగిన బట్టలు సరిచేసుకున్నాడు. ఆ ఇనస్పెక్టరు ఇంకా కొంత కాలం ఎక్కడికి పారిపోలేదు. కాబట్టి అతని విషయం తరువాత చూసుకోవచ్చు. ఈ విషయంలో బయట వున్న సార్జెంటుకు వాటా వున్నదో లేదో తెలియదు! అయినా అది తన జూనియర్లు తెలుసుకోవలసిన విషయం.

కామ్‌గా వెనుక తలుపులు తెరుచుకొని నిర్భయంగా బయటికి పోయాడు. రెండు సందులు దాటేదాకా అలాగే తాఫీగా నడిచి, ఆ ఇల్లు కనుమరుగు కాగానే పరుగు లంకించుకున్నాడు. ఎదురుపడిన టాక్సీని ఆపి తన హోటల్ అడ్రసు చెప్పాడు.

తన కారు ఇంకా గారేజీలోనే వుంది.

"హల్లో సాబ్!" సెల్యూట్ చేశాడు నైట్ వాచ్ మెన్.

"రాత్రి మీరు పోయిన తరువాత ఇద్దరు మనుషులు వచ్చి. మీ కారునూ, మీ రూంనూ చెక్ చేస్తామన్నారు. వీలు కాదు పొమ్మంటే లంచం ఇవ్వటానికి ప్రయత్నించారు. నా లాటీతో రెండు పుచ్చుకున్నారు. "

కారు బయటికి లాగి చేతికి వచ్చిన పది రూపాయల కట్టను అతని మీదికి విసిరి దూసుకుపోయాడు షాడో. ఒక్కసారి వర్షం కురిసినట్లు ఐదువందల రూపాయలు తన మీద పడేసరికి నోరు తెరిచాడు వాచ్‌మెన్.

సీతాఫలమండీ దాటి యూనివర్శిటీ ఏరియాలో రెండు నిముషాలు ఆగి డెవిల్ మేకప్‌ను తీసిపారేశాడు. ఆ ఆరుపులు పెడబొబ్బలు తలకాయ నొప్పెత్తించాయి. తన కారును ఎవరూ ముట్టుకోలేదు. తన ఆయుధాలన్నీ అలాగే వున్నాయి. చకచకా డ్రస్సు మార్చుకొని నీట్ గా తయారైనాడు.

దగ్గిరలో వున్న పెట్రోలు బంకులో పెట్రోలు పోయించుకున్నాడు. అక్కడి నుంచే సీబర్ట్ కొక కాల్ చేశాడు. పాల్ ఆఫీసులో లేడు. నీలిమ కూడా అతనితో పాటు వెళ్ళిపోయిందట. ఎక్కడికి పోయారో తెలియదు.

అంబాసిడర్‌ని స్టార్ట్ చేశాడు. అది మాక్సిమమ్ స్పీడు పికప్ చేసేలోపల రేడియో మెస్సేజి ఒకటి పంపించాడు.

"వెంటనే మొహదీ పట్టణంలో 92/44 ఇంటిని ఆక్రమించండి. అందులో సబ్‌ఇనస్పెక్టరు డ్రగ్ స్మగ్లర్. ఈ విషయం బైటికి పొక్క కూడదనుకుంటే, డెవిల్ అనే వాడికి అతనికి పోట్లాట జరిగిందనీ, డెవిల్ పారిపోయాడని చెప్పండి. పోలీసు

డిపార్టుమెంటు పరువు కాపాడటానికి మనం అంతకన్నా చెయ్యగలిగిందేమీ లేదు."

వేగంగా లాలాపేట వైపు దూసుకుపోయింది ఓల్డు అంబాసిడర్.

* * *

కోపంతో గుండెలు ఎగసిపడుతుండగా ఎడమ చేతితో లాగి పాల్ చెంప మీద కొట్టింది నీలిమ. చెంప అదిరిపోయింది. కింది పెదవి తెగి రక్తం పెదవులసందు నుంచి గడ్డం మీదికి జారింది.

"ఇంకోసారి ఆ పని చేశావంటే నేనే నీ రక్తం కళ్ళ చూస్తాను." పళ్ళు కొరికాడు పాల్.

"వదులు, నన్ను వదిలిపెట్టు" పెనగులాడింది నీలిమ. తన హేండ్ బేగ్ టీపాయ్ మీద వుంది. దాన్ని అందుకో గలిగితే ఈ రాక్షసుడి అంతు చూడవచ్చు. ఈ సారి పాల్ ఆమె చెంప పగులగొట్టాడు. నీలిమ తల పక్కకు విరుచుకుంది.

బెడ్ రూం డోర్ తెరిచి ఒక మనిషి లోపలికి వచ్చాడు. "సారీ బాస్. రేడియోలో ఒక వార్త వచ్చింది. మీరు వింటే బాగుంటుందని వచ్చాను."

"యా! ఏమిటది?" సీరియస్‌గా అన్నాడు పాల్.

"మన సబ్ ఇనస్పెక్టరు మెహదీ పట్టణంలో ఒక ఇంట్లో దెబ్బలు తిని పడివున్నాట్ట. డెవిల్ అనే రౌడీ అతన్ని చితకకొట్టి పారిపోయాట్ట. పోలీసులు అతనికోసం గాలిస్తున్నారు."

నీలిమ ఆ వార్తవిని తన ఆందోళనను దాచుకోలేక పోయింది. అప్రయత్నంగా ఆమె నోటిలో నుంచి "నో. మైగాడ్." అనే మాటలు వెలుపలకి దొర్లిపోయాయి.

"వెల్ నీలిమా నీ స్నేహితుడు చాలా తెలివైనవాడిలా వున్నాడే?"

"ఆల్‌రైట్ సాంబూ. మన సామాన్లన్నీ సర్దేయ్యండి. వాటిని ఇక్కడ నుంచి మార్చేయాలి." ఆర్డర్లిచ్చాడు.

తలుపు మూసుకోగానే నీలిమ వైపు తిరిగాడు.

"యా డార్లింగ్, మీరిద్దరూ కలిసి నాటకమాడి నన్నుముంచాలని చూశారు కదూ?" ఆ చెంపా ఈ చెంపా వాయించాడు కసితో. తూలి వెనక్కు మంచం మీద పడింది.

"బాస్టర్డ్ యూ మిసరబుల్, అగ్లీ, వయలెంట్, నాస్టీ ఓల్డ్ బగ్ " తెలుగులో తిడితే అంత పవర్‌ఫుల్‌గా వుండదని తనకు వచ్చిన ఇంగ్లీషు మాటలన్నీ వుపయోగించింది. ఆమె చెవులకవి దారుణమైన తిట్టలాగా వినిపించాయి.

పాపం పాల్ గూడా అలాగే అనుకున్నాడు. వళ్ళు తెలియని కోపంతో జుట్టుపట్టుకొని లేపి మంచంకోటికి వేసి కొట్టాడు.

"క్లమ్సీ పిగ్"

కయ్ మని అరిచాడు. ఎన్ని దెబ్బలు తిన్నా ఇంగ్లీషు తిట్లు మానదేం? పిడికిలి బిగించి గడ్డం కింద గుద్దాడు. ఆ దెబ్బ రావటం చూసి కూడా నిస్సహాయంగా వూరుకుంది నీలిమ. మెదడు గిరగిరా సుడిగుండంలా తిరిగింది. రెండు క్షణాలలో తెలివి తప్పిపోయింది. అప్పుడు కూడా హాయిగా నిట్టూర్చింది

నీలిమ. తను మాట్లాడే అవకాశం లేదు. మాట్లాడనంత వరకూ రాజును గురించి అతనికి చెప్పను కదా!

మళ్ళీ సాంబు తలుపు తోసుకొని వచ్చాడు. "మళ్ళీ ఇంకో న్యూసు బులెటన్ సార్. పోలీసులు డెవిల్‌ను పట్టుకున్నారు. ఎదురుతిరిగితే కాల్చి చంపేశారు. "

పాల్ అదిరిపోయ్యాడు. డెవిల్ మామూలు తమలాంటి స్మగ్లరేనా? పోలీసుల మనిషి కాదా? తను తొందరపడి ఎటువంటి ఛాన్సును పోగొట్టుకున్నాడు డెవిల్ తన చేతికిందుంటే ఎంత వుపయోగపడేవాడు?

* * *

అన్ని ఇళ్ళకూ దూరంగా వున్న ఒక పురాతన బంగళాను సమీపించాడు షాడో. ఎప్పుడో గోల్కొండ నవాబుల కాలంలో కట్టిన ఇల్లది. ఫ్రంటు డోర్ వద్ద నిలబడిన వ్యక్తి షాడోను చూసి సందేహించాడు – కాల్చటానికి. చేతిలో ఒక మెషిన్ గన్ వుంది. ఎత్తి సిద్ధంగా పట్టుకున్నాడు.

షాడో వెనుకా ముందూ చూడలేదు. నీలిమను మనసు నుంచి తుడిచి వేశాడు. ఆమె కంటే ముఖ్యం ఈ చీడపరుగులు చావడం. పిన్ లాగి, తన అంబాసిడర్ ఆగే లోపునే గ్రైనేడ్ అతని మీదికి విసిరాడు. పెద్ద మోతతో పేలిందది. మెషిన్ గన్ వ్యక్తి ముక్కలు ముక్కలై గోడలకున్న ఇటుకలతో పాటు గాలిలోకి లేచిపోయాడు. పోర్టికో కూలిపోయింది. ఎక్కడి నుంచో అరుపులు వినబడుతున్నాయి. అంబాసిడర్ వెనకాల నుంచి నల్లటి దట్టమైన పొగలు వస్తున్నాయి. వాటి ముందు వేగంగా బంగ్లా చుట్టూ ఎగుడు దిగుళ్ళను లెక్క

చెయ్యకుండా తిప్పాడు కారును. రౌండు పూర్తయ్యేసరికి ఇంటి చుట్టూ నల్లటి తెర దించినట్లు పొగలు కమ్ముకున్నాయి.

ఒకచోట పార్క్ చేసి వుంచిన పోర్టు దగ్గిర కారు ఆపి, కిందికి దిగాడు. నేల మీద పడుకొని, పాకుకుంటూ బిల్డింగును సమీపించసాగాడు. ఇంటిలో అంతా నిశ్శబ్దంగా వుంది. రివాల్వరు రెడీగా పట్టుకొని, అతి కష్టం మీద ముందుకు జరుగుతున్నాడు.

ఇద్దరు వ్యక్తులు బయటికి వచ్చి షాడో వస్తున్న దిశకు నడవనారంభించారు. వారిని గమనించి ఆగాడు షాడో. తనలాగే శబ్దం చెయ్యకుండా కాషస్‌గా వస్తున్నారు. రివాల్వర్ రెండుసార్లు గర్జించింది. ఒక అరుపు, మనిషి కింద పడిన చప్పుడు వినవచ్చింది. రెండవ వ్యక్తి ఒక రాతి పక్కకు దూరాడు.

రెండు గ్రైనేడ్లు తీశాడు షాడో. ఒకటి బండమీద విసిరాడు. రెండోది మళ్ళీ ఫ్రంటుడోరు దగ్గిర పడేటట్లు వదిలాడు. వెంటనే లేచి బిల్డింగు పక్కకు పరుగెత్తాడు. కేకలు షూటింగ్‌లు వినవచ్చాయి.

ఎదురుగా విండో ఒకటి అతన్ని పిలిచేసరికి పిల్లిలా ఎగిరి విండోలోకి చేరాడు.

గదిలో కూడా పొగ కమ్ముకుంటోంది. మండుతున్న కళ్ళను తుడుచుకుంటూ రూములో కలియచూశాడు. బెడ్ మీద పడుకొని వుందొక స్త్రీ. ఇంత ప్రళయం సంభవిస్తున్నా అంత హాయిగా నిద్రపోతున్న ఈ కుంభకర్ణుని చెల్లెలెవరా అనుకుంటూ చూశాడు.

బెడ్ దగ్గిరకు రెండడుగులు వేసేరికి, అన్ని మోతలనూ మించి పాల్ అరుపులు విన్పించాయి. వెంటనే ఒక్క గంతులో గది తలుపు తోసుకొని పాసేజీలోకి వచ్చాడు షాడో.

బయట నిలబడి గన్ వూపుతూ ఆర్డర్లిస్తున్నాడు పాల్. జేబులో వున్న ఆఖరి గ్రైనేడ్ విసిరాడు షాడో. గురి మార్చకుండా పాల్ కూ అతని అనుచరులకూ మధ్యన ఏదో వుంది. ఇక తను పాల్‌ని ప్రశ్నించి తెలుసుకోతగ్గది ఏమీ లేదు. తెలుసుకోలేదు కూడా.

ఆ పేలుడుతో, అంతవరకూ వుండనా, వుండనా అని మథనపడుతున్న బిల్డింగు కూలిపోయింది. పెద్ద చప్పుడుతో గోడలు విరిగిపడసాగాయి. ఐదు నిముషాల పాటు అంతా గందరగోళమయిపోయింది. అరుపులు, ఏడుపులూ, పొగలాగా లేస్తున్న దుమ్ము, ఎగురుతున్న ఇటుకలు, భూకంపం వచ్చినట్లు అదిరిపోయింది ఆ ప్రాంతమంతా.

అందరూ మరణించారు. మరణించనివారు పారిపోయారు. పారిపోలేనివాళ్ళు గోడల కింద పడి నలిగిపోయివారు. అంత ప్రమాదంలోనూ పాల్ ఐరన్ సేఫ్ మాత్రం చెక్కు చెదరకుండా నిలబడి వుంది.

గది లోపల నీలిమ గట్టిగా మూలుగుతూ తల పట్టుకొని లేచి కూర్చుంది. తామున్న గది కూలిపోయేలోపలే ఆమెను ఎత్తుకొని బయటకు గెంతాడు షాడో.

* * *

సన్నగా సిల్కు సూటులో వున్న మనిషి వారివంక విషాదంగా చూశాడు.

"ఐయామ్ సారీ ఫ్రండ్స్. డెవిల్ మీద అనుమానంతో మనం విసిరిన వల గురితప్పింది. అతను బతికివుంటే మనకెంతో వుపయోగించేవాడు. అయినా జరిగినదాన్ని గురించి విచారించి ప్రయోజనం లేదు. పాల్ దగ్గిర నుంచి సమాధానమేమీ రాలేదు. ఏమయినా గొడవ జరిగివుంటే మనవాళ్ళు అక్కడికి పోవటం ప్రమాదం. అందువల్ల అతని దగ్గిర నుంచి సమాధానం వచ్చేదాకా వెయిట్ చెయ్యటం తప్ప చెయ్యగల్గిందేమీ లేదు."

పాత అంబాసిడర్ హోటలుముందు ఆగేసరికి చీకటి పడింది. స్టీరింగ్ ముందు నుంచి దిగి నీలిమకు చెయ్యి అందించాడు షాడో. తగలపడిన లాలాపేట భవనం గురించి పోలీసులు రేడియో న్యూసు బుల్లెటన్లు యివ్వలేదు. మంటలు కమ్ముకునేలోపల ఆ ప్రదేశాన్నంతా గాలించాడు షాడో. ఐరన్ సేఫ్ ని పగలగొట్టి అందులో వస్తువులను స్వాధీన పరుచుకున్నాడు. రాష్ట్రంలో వున్న ఇల్లీగల్ డ్రగ్ సెంటరూ, వాటి ఏజెంట్లూ, వివరాలు వున్న ఫైలు దొరికింది. తను ఇచ్చిన పది లక్షల రూపాయలు బ్రీఫ్ కేసు అల్లాగే వుంది. అది కాక ఇంకా ఐదు లక్షలు వున్నాయి ఆ సేఫ్‌లో. వాటిని కూడా బ్రీఫ్ కేస్ లోకి ఎక్కించాడు.

బిల్డింగ్ కున్న అండర్ గ్రౌండ్‌లో హెరాయిన్ స్టాకు విపరీతంగా వుంది. మండుతున్న కట్టెనొకదాన్ని అందులో విసిరి నీలిమతో బయటికి వచ్చాడు. అప్పటికే జనం బిల్డింగ్ చుట్టూ పొగయ్యారు. వారిని పట్టించుకోకుండా అంబాసిడర్‌ని స్టార్టు చేసి హోటల్‌కు బయలు దేరాడు.

తన అనుమానాల చైను పూర్తయింది. ఇక వాటిని పట్టుకొని బయలు దేరటమే మిగిలివుంది.

నీలిమ ఆవులించింది గట్టిగా. "రాజూ విశ్రాంతి తీసుకుందాం."

"నువ్వు పడుకో బేబీ! నాకు అర్జెంటు పనులున్నాయి" బ్రీఫ్ కేసులో నుంచి చేతికి వచ్చిన కట్టలు తీసి నీలిమ వళ్ళో పోశాడు. పాల్ మనీ అది. తను సిఐబికి ఎకౌంటు చెప్పనవసరం లేదు.

"నీలిమా, ఇకనైనా ఈ పాడు వుద్యోగాలు మాని కాలు మీద కాలు వేసుకొని హాయిగా జీవించు వస్తాను. మరెప్పుడైనా కలుస్తాను."

నీలిమ ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే మాయమయ్యాడు. అలా ఆ దిశకే చూస్తూ నిలబడిపోయింది. ఆమె అంతరంగంలో నిర్వచించలేని భావాలు సుళ్ళు తిరుగుతున్నాయి. రాజెప్పుడూ ఇంతే. పెద్ద మిస్టరీ మాన్.

* * *

లూసియానా ఇల్లు ఆ రాత్రి ఎంతో నిశ్శబ్దంగా వుంది. నల్లటి పాంటు, నలుపు రంగు జర్కిన్ వేసుకొని, ఆ చీకటిలో ఇంటిని సమీపించాడు షాడో.

ఇంటి ముందు ఒకే వ్యక్తి కాపలా తిరుగుతున్నాడు. చీకట్లలో నిలబడి కాపలా వున్నది అతనొక్కడే అని నిశ్చయపరుచుకున్నాడు షాడో. పది అడుగులు వేసి వెనక్కు తిరుగుతున్నాడు తిరిగి పది అడుగులు వేసి.

ఆ పాట్రన్ అర్థంకాగానే తను గూడా అతనితో చేరి వెనుక వైపు నుంచి సమీపించాడు. ఏడు, ఎనిమిది, తొమ్మిది.

డాగర్ నిశ్శబ్దంగా పైకి వచ్చింది. తొమ్మిదో అడుగులో అతని మీద పడి ఎడమ చేతితో నోరు మూసి, కుడిచేతితో డాగర్ నుపయోగించాడు. వెచ్చటి నెత్తురు స్ప్రేయర్‌లా ముందుకు చిమ్మింది. గుటకలు వేస్తూ కిందికి పడ్డాడు సెంట్రీ.

అతన్ని గోడపక్కకు లాగి, డోర్‌ని సమీపించాడతను. తను కిందటి సారి వచ్చినప్పుడున్న తాళాలు కావని, మార్చి కొత్తవి వేయించారు. అయినా బాంకు వాల్టులు పగలగొట్టగలిగిన చేతికి అవి ఒక లెక్కా ?

రెండు నిముషాలలో మేడమెట్లు ఎక్కుతున్నాడు. రూంలో ప్రశాంతంగా నిద్రపోతున్నది లూసియానా. వీధిలో నుండి స్ట్రీట్ లైటు కాంతి సన్నగా బెడ్ మీద పడుతున్నది. అర్ధనగ్నంగా, అమరకాంతలా వుంది. ఆమె అందాలు పరిశీలించే మూడ్‌లో లేదు. ఆమె దగ్గిర నిలబడి ఆమె ముఖంలోకి చూశాడు. ఆపియమ్ వాసన గుప్పుమంటూ వచ్చింది. ఆమె నిద్ర నటించటం లేదు. గాఢనిద్రలో వుంది నిజంగా.

జేబులో నుంచి టేప్ తీసి ఆమె కాళ్ళనూ, చేతులనూ కట్టడానికి బంధించాడు. ఇంకా లేవలేదామె. అయినా నిద్రలో మార్పు వచ్చింది. ఇక లేస్తుంది. అలమారా వున్న తెరను తొలగించాడు. తను లోగడ చూసిన రహస్య తలుపును తెరిచి గదిలోకి ప్రవేశించాడు. ఆమెను దించటానికి తలుపు తెరిచే వుంచాడు. తన మొదట ప్రయత్నానికి తెరుచుకోని స్టీలు అలమైరాను తెరిచి దాని లోపలను వెతికాడు. ఒక అరలో కెమేరా, కొన్ని నెగటివ్‌లు వున్నాయి. స్త్రీ పురుషులు నగ్నంగా వున్న చిత్రాలవి. కంపల్సరీగా లూసియానా. ఒక ఫోటోలో ప్రొఫెసర్ రమేశ్‌ని చూసి ఆశ్చర్యపోయాడు షాడో. మిగిలిన ఆరలును వెతికాడు. కొన్ని డ్రగ్ శాంపిల్స్ ఒక టేప్ రికార్డరు వున్నాయి. ఒక పాకెట్టులో రెండు టేప్ రీల్సు న్నాయి.

గదిలో లూసియానా ప్రశాంతంగా నిద్రపోతూనే వున్నది.

చకచకా ఒక టేప్ సెట్ చేసి రికార్డరు ఆన్ చేశాడు. తను ఎక్కడో విన్న కంఠం మెత్తగా మృదువుగా మాట్లాడటం ప్రారంభించింది.

"యూసీ ప్రొఫెసర్ రమేష్ మీరు మా చేతుల్లోంచి తప్పుకోలేరు. మీరు నిద్రపోతుండగా మీ పక్కన పడుకొని లూసియానా తీయించుకున్న ఫోటోలు మా దగ్గిర వున్నాయి. మేము చెప్పినట్లు నడుచుకోకపోతే అది బయట పెట్టాల్సివస్తుంది. అన్నీ మరిచిపోయి మాతో సహకరించండి. భయం అనేమాట మర్చిపొండి. మీకేమీ ప్రమాదం లేదు. నిద్రపొండి. నిద్రపొండి.... నిద్ర..... నిద్ర......."

లూసియానా లేచి నవ్వింది. టేప్ రికార్డరు ఆఫ్ చేశాడు షాడో.

"ప్రొఫెసరు రమేశ్‌ని ఇలా దెబ్బతీయాలని ప్రయత్నించారన్నమాట" అడిగాడు.

అలాగే పడుకొని నవ్వింది లూసియానా. "అవును. కాని ఆయనను వుపయోగించుకోలేక పోయాం. ఒక రోజు నేను లేనప్పుడు ఇక్కడికి వచ్చి ఇందులో కొన్ని వస్తువులు చేజిక్కించుకొని పోయాడు. వాటని బయట పెడతాడనే భయంతో అతన్ని మట్టిలో కలిపేశాం."

"అతనికి మీ సంగతి పూర్తిగా తెలిసినట్లుంది" సాలోచనగా అన్నాడు షాడో.

"అబ్బే అదేం కాదు. అతనికి పూర్తిగా......" సందేహంతో ఆగింది లూసియానా.

"ఇంకా దబాయించకు బేబీ. లేకపోతే నేనెందుకు రంగంలోకి వస్తాను? తనకు తెలిసిందంతా మాకు చెప్పి మరణించాడు. నిన్ను, నీ డ్రగ్స్, నీ స్నేహితుల్నీ

హైద్రాబాద్ పాల్ అందర్నీ చూపించి మరీ ప్రాణాలు వదిలాడు. మీ పని అయిపోయింది లూసియానా బేబీ. మీ ఫాదర్ కూడా ఫినిష్......"

"పాల్ నీకెలా తెలుసు? అతన్ని ఎప్పుడూ చూసావ్ ఏమయింది?"

కాని ఆమె ప్రశ్నకు సమాధానంగా చెప్పటానికి వ్యవధి లేకపోయింది. ద్వారంలోనుంచి పేలిన రివాల్వరుకు సమాధానంగా తనూ పేల్చాడు. మూడుసార్లు ఏకధాటివి. ఒక్కసారి కిటికీలలో నుంచి, తెరలచాటు నుంచి, ముగ్గురు వ్యక్తులు గదిలోకి దూకారు. అంటే వాటి వెనక కూడా రహస్యపు గదులున్నాయన్నమాట. అనుకుంటూ వారితో కలపడ్డాడు షాడో. కిందపడి దొర్లుకుంటూ వారి కాల్పులకు ప్రత్యుత్తర మీయసాగాడు.

బుల్లెట్సు గోలగా గదిలో ఎగర సాగాయి. ఒక మనిషి తలుపు పుచ్చుకొని పడిపోయాడు. టేబిల్ చాటు చేసుకొని మళ్ళీ కాల్చాడు షాడో. గదంతా రివాల్వరు నుండి వచ్చిన పొగతో నిండిపోయింది. లూసియానా అలాగే పడుకొని పిచ్చెక్కినట్లు నవ్వుతోంది. వున్నట్లుండి ఆమె నవ్వు ఆగిపోయింది. నవ్వు స్థానంలో గుండెలను పిండే అరుపు వినిపించింది. తల తిప్పి చూశాడు షాడో. నీట్ గా రెండు కళ్ళ మధ్య నుండి పోయిందొక బుల్లెట్. వెంటనే ఒక పిడుగు అతని నెత్తిమీద పడి కింద పడవేసింది.

"నో. నో. ఇతను బ్రతికి వుండటానికి వీలు లేదు." నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు షాడో.

"అతని చేతిమీద సి.ఐ.బి. బ్రాండు వుంది. అంటే మనం ఇక సి.ఐ.బినే ఎదుర్కోవాలి. ఇతను కనపడక పోతే ఇతనిలాంటివారు ఇంకా చాలామంది మిడతల దండులా వచ్చి దిగుతారు. అతని ప్రశ్నించి తెలుసుకోవటం మంచిది."

వారి మాటలను వింటూ అలాగే కళ్ళు మూసుకొని వున్నాడు షాడో. డాక్టర్ ట్విగ్ లూసియానా ఫాదర్, బ్లాక్ సూట్, బ్లాక్ గ్లాస్ వ్యక్తి. తన అధికారాన్ని కోల్పోయినట్లు కనపడుతున్నది.

అతన్ని ప్రశ్నించటానికి ఒప్పుకోలేదెవరూ. ఎంత త్వరగా చంపితే అంతమంచిదనే హడావుడిలో వున్నారు. కనురెప్పల చాటునుంచి చూశాడు. అందరూ అక్కడే వున్నారు.

గోల్డ్ రింగ్ తాగే డాక్టర్, సిల్క్ సూట్ వేసుకునే ట్వింగ్, యూనివర్శల్ ట్రేడ్ ప్రమోటర్స్ అధిపతి వాంగ్ టాంగ్, ఇంకొక గుర్తు తెలియని వ్యక్తి.

ఒక వ్యక్తి పోయి గదిలో వున్న డ్రయినేజి ట్రాప్ డోర్ తెరిచాడు. భరించరాని దుర్వాసన రూమునిండా వ్యాపించింది. అందరూ హేండ్ కర్చిఫ్స్‌తో ముక్కులు మూసుకున్నారు.

ఇద్దరు షాడోను ఎత్తి తీసుకుపోయి అందులోకి దించారు. తన ఆయుధాలు లేకపోవటం వలన షాడో గింజుకున్నా ప్రయోజనం లేకపోయింది. జరగబోయేది గ్రహించి వూపిరి బిగపట్టాడు.

మురికికంపు కొడుతున్న నీళ్ళల్లో రెండుసార్లు మునిగి లేచాడు షాడో. పైన ట్రాప్ డోర్ మూసుకుపోయింది. అక్కడే ఇంకో నిముషం వుంటే చావక తప్పదు నిశ్చింతగా ప్రాణాలు వదలటానికి ఇంకొక అర్జంటు పని మిగిలిపోయింది. పైకి

లేచి ట్రాప్ డోర్ బొక్కల్లో వేళ్ళు దూర్చి నిలబడ్డాడు. ఎడమ చేత్తో జేబులు తడుముకున్నాడు. అన్నీ పోయినా ఒక మెటల్ గోలీని వదిలారు అమాయకులు. అటువంటి వారిని వందమందిని పైకి పంపించటానికి అది ఒక్కటి చాలు.

"మనం ఖంగారు పడవలసిన పనిలేదు ఫ్రండ్స్." సిల్క్ సూటు అన్నాడు. "ప్రమాదకరమైన సి.ఐ.బి. ఏజెంటును మట్టుబెట్టాం. అతని డిపార్టుమెంటు వాళ్ళు వచ్చేందుకు ఇంకా కొంత టైం తీసుకుంటుంది. ఈ లోపలే మనం ఇక్కడి నుంచి మకాం మార్చేస్తాం. పాల్‌ని కలుసుకొని అక్కడి సెంటర్‌ని మనం స్వాధీన పరుచుకుందాం."

"మన కోసం హెలికాప్టరు రెడీగా వుంది దానిలో....." ద్వారం వైపు చూసి అలాగే ఆగిపోయాడు మాట మధ్యలో. అందరూ అటువైపు తిరిగి చూశారు.

ఆ గది తలుపు తెరుచుకొని లోపలకు అడుగుపెట్టిందొక ఆకారం. బురద చెత్త, నెత్తురు కలిసి ముఖం వికృతంగా వుంది. భరించలేని దుర్వాసన వస్తోంది. అతని దగ్గిర నుంచి, కళ్ళు ఎర్రబడి నిప్పులు కక్కుతున్నాయి.

ఒక్కక్షణం అలాగే నిలబడ్డాడు షాడో. కాళ్ళు ఎడమెడంగా వేసి తమాయించుకొని నిలుచున్నాడు. చేతిలో వున్న మెటల్ గోలీకున్న బటన్ నొక్కి గదిలోకి విసిరాడు. అతన్ని చూసే ఆతృతలో ఆ కదలికనెవరూ గమనించలేదు. షాడో వూపిరి బిగపట్టటంకూడా వారు చూడలేదు.

గాలి లోపలికి పీల్చకుండా పళ్ళ సందులోంచి మాట్లాడాడు షాడో.

"పాల్ పైన మీ కోసం ఒక సెంటర్ తెరిచి వుంచాడు. మీ డ్రగ్ రాకెట్ అక్కడ ప్రారంభించుకోండి. "

'మైగాడ్' కోపంతో వణికిపోతూ లేచాడు సిల్క్ సూట్ డాక్టర్ ట్వింగ్. రివాల్వర్ తీసి ట్రిగ్గర్ నొక్కాడు.

అంతే. ట్రిగ్గర్ మీది వేలు కదిలేలోపుగానే అతని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అప్పటికే తలలు వాల్చి పడిపోయారు మిగిలిన ముగ్గురూ. భయంకరమైన పాయిజన్ గాస్‌ని గదిలో నింపింది మెటల్ బాల్.

తూలుతూ గది బయటికి వచ్చి తలుపు వేశాడు షాడో. గుండెలనిండుగా గాలి పీల్చుకొని తడుముకుంటూ రోడ్డు మీదికి వచ్చాడు యూనివర్శల్ ట్రేడ్ ప్రమోటర్స్ గోడవున్స్‌లో నుంచి.

**- : జైహింద్ : –**